జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

కృష్ణ | సోమవారం 7 సెప్టెంబర్ 2026 | సంపుటి : 01 | సంచిక :235 | పేజీలు : 12 | వెల : 3/- | PRGI No. APTEL/26/A0119,

శ్రీ పరాభవ నామ సంవత్సరం ఆషాఢ మాసం గ్రీష్మ ఋతువు దక్షిణాయణం సూర్యోదయం: 5.42 । సూర్యాస్తమయం: 6.22 చంద్రోదయం: 4.57 । చంద్రాస్తమయం: 5.20 తిథి: బహుళ చతుర్దశి రా. 1.37 వరకు, తదుపరి అమావాస్య నక్షత్రం: పుష్యమి సా. 10.23 వరకు, తదుపరి ఆశ్లేష యోగం: సిద్ధి రా. 8.18 వరకు, తదుపరి వ్యతీపాత కరణం: భద్ర మ. 2.45 వరకు, తదుపరి శకుని రా. 1.37 వరకు, తదుపరి చతుష్పాద

Published from KRISHNA, GUNTOORU, VIJAYAWADA, VISHAKAPATANAM, TIRUPATHI http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com

WANTED

గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ ఇంఛార్జీలు మరియు మండల రిపోర్టర్లు కావలెను.

అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.

ప్రజాజ్యోతి

సంప్రదించవలసిన నెంబర్లు

9440231967

# సీట్ల పంపకాలపై ఉత్కంఠ



- మున్సిపల్ ఎన్నికల్లో 80:15:5 ఫార్ములా
- టీడీపీ, బీజేపీ, జనసేన నాయకత్వాల్లో తర్జనభర్జన
- ఎక్కువ స్థానాలు కావాలని జనసేన పట్టుబట్టే అవకాశం
- వైఎస్సార్‌సీపీకి అగ్ని పరీక్ష
- చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌ల స్థాయిలో తుది నిర్ణయం తీసుకోనున్నారు

**అమరావతి**

2024 సార్వత్రిక ఎన్నికల్లో ఉమ్మడిగా పోటీ చేసి విజయం సాధించిన టీడీపీ-బీజేపీ-జనసేన (కూటమి/ఎన్‌డీఏ) మున్సిపల్ ఎన్నికల్లో కలిసి పోటీ చేయనున్నాయి. అయితే సీట్ల పంపకం మీద ఇరుపార్టీల నేతల్లో చర్చలు సాగుతున్నాయి. టీడీపీలో 80:15:5 (టీడీపీ:జనసేన:బీజేపీ) ఫార్ములా ప్రస్తావన ఉంది. అయితే ఇంకా ఖరారు కాలేదు. చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌ల స్థాయిలో తుది నిర్ణయం తీసుకోనున్నారు. అయితే ఈ ఎన్నికల్లో జనసేన మరిన్ని సీట్లు (ముఖ్యంగా విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి వంటి కీలక కార్పొరేషన్లు) కోరుతోంది. బీజేపీ కూడా విశాఖ, రాజమహేంద్రవరం - మిగతా3లో

# కుప్పకూలిన హాస్టల్ భవనం

- ఐదుగురు మృతి- శిథిలాల కింద పలువురు-
- అమిత్ షా గోవా పర్యటన రద్దు
- ఢిల్లీ ఆర్‌కేపురంలోని సత్యనికేతన్ ప్రాంతంలో కూలిన హాస్టల్ భవనం
- సహాయ చర్యల్లో పాల్గొన్న పోలీసులు, ఫైర్ సిబ్బంది, డీడీఎంఏ, ఎన్‌డీఆర్ఎఫ్





## ఐరాస వరల్డ్ మ్యాప్‌లో జమ్మూకశ్మీర్, లద్దాఖ్

- భారత్ అధికారిక పటాల ప్రకారమే ఉండాలి
- జమ్మూకశ్మీర్, లద్దాఖ్‌ను భారత అధికారిక పటం ప్రకారమే చూపాలని భారత్ స్పష్టీకరణ
- తప్పుడు లేదా తప్పుదోవ పట్టించే చిత్రణ తమకు ఆమోదయోగ్యం కాదని వెల్లడి

# స్వచ్ఛ గోదావరి పవిత్ర పుష్కరాలు



- వడివడిగా ఏర్పాట్లు
- వచ్చే ఏడాది ఘనంగా గోదావరి పుష్కరాలు
- 'స్వచ్ఛ గోదావరి-పవిత్ర పుష్కరాలు' పేరుతో ప్రత్యేక కార్యక్రమాలు
- పాత రేవుల మరమ్మతులు, కొత్త రేవుల నిర్మాణం

**అమరావతి**

వచ్చే ఏడాది జరగనున్న గోదావరి పుష్కరాలను వైభవంగా నిర్వహించేందుకు కూటమి ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. ఈ ప్రతిష్ఠాత్మక వేడుకల కోసం 'స్వచ్ఛ గోదావరి-పవిత్ర పుష్కరాలు' అనే పేరుతో ప్రత్యేక అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. ఇందుకోసం ప్రభుత్వం అదనపు నిధులను కూడా కేటాయించింది. పంచాయతీరాజ్, గ్రామీణ తాగునీటి సరఫరా శాఖల సమన్వయంతో ముందుగా స్నానఘట్టాల (రేవుల) ప్రక్షాళన, కొత్త రేవుల నిర్మాణ పనులను - మిగతా3లో

# పక్కా ప్లాన్‌తో డ్రగ్స్ నివారణ

- డ్రగ్స్ రహిత భారత్‌తోనే 'వికసిత్ భారత్' కల సాకారం
- 2029 నాటికి దేశాన్ని పూర్తిగా డ్రగ్స్ రహితంగా మార్చడమే లక్ష్యం!
- "2047 నాటికి మాదకద్రవ్యాలు లేని యువశక్తి వికసిత్ భారత్‌ను ముందుకు నడిపించాలనేది ప్రధాని మోదీ లక్ష్యం
- 2029 నాటికి డ్రగ్స్ రహిత భారతదేశమే లక్ష్యం : కేంద్ర హోంమంత్రి అమిత్ షా



# పొగాకు రైతులకు భరోసా



- 'నో--బిడ్'లు తగ్గుముఖం.. కొనుగోలుదారుల పోటీతో మెరుగవుతున్న ధరలు
- వేలం కేంద్రాలను నిరంతర పర్యవేక్షణః మంత్రి అచ్చెన్నాయుడు
- రైతులకు మెరుగైన మార్కెట్, గిట్టుబాటు ధర కల్పించేందుకు ప్రభుత్వం నిరంతరం చర్యలు
- సెప్టెంబర్ 4 నాటికి 132 వేలం రోజుల్లో 86.59 మిలియన్ కిలోల పొగాకు మార్కెట్

**అమరావతి**

ఆంధ్రప్రదేశ్‌లో 2025--26 ఎఫ్‌సీవీ పొగాకు వేలాల్లో ఇటీవల మార్కెట్ పరిస్థితులు క్రమంగా మెరుగుపడుతున్నాయని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచనలు, మార్గదర్శకత్వంతో పొగాకు రైతులకు మెరుగైన మార్కెట్, గిట్టుబాటు - మిగతా3లో



## విద్యార్థుల గొంతు వినండి

- లేదంటే 'ఛత్రోం కీ గూంజ్' తీవ్రమవుతుంది: రాహుల్
- మహారాష్ట్రలో వేలాది మంది విద్యార్థుల నిరసనలపై రాహుల్ గాంధీ స్పందన
- పేపర్ లీకులు, నిలిచిపోయిన నియామకాలపై ప్రభుత్వాన్ని నిలదీత
- ఎంపీఎస్సీ విశ్వసనీయతను దెబ్బతీశారంటూ బీజేపీ ప్రభుత్వంపై ఆరోపణ

# ఏపీ పర్యాటకానికి మహర్దశ

- రూ.419 కోట్ల ప్రాజెక్టులకు కేంద్రం గ్రీన్ సిగ్నల్
- స్వదేశ్ దర్శన్, ప్రసాద్ పథకాల్లో రూ.419 కోట్ల ప్రాజెక్టులకు కేంద్రం పచ్చజెండా
- అరకు, అరసవల్లి, గన్నవరం, వేదగిరి ప్రాంతాల అభివృద్ధికి కేంద్రం ఆమోదం
- ప్రాజెక్టుల పనులకు త్వరలో టెండర్లు పిలవనున్న ప్రభుత్వం
- స్వదేశ్ దర్శన్, ప్రసాద్ పథకాల్లో రూ.419 కోట్ల ప్రాజెక్టులకు కేంద్రం పచ్చజెండా



**అమరావతి**

ప్రకృతి సోయగానికి నిలువుటద్దం పట్టే కొండ కోనలు, సహజసిద్ధ జల పాతాలు, నదుల పరవళ్లు, విశాల సముద్ర తీరం, ప్రఖ్యాత పుణ్యక్షేత్రాలు, వైభవాన్ని చాటే చారిత్రక ప్రదేశాలు, వారసత్వానికి ప్రతీకైన కోటలు ఇలాంటి విభిన్నమైన పర్యాటక ప్రాంతాల సమాహారం ఆంధ్రప్రదేశ్. రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాల గొప్పతనాన్ని అందరికీ పరిచయం చేసేలా ముందుకు సాగుతోంది కూటమి ప్రభుత్వం. ఈ రంగాన్ని ఆదాయ వనరుగా మార్చుకోవడంపై పూర్తి స్థాయిలో దృష్టి సారించింది. ఇటీవలి కాలంలో ఈ దిశగా ముమ్మర ప్రయత్నాలు జరుగుతుండటంతో పర్యాటక ప్రాంతాల్లో వసతులు మెరుగవుతున్నాయి. తాజాగా స్వదేశ్ దర్శన్ 2.0, ప్రసాద్ పథకాల కింద మొత్తం రూ.419.30 కోట్లతో అరకు, అరసవల్లి, గన్నవరం, వేదగిరి ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వ ప్రతిపాదనలను కేంద్రం ఆమోదించింది. ఈ ప్రాజెక్టుల పనులకు ప్రభుత్వం త్వరలో టెండర్లు పిలవనుంది. స్వదేశ్ దర్శన్ పథకంలో రూ.152 కోట్లతో ఇప్పటికే అరకు గుహలు, సూర్యలంక బీచ్ అభివృద్ధి - మిగతా3లో



## ఈ సమస్యల గురించి మాట్లాడరేం!

- అందనంత దూరంలో మీరు
- అందుకే ప్రచారాలు అవసరం
- మోదీపై ఖర్గే విమర్శలు
- ప్రధాని మోదీ 'యాంగ్రీ అంకుల్' వ్యాఖ్యలపై మల్లికార్జున ఖర్గే స్ట్రాంగ్ కౌంటర్

# కుప్పకూలిన హాస్టల్ భవనం

దేశ రాజధానిలో ఘోర విషాదం జరిగింది. ఢిల్లీ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్ సమీపంలోని సత్య నికేతన్‌లో ఐదంతస్తుల భవనం ఒక్కసారిగా కుప్పకూలింది. ఇందులో బాలుర పీజీ వసతి గృహం నిర్వహిస్తున్నారు. ఈ ఘటనలో ఇప్పటి వరకు ఐదుగురు మృతి చెందారు. మరో నలుగురి పరిస్థితి విషమంగా ఉంది. భవన శిథిలాల కింద పలువురు విదార్థులు చిక్కుకున్నట్లు అధికారులు అనుమానిస్తున్నారు. శిథిలాల కింద ఎంతమంది చిక్కుకున్నారు, ప్రమాదానికి గల కారణాలపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం, బేస్‌మెంట్‌తో పాటు ఐదు అంతస్తులు ఉన్న ఈ భవనం సుమారు 50 ఏళ్ల క్రితం నాటిది. ప్రమాదం జరిగిన సమయంలో బేస్‌మెంట్‌లో మరమ్మతు, నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఆదివారం మధ్యాహ్నం సుమారు 1.30 గంటల సమయంలో ఒక్కసారిగా భవనం కుప్పకూలింది. గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలతో బేస్‌మెంట్‌లో నీరు చేరి పునాది బలహీనపడటంతోనే భవనం కూలిపోయి ఉండొచ్చని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అయితే ప్రమాదానికి కచ్చితమైన కారణం ఇంకా తెలియలేదు. భవనం కూలిన వెంటనే ఢిల్లీ పోలీసులు, ఎన్‌డీఆర్ఎఫ్, ఢిల్లీ ఫైర్ సర్వీస్, డీడీఎంఏ బృందాలు ఘటనాస్థలికి చేరుకున్నాయి. అగ్నిమాపక వాహనాలు, క్యాట్స్ అంబులెన్సులను రంగంలోకి దించారు.

రెస్క్యూ బృందాలు శిథిలాలను తొలగిస్తూ బాధితుల కోసం గాలింపు చేపట్టాయి. ఇప్పటివరకు 8 మందిని బయటకు తీసినట్లు పోలీసులు తెలిపారు. వారిలో ఒకరు ఆస్పత్రికి తరలించే సమయానికే మృతి చెందగా, మరొకరు చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయారు. మరో నలుగురు ఐదుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. రెస్క్యూ చర్యల్లో గాయపడిన ఓ సిబ్బందికి చికిత్స అందించి డిశ్చార్జి చేశారు. 40 నుంచి 50 మంది వరకు శిథిలాల కింద చిక్కుకుని ఉండొచ్చని వారు అంచనా వేస్తున్నారు. 40 నుంచి 50 మంది వరకు శిథిలాల కింద చిక్కుకుని ఉండొచ్చని వారు అంచనా వేస్తున్నారు.



### విద్యార్థులతో నిండే ప్రాంతం

సత్య నికేతన్ ప్రాంతంలో ఇరుకైన వీధుల వెంట అనేక పీజీ వసతులు, హోటళ్లు, తినుబండారాల దుకాణాలు ఉన్నాయి. ఢిల్లీ యూనివర్సిటీకి చెందిన పలు కళాశాలలు సమీపంలోనే ఉండటంతో పెద్ద సంఖ్యలో విద్యార్థులు ఇక్కడ నివసిస్తుంటారు. స్థానిక ఢిల్లీ పోలీసు సిబ్బంది రాజెన్ ఛెత్రి తెలిపిన వివరాల ప్రకారం, కూలిపోయిన భవనంలో సుమారు 15 గదులు ఉండేవి. ఒక్కో గదిలో ఇద్దరు లేదా ముగ్గురు విద్యార్థులు ఉండేవారు. కేరళ, హరియాణా, ఉత్తర్‌ప్రదేశ్ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు ఎక్కువగా ఇక్కడ ఉండేవారని తెలిపారు. మోతీలాల్ నెహ్రూ కాలేజ్, ఆత్మారామ్ సనాతన్ ధర్మ కాలేజ్, శ్రీ వెంకటేశ్వర కాలేజీల్లో చదివే విద్యార్థులు ఈ పీజీలో ఉండేవారని, ఒక్కో బెడ్‌కు సుమారు రూ.12 వేల వరకు అద్దె చెల్లించేవారని చెప్పారు.

### ఘటనాస్థలికి సీఎం, ఎల్‌జీ

ప్రమాదం సమాచారం అందుకున్న వెంటనే ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా, లెఫ్టినెంట్ గవర్నర్ తారన్‌జీత్ సింగ్ సంధు, పోలీస్ కమిషనర్ అనురాగ్ కుమార్, ఎంపీ బాన్సురీ స్వరాజ్ ఘటనాస్థలికి చేరుకున్నారు. సహాయక చర్యలను పరిశీలించి అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. సహాయక చర్యలను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. పక్కనే ఉన్న భవనాన్ని ముందు జాగ్రత్తగా ఖాళీ చేయించినట్లు సీఎం రేఖా గుప్తా తెలిపారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఈ ఘటనపై విచారం వ్యక్తం చేశారు. ఢిల్లీ సీఎంతో పాటు పోలీస్ కమిషనర్, జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ డైరెక్టర్ జనరల్‌తో మాట్లాడి పరిస్థితిపై వివరాలు తెలుసుకున్నట్లు తెలిపారు. గాయపడిన వారికి అవసరమైన వైద్య సహాయం అందిస్తున్నారని, వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నట్లు సామాజిక మాధ్యమంలో పేర్కొన్నారు. అంతేకాకుండా తన గోవా పర్యటనను కూడా రద్దు చేసుకున్నట్లు తెలుస్తోంది.

### భవన యజమాని కోసం గాలింపు

'హాస్టల్ డేజ్' పేరుతో ఈ భవనంలో పీజీ నిర్వహిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. భవనం యజమాని గురుగ్రామ్‌లో ఉంటున్నట్లు వెల్లడించారు. ఘటనపై ఎఫ్ఐఆర్ నమోదు ప్రక్రియ ప్రారంభమైంది. భవనం యజమాని ఆచూకీ కోసం ఏడు నుంచి ఎనిమిది ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి. నిర్మాణ నాణ్యత, భవనం నిర్వహణ, బేస్‌మెంట్‌లో జరుగుతున్న పనులు తదితర అంశాలపై దర్యాప్తు కొనసాగుతోంది.

### స్పందించిన కాంగ్రెస్

ఈ ఘటనపై కాంగ్రెస్ తీవ్ర విచారం వ్యక్తం చేసింది. మోదీ ప్రభుత్వంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శలు గుప్పించారు. గాయపడిన వారికి తక్షణమే చికిత్స అందేలా చూడాలని కోరారు. ఈ కష్ట సమయంలో బాధితులకు, వారి కుటుంబాలకు అండగా ఉంటారని హామీ ఇచ్చారు. కళాశాలలు, విశ్వవిద్యాయాల్లో మంచి హాస్టళ్లు లేకపోవడంతో విద్యార్థులు ఇలాంటి పరిస్థితుల్లో నివసించాల్సి వస్తోందని అన్నారు. ప్రతివిద్యార్థి ప్రాణం అమూల్యమైనది, రక్షణ కల్పించాలని ఎక్స్?లో పోస్ట్ చేశారు.

# పక్కా ప్లాన్‌తో డ్రగ్స్ నివారణ

డ్రగ్స్ రహిత భారత్‌తోనే 'వికసిత్ భారత్' కల సాకరమవుతుందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా తెలిపారు. 2029 నాటికి దేశాన్ని పూర్తిగా డ్రగ్స్ రహితంగా మార్చేందుకు కేంద్రం స్పష్టమైన రోడ్‌మ్యాప్‌ను సిద్ధం చేసిందని వెల్లడించారు. గోవా పర్యటనలో భాగంగా ఆ రాష్ట్ర సీఎం ప్రమోద్ సావంత్‌తో అమిత్ షా ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మీడియా సమావేశంలో మాట్లాడిన అమిత్ షా, నక్సలిజాన్ని దేశం నుంచి ఏ విధంగా నిర్మూలించామో, అదే రీతిలో మత్తుపదార్థాల ముప్పును కూడా పూర్తిగా తుడిచిపెడతామని ధీమా వ్యక్తం చేశారు. "2047 నాటికి మాదకద్రవ్యాలు లేని యువశక్తి వికసిత్ భారత్‌ను ముందుకు నడిపించాలనేది ప్రధాని మోదీ లక్ష్యం. 2014 కంటే ముందు, నార్కోటిక్స్ (మాదక ద్రవ్యాల)పై పోరాటం చాలా వరకు చిన్న చిన్న విభాగాలుగు, ఒంటరిగానే సాగింది. అప్పట్లో ఏజెన్సీలు చిన్న చిన్న నిందితులను పట్టుకోవడంతోనే సరిపెట్టుకునేవి. కానీ మా ప్రభుత్వం ఈ పోరాటాన్ని జాతీయ భద్రతకు సంబంధించిన అత్యంత ముఖ్యమైన అంశంగా తీసుకుంది" అని అమిత్ షా అన్నారు. 2029 నాటికి మాదకద్రవ్య రహిత భారతే మా లక్ష్యం. అందుకే డ్రగ్స్ అక్రమ రవాణా, నిధుల సమీకరణ నుంచి పునరావాసం వరకు మొత్తం మాదక ద్రవ్యాల నెట్?వర్క్?ను నిర్మూలించడానికి కేంద్రం ఒక పక్కా వ్యూహాన్ని అవలంబిస్తోంది. అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ప్రత్యేక మాదక ద్రవ్యాల నిరోధక టాస్క్‌ఫోర్స్‌లను (ఏఎన్‌టీఎఫ్) ఏర్పాటు చేశాం. స్థానిక పోలీసులను జాతీయ వ్యూహంతో అనుసంధానించాం. అంతేకాదు మాదక ద్రవ్యాల నియంత్రణ బ్యూరో కేడర్?ను పునర్వ్యవస్థీకరించి, దాని



సిబ్బందిని, కార్యాచరణ సామర్థ్యాలను పెంచడం ద్వారా బలోపేతం చేశామని అమిత్?షా చెప్పారు. "మా ప్రభుత్వం మాదక ద్రవ్యాల నిరోధక ప్రచారం చేస్తుంది. అవగాహన, చికిత్స, కౌన్సిలింగ్, పునరావాసం, జీవనోపాధి అవకాశాలను అనుసంధానిస్తాం. అంతేకాదు డ్రగ్స్?కు బానిసలైన వ్యక్తులకు మద్దతు ఇవ్వడానికి 1933 మానస్ హెల్ప్?లైన్?ను ప్రవేశపెట్టాం. ఈ రాజకీయ సంకల్పం, సమన్వయంతో కూడిన చర్యలతో 2029 నాటికి మాదకద్రవ్య రహిత భారత్?ను సాధించడమే లక్ష్యంగా మోదీ సర్కార్ పనిచేస్తోంది" అని అమిత్? షా స్పష్టం చేశారు.

### మా పాలనలో కశ్మీర్ ప్రశాంతం!

ప్రధాని మోదీ హయాంలో జమ్మూకశ్మీర్ ఉగ్రవాదం తగ్గుముఖం పట్టిందని అమిత్ షా అన్నారు. అందుకే ఇప్పుడు ఆ ప్రాంతం అభివృద్ధి సాధిస్తూ, ప్రగతి పథంలో పయనిస్తోందని అన్నారు. ఆర్టికల్? 370 రద్దు తర్వాత జమ్మూకశ్మీర్‌లో వేర్పాటువాద భావనలు తగ్గాయని ఆయన అన్నారు. దేశ అంతర్గత భద్రతను మరింత మెరుగుపర్చడానికి కేంద్ర ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందని చెప్పారు.

### నక్సలిజం ఇప్పుడు గతమైపోయింది!

ఐదు దశాబ్దాలుగా దేశాన్ని పీడించిన నక్సలిజం ఇప్పుడు గతంగా మారిపోయిందని అమిత్? షా అన్నారు. "తిరుపతి నుంచి పశుపతినాథ్ వరకు 'రెడ్ (మావోయిస్టు) కారిడార్?' నిర్మించాలని కలలు కన్నవారు, నేడు ఆయుధాలు వీడి ప్రధాన స్రవంతిలో చేరారు. ఈశాన్య రాష్ట్రాలు కూడా ఇప్పుడు ప్రశాంతంగా ఉన్నాయి. అక్కడ 11వేల మందికి పైగా యువకులు ఆయుధాలు విడిచిపెట్టారు. మేము కన్సలిజాన్ని పూర్తిగా నిర్మూలించాం. మాదక ద్రవ్యాల ముప్పును కూడా అదే పద్ధతిలో ఎదుర్కొంటాం" అని అమిత్ షా స్పష్టం చేశారు.

### పరారీలో ఉన్న నేరస్తులను వెనక్కి రప్పిస్తాం!

2029 మార్చి నాటికి 100 జాతీయ, అంతర్జాతీయ నెట్?వర్క్?లను ధ్వంసం చేయడం, 100 మంది పరారీలో ఉన్న నేరస్తులను దేశానికి తిరిగి తీసుకురావడమే కేంద్రం లక్ష్యమని అమిత్ షా చెప్పారు. మార్చి 2029 నాటికి 100 జాతీయ మరియు అంతర్జాతీయ నెట్‌వర్క్‌లను ధ్వంసం చేయడం మరియు 100 మంది పరారీలో ఉన్న నేరస్తులను దేశానికి తిరిగి తీసుకురావడం కేంద్రం లక్ష్యమని షా చెప్పారు. విదేశాల్లో దాక్కున్న, పరారీలో ఉన్న నేరస్తులను తిరిగి తీసుకురావడం కోసం తమ ప్రభుత్వం మిషన్?-మోడ్ విధానంతో ముందుకు వెళ్తోందని అన్నారు. 2019 జులై నుంచి 2026 జులై మధ్య కాలంతో 36 దేశాల నుంచి 274 మంది మోస్ట్ వాంటెడ్? నేరస్థులను భారతదేశానికి తిరిగి తీసుకొచ్చినట్లు ఆయన తెలిపారు.

# ఐరాస వరల్డ్ మ్యాప్‌లో జమ్మూకశ్మీర్, లద్దాఖ్

వివిధ దేశాలు, ఖండాల విస్తీర్ణాన్ని మరింత కచ్చితంగా తెలిపేలా ఐక్యరాజ్యసమితి ఆమోదించిన ప్రపంచ పటానికి సంబంధించి భారత్ కీలక స్పష్టీకరణ ఇచ్చింది. సరికొత్త ప్రపంచ పటంలో కేంద్రపాలిత ప్రాంతాలైన జమ్ముకశ్మీర్, లద్దాఖ్?లను భారత అధికారిక మ్యాప్ ప్రకారమే చూపించాలని స్పష్టం చేసింది. దేశ భూభాగాన్ని తప్పుగా లేదా తప్పుదోవ పట్టించేలా చిత్రీకరిస్తే దాన్ని అంగీకరించబోమని విదేశాంగ శాఖ తేల్చిచెప్పింది. విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

'జమ్మూకశ్మీర్, లద్దాఖ్ సహా భారత సార్వభౌమ భూభాగాన్ని దేశ అధికార పటం ప్రకారమే చూపాల్సి ఉంటుంది. భారత భూభాగాన్ని తప్పుగా లేదా ప్రజలను తప్పుదోవ పట్టించే విధంగా చిత్రీకరించడం తమకు ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదు. భారత సార్వభౌమత్వం, ప్రాదేశిక సమగ్రతపై దేశ వైఖరి స్పష్టమైనది, స్థిరమైనది. ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడేది కాదు. ఖండాల భూభాగాలను వాటి సాపేక్ష పరిమాణాలకు అనుగుణంగా చూపించే ఈక్వల్-ఏరియా మ్యాప్ ప్రొజెక్షన్లను ప్రోత్సహించాలన్న ప్రాథమిక సూత్రానికే మద్దతు ఇచ్చాం. అంతేకానీ ఏదైనా ఒక నిర్దిష్ట ప్రపంచ పటం, ప్రొజెక్షన్ లేదా దేశాల సరిహద్దుల చిత్రణను ఆమోదించినట్లు కాదు. ఈ తీర్మానం ఏదైనా నిర్దిష్ట ప్రపంచ పటాన్ని అధికారికంగా స్వీకరించడం లేదా దానికి ధ్రువీకరణ ఇవ్వడం లేదు. అంతర్జాతీయ సరిహద్దులు, వివాదాస్పద ప్రాంతాలు, ప్రాంతాల పేర్లు వంటి రాజకీయ కార్టోగ్రఫీ అంశాలను కూడా ఇది పరిష్కరించదు' అని రణధీర్? జైస్వాల్ తెలిపారు.

### పటాల రూపకల్పనపై ప్రపంచవ్యాప్తంగా చర్చ



ప్రపంచ పటాల్లో ఖండాల పరిమాణాలు, ఆకృతులను ఎలా చూపించాలన్న అంశంపై కొంతకాలంగా చర్చ జరుగుతోంది. సంప్రదాయ మర్కేటర్ ప్రొజెక్షన్‌లో భూమధ్యరేఖకు దూరంగా ఉన్న ప్రాంతాలు వాస్తవ పరిమాణం కంటే పెద్దవిగా కనిపిస్తాయన్న విమర్శలు ఉన్నాయి. దీనికి ప్రత్యామ్నాయంగా ఖండాల విస్తీర్ణాలను సాపేక్షంగా ఖచ్చితంగా చూపించే ఈక్వల్-ఏరియా ప్రొజెక్షన్లను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో తాజా యూఎన్ తీర్మానం తీసుకొచ్చారు. ఇది సెప్టెంబర్ 4న ఆమోదం పొందింది. కరెక్ట్? ది మ్యాప్? అనే నినాదంతో ఐరాస సర్వసభ్య సమావేశంలో ఆఫ్రికాలోని టోగో దేశం ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టింది. ఈ తీర్మానానికి భారత్?తో సహా 164 దేశాలు మద్దతు తెలిపాయి. అమెరికా ఒక్కటే మాత్రం వ్యతిరేకంగా ఓటు వేసింది. ఎస్టోనియా, జార్జియా, లిథువేనియా, మోల్డోవా, సెర్బియా, ఉక్రెయిన్ ఓటింగ్‌కు దూరంగా ఉన్నాయి. అయితే ఈ కొత్త ప్రపంచ పటంలో భారత్?, ఆఫ్రికాలు ప్రస్తుతానికి కంటే పెద్దగా కనిపించనున్నాయి. అమెరికా కొంత చిన్నదిగా కనిపించనుంది. అయితే దేశాల వాస్తవ సరిహద్దుల్లో ఎటువంటి మార్పులు ఉండవు. 16వ శతాబ్దంలో నౌకాయానం కోసం రూపొందించిన మర్కేట పటాన్ని ఐరాస తీర్మానం కాలం చెల్లినదిగా ప్రకటించింది. ప్రపంచ పటాన్ని మరింత కచ్చితంగా చూపే కొత్త పటాన్ని ప్రామాణికంగా ప్రకటిస్తూ ఐరాస ప్రవేశపెట్టిన తీర్మానం ఉద్దేశాన్ని మేం స్వాగతిస్తున్నాం అని ఐరాసలో భారత ప్రతినిధి రఘు పురీ పేర్కొన్నారు.

తీర్మానంపై ఓటింగ్ సందర్భంగా భారత్ తన వైఖరిని స్పష్టం చేసింది. మరింత కచ్చితమైన, సమతుల్యమైన కార్టోగ్రఫీ విధానాలను ప్రోత్సహించాలన్న తీర్మానం ఉద్దేశాన్ని భారత్ స్వాగతిస్తోందని ఐరాసలోని భారత శాశ్వత మిషన్ ఫస్ట్ సెక్రటరీ రఘు పూరీ తెలిపారు. ప్రపంచ భౌగోళిక స్వరూపాన్ని, వివిధ ప్రాంతాల పరిమాణాలను సమాజాలు ఎలా అర్థం చేసుకుంటాయన్న విషయంలో పటాలకు కీలక పాత్ర ఉందని పేర్కొన్నారు. అందువల్ల ప్రపంచ పటాల్లో భూభాగాల వాస్తవ విస్తీర్ణానికి తగిన ప్రాతినిధ్యం ఉండటం అవసరమని అభిప్రాయపడ్డారు. ఈ తీర్మానికి మద్దతు ఇవ్వడానికి ఈక్వల్ ఎర్త్ ప్రొజెక్షన్?ను సమర్థించినట్లుగా భావించకూడదని తెలిపారు. తీర్మానాన్ని విస్తృతంగా ఈక్వల్ ఏరియా మ్యాప్? ప్రొజెక్షన్స్? వినియోగించడం, వాటిని పరిగణనలోకి తీసుకోవడాన్ని ప్రోత్సహించేదిగా మాత్రమే అర్థం చేసుకోవాలని పేర్కొన్నారు. నిర్దిష్టంగా ఈక్వల్ ఎర్త్ లేదా మరేదైనా ఒకే పట విధానాన్ని ఆమోదిస్తున్నట్లు భావించరాదని స్పష్టం చేశారు.

## ఈ సమస్యల గురించి మాట్లాడరేం!

ప్రధాని నరేంద్ర మోదీ 'యాంగ్రీ అంకుల్' వ్యాఖ్యలకు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తనదైన శైలిలో కౌంటర్ ఇచ్చారు. ఢిల్లీ యూనివర్సిటిలోని శ్రీరామ్ కాలేజ్ ఆఫ్ కామర్స్‌లో మాట్లాడిన ప్రధాని మోదీ విద్య, ఉద్యోగాలు, యువజన సంక్షేమం గురించి మాట్లాడకుండా, దానిని రాజకీయ ప్రచారంగా మార్చేశారని ఎక్స్ వేదికగా మండిపడ్డారు. జవాబుదారీతనం నుంచి తప్పించుకోవడానికి ప్రధాని మోదీ ప్రతిపక్షాలపై రాజకీయ ముద్రలు వేస్తున్నారని విమర్శించారు. విమర్శనాత్మక ప్రశ్నలను అణచివేయడానికి, పాలనా వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికి విపక్షాలను కించపరిచే విశేషణాలను వాడడం ఆయనకు అలవాటుగా మారిందని ఎక్స్ వేదికగా మండిపడ్డారు.

"ప్రధాని మోదీ- మీరు నిన్న ఢిల్లీ యూనివర్సిటీలోని ఎస్?ఆర్?సీసీని సందర్శించారు. దేశ యువత, విద్య, వారి భవిష్యత్తుపై మాట్లాడడానికి అది ఒక మంచి అవకాశం. కానీ మీరు యువత వేసే ప్రశ్నలను ఎదుర్కొనేందుకు బదులుగా, మీ ప్రసంగం కాస్త మరో రాజకీయ ప్రచారంగా మార్చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నలను అణచివేయడానికి, సొంత వైఫల్యాలను దాచడానికి మీరు ప్రతిపక్షాలకు కొత్త విశేషణాలను సృష్టిస్తున్నారు. నారాజ్ ఫూఫా (కోపదారి మేనమామ), దిమాగీ నక్సల్, అర్బన్ నక్సల్, ఖాన్ మార్కెట్ గ్యాంగ్, ఆందోళనజీవి, పరాన్నజీవి ఇలా చాలా విశేషణాలు మారుతూ ఉన్నప్పటికీ, మీ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలు మాత్రం మారడం లేదు."

### ఈ సమస్యల గురించి మాట్లాడరేం!

యువత రిపోర్ట్ కార్డులో పెరుగుతున్న నిరుద్యోగం, ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న ప్రభుత్వ నియామకాలు, పేపర్ లీక్‌లు, ఖరీదైన విద్య, తగ్గిపోతున్న స్కాలర్‌షిప్ అవకాశాలు, విశ్వవిద్యాలయాల స్వయంప్రతిపత్తిపై పెరుగుతున్న ఒత్తిడి లాంటివి ఉన్నాయని ఖర్గే పేర్కొన్నారు. "మోదీ- మీరు అందనంత దూరంలో ఉన్నప్పుడే మీకు ప్రత్యేక పరిచయ కార్యక్రమం అవసరం అవుతుంది. మోదీ తన రిపోర్టు కార్డు చూపించారు. దేశ యువత కూడా తన రిపోర్టు కార్డుతో సిద్ధంగా ఉంది. ఆ రిపోర్టు కార్డులో నిరుద్యోగం, ఏళ్ల తరబడి నిలిచిపోయిన ప్రభుత్వ నియామకాలు, పేపర్ లీక్?లతో ఇబ్బందిపడుతున్న విద్యార్థులు, రోజురోజుకూ ఖరీదు అవుతున్న విద్య, తగ్గిపోతున్న స్కాలర్‌షిప్ అవకాశాలు, యూనివర్సిటీల స్వయంప్రతిపత్తిపై పెరుగుతున్న ఒత్తిడి మొదలైనవి ఉన్నాయి. అందుకే విద్యార్థుల గొంతుక వినండి. సమస్యను పక్కదారి పట్టించడం వల్ల అవి పరిష్కారం కావు" అని ఖర్గే ఘాటు వ్యాఖ్యలు చేశారు.

### యాంగ్రీ అంకుల్స్

శనివారం ప్రధాని మోదీ శ్రీరామ్ కాలేజ్ ఆఫ్ కామర్స్ శతాబ్ది ఉత్సవాలను ఉద్దేశించి మాట్లాడుతూ, ప్రభుత్వ కార్యక్రమాలను విమర్శించేవారిపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వ చేపట్టే ప్రతి అభివృద్ధి కార్యక్రమాన్ని వ్యతిరేకించేవారిని 'యాంగ్రీ అంకుల్స్' అని అభివర్ణించారు. మోదీ ఎస్ఆర్‌సీసీ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, "ఈ క్యాంపస్ వెలుపల, మీకు ఒక కొత్త ప్రపంచం కనిపిస్తుంది. మీరు రెండు రకాల వ్యక్తులను కలుస్తారు. మొదటి రకం వారు సమాజం శక్తిని దేశ శక్తిగా మార్చే వ్యక్తులు. ఇక రెండో రకం వాళ్లు ఏ పని ప్రారంభమైనా యాంగ్రీ అంకుల్‌లాగా మారిపోతారు. ప్రతి పనిని వ్యతిరేకించడమే వారి పని. వారికి ఒకే ఒక డైలాగు తెలుసు- 'దీని అవసరం ఏముంది'. మేము ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన విగ్రహాన్ని (స్టాట్యూ ఆఫ్ యూనిటీ) నిర్మిస్తున్నప్పుడు, కొందరు ఫూఫాలు (అసంతృప్తితో ఉండే బంధువులు) దీని అవసరం ఏముందని అన్నారు. మేము హైస్పీడ్ రైళ్లు, యూపీఐ ప్రారంభించినప్పుడు కూడా అలానే అన్నారు. కానీ వారందరికీ భారతదేశం తగిన సమాధానం ఇచ్చింది. దేశానికి అవసరమైన పనిని చేయడానికి భారతదేశాన్ని ఎవరూ అపలేరు" అన్నారు. ఈ నేపథ్యంలోనే ప్రధాని మోదీపై ఖర్గే విమర్శలు గుప్పించారు.

## విద్యార్థుల గొంతు వినండి



మహారాష్ట్రలో వేలాది మంది విద్యార్థులు వీధుల్లోకి వచ్చి నిరసనలు తెలుపుతున్నారని కాంగ్రెస్ నాయకుడు, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. విద్యార్థుల సమస్యలకు కారణం కేవలం ఒక పరీక్ష లేదా నియామక ప్రక్రియ కాదని, మొత్తం వ్యవస్థపై వారికి నమ్మకం దెబ్బతినడమే ప్రధాన కారణమని పేర్కొన్నారు. బీజేపీ ప్రభుత్వం విద్యార్థుల గొంతు విని వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే 'ఛత్రోం కీ గూంజ్' (విద్యార్థుల ప్రతిధ్వని) మరింత బిగ్గరగా వినిపిస్తుందని హెచ్చరించారు. ఈ మేరకు రాహుల్ గాంధీ ఆదివారం ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

మహారాష్ట్రలో విద్యార్థులు శాంతియుతంగా నిరసనలు చేపడుతున్నారని రాహుల్ గాంధీ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. పరీక్షలు, ఉద్యోగ నియామకాల్లో ఎదురవుతున్న సమస్యలతో వారు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఇది ఒక్క అంశానికి పరిమితమైన సమస్య కాదని, విద్యా వ్యవస్థ, నియామక ప్రక్రియ, ప్రభుత్వ సంస్థలపై విద్యార్థుల్లో నమ్మకం సన్నగిల్లిందని పేర్కొన్నారు. బీజేపీ పాలనలో విద్యార్థులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని రాహుల్ ఆరోపించారు. పేపర్ లీకులు, నియామకాలు నిలిచిపోవడం వంటి అంశాలు ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువతను తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయని అన్నారు. అదేవిధంగా విద్యా ఖర్చులు భరించలేని స్థాయికి చేరాయని, హాస్టళ్లలో సరైన సౌకర్యాలు లేవని విమర్శించారు. హాస్టళ్లలో అమానవీయ పరిస్థితులు, నాణ్యత లేని ఆహారం వంటి సమస్యలను కూడా ఆయన ప్రస్తావించారు. డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ)లోనూ మోసాలు జరుగుతున్నాయని ఆరోపించారు.

"మహారాష్ట్రలో వేలాది మంది విద్యార్థులు వీధుల్లోకి వచ్చి శాంతియుతంగా నిరసన తెలుపుతున్నారు. దీనికి కారణం కేవలం ఒక పరీక్ష లేదా నియామకం కాదు. మొత్తం వ్యవస్థపై పూర్తిగా దెబ్బతిన్న విశ్వాసమే. కేంద్ర ప్రభుత్వం అయినా, రాష్ట్ర ప్రభుత్వం అయినా, ప్రతి విద్యార్థి బీజేపీ పాలన వల్ల బాధపడుతున్నారు. పేపర్ లీకులు, నిలిచిపోయిన నియామకాలు, భరించలేని విద్యా ఖర్చు, హాస్టళ్లలో అమానవీయ పరిస్థితులు, విషంలాంటి ఆహారం, డీబీటీలో మోసాలు. ఇప్పుడు ఎంపీఎస్‌సీ వంటి రాజ్యాంగబద్ధమైన సంస్థను తమ ఆధీనంలోకి తీసుకుని, దాని విశ్వసనీయతను నాశనం చేశారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం వారు చేస్తున్న ప్రతి డిమాండ్ సమర్థనీయమైనదే. ప్రభుత్వం వారి గొంతు విని తక్షణ చర్యలు తీసుకోవాలి. లేకపోతే న్యాయం జరిగే వరకు విద్యార్థుల ఈ ప్రతిధ్వని మరింత బిగ్గరగా వినిపిస్తూనే ఉంటుంది"

### ఎంపీఎస్‌సీపై తీవ్ర వ్యాఖ్యలు

మహారాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఎంపీఎస్‌సీ) వంటి రాజ్యాంగబద్ధమైన సంస్థ విషయంలోనూ రాహుల్ గాంధీ బీజేపీ ప్రభుత్వంపై విమర్శలు చేశారు. ఎంపీఎస్‌సీని ప్రభుత్వం తన ఆధీనంలోకి తీసుకుని, దాని విశ్వసనీయతను నాశనం చేసిందని ఆరోపించారు. ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎంపీఎస్‌సీ నిర్వహించే పరీక్షలను ఆశ్రయించే అభ్యర్థులకు ఆ సంస్థపై నమ్మకం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. విద్యార్థులు తమ ఉజ్వల భవిష్యత్తు కోసం చేస్తున్న ప్రతి డిమాండ్ సమర్థనీయమైనదేనని ఆయన అన్నారు. విద్యార్థుల ఆందోళనలను ప్రభుత్వం అణచివేయడం లేదా నిర్లక్ష్యం చేయడం కాకుండా, వారి సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. మహారాష్ట్రలో ప్రస్తుతం ఉన్న నియామక పరీక్షల విధానంపై ప్రభుత్వం సమగ్ర సమీక్ష చేపట్టాలని నిర్ణయించింది. ఇందుకోసం ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. పరీక్షా విధానాన్ని మరింత పారదర్శకంగా, సురక్షితంగా, విశ్వసనీయంగా మార్చేందుకు అవసరమైన చర్యలను ఈ కమిటీ సూచించనుంది. ప్రశ్నపత్రాల తయారీ, వాటి పరిశీలన, ప్రశ్నపత్రాల గోప్యత, సురక్షిత నిర్వహణ వంటి అంశాలను కమిటీ పరిశీలించనుంది. అలాగే పరీక్షా కేంద్రాల నిర్వహణ, భద్రత, సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, అవకతవకల నివారణ వంటి అంశాలపైనా దృష్టి పెట్టనుంది.

### ఫిర్యాదుల పరిష్కారంపైనా దృష్టి

పరీక్షల నిర్వహణలో వివిధ ఏజెన్సీల మధ్య సమన్వయం ఎలా ఉండాలి? అభ్యర్థుల ఫిర్యాదులను వేగంగా ఎలా పరిష్కరించాలి? పరీక్ష రాసే అభ్యర్థులకు మెరుగైన అనుభవం కల్పించేందుకు ఎలాంటి మార్పులు చేయాలి? అనే అంశాలను కూడా కమిటీ పరిశీలించనుంది. మహారాష్ట్రలో గిరిజన విద్యార్థులు, ఉద్యోగార్థులు పలు సమస్యలపై ఆందోళనలు చేపట్టిన నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ముఖ్యంగా హాస్టల్ పరిస్థితులు, విద్యార్థుల భద్రత, పరీక్ష పత్రాల లీకేజీలు వంటి అంశాలపై నిరసనలు జరిగాయి. విద్యార్థులు, ఉద్యోగార్థుల కీలక డిమాండ్లను ప్రభుత్వం అంగీకరించి, పరీక్షల సంస్కరణల కోసం కమిటీని ఏర్పాటు చేసింది.

# 'స్వచ్ఛ గోదావరి-పవిత్ర పుష్కరాలు'

-మొదటిపేజీ తరువాయి
చేపట్టనున్నారు.
ఉమ్మడి గోదావరి జిల్లాల్లో ప్రవహించే అఖండ గోదావరి, వశిష్ఠ, గౌతమి నదులకు కుడి, ఎడమ వైపున పుష్కర ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. అక్కడ ఉన్న 238 పాత రేవులకు అవసరమైన మరమ్మతులు చేయనున్నారు. వీటితో పాటు భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని కొత్తగా మరో 16 రేవులను నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ పనులన్నింటి కోసం రూ. 210.05 కోట్ల అంచనాతో అధికారులు టెండర్లు పిలిచారు.



### తాగునీటి సదుపాయాలు
పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మౌలిక వసతులు మెరుగుపరుస్తున్నారు. బీఆర్ అంబేద్కర్ కోనసీమ, పశ్చిమ గోదావరి, పోలవరం జిల్లాల పరిధిలో రూ.90 కోట్లతో 7 నియోజకవర్గాల్లో మొత్తం 111 రోడ్లను నిర్మించనున్నారు. అలాగే, రేవుల వద్ద భక్తుల కోసం రూ.10 కోట్లతో తాగునీటి సదుపాయం కల్పిస్తారు. పశ్చిమ గోదావరి జిల్లాలోని మూడు నియోజకవర్గాల పరిధిలో 30కి పైగా సిమెంటు, తారురోడ్ల నిర్మాణ పనులు కూడా చేపట్టనున్నారు. పశ్చిమ గోదావరి జిల్లాలోని ఆచంట, పాలకొల్లు, నరసాపురం నియోజకవర్గాల గుండా వశిష్ఠ గోదావరి ప్రవహిస్తోంది. ఇక్కడ తొలి దశలోనే రూ. 30 కోట్లకు పైగా ఖర్చు చేసి 34 రేవుల పనులను పూర్తి చేయాలని అధికారులు భావిస్తున్నారు. ప్రస్తుతం 20కి పైగా గ్రామాల పరిధిలోని స్నానాల రేవులు వరద మేటలతో నిండిపోయాయి. పెదమల్లం లాంటి ప్రాంతాల్లో అయితే రేవులు పూర్తిగా పూడిపోయాయి. ప్రధానమైన నరసాపురం, దొడ్డిపట్ల, సిద్ధాంతం, కోడేరు రేవుల వద్ద మరుగుదొడ్ల సౌకర్యాలు లేవు. ఈ సమస్యలన్నింటినీ పుష్కరాల నాటికి పరిష్కరించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

### నవంబర్‌లో పనులు ప్రారంభం
పుష్కరాల్లో స్నానాల రేవుల నిర్మాణమే కీలకం కాబట్టి ఈ పనులపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఈ నిర్మాణాలకు సంబంధించిన టెండర్ల ప్రక్రియ మరో వారం రోజుల్లో ముగియనుందని ఇరిగేషన్ హెడ్‌వర్క్స్ జేఈలు సుధాకర్, పవన్‌కుమార్ తెలిపారు. టెండర్ల ప్రక్రియ పూర్తి కాగానే నవంబర్ నెలలో పనులను ప్రారంభిస్తామని వారు వెల్లడించారు.

## రైల్వే స్టేషన్లలో ప్రయాణికులకు నరకం
# కనీస వసతులు కరవు

రైల్వే రంగంలో ఎంతో సాంకేతికత పెరిగింది. రైళ్లు, స్టేషన్లను ఆధునీకరిస్తున్నారు. కానీ, క్షేత్రస్థాయిలో ప్రయాణికులకు మాత్రం కష్టాలు తీరడం లేదు. రాయదుర్గం, కల్యాణదుర్గం గ్రామీణం, గుత్తి, తాడిపత్రి, గుంతకల్లు తదితర రైల్వే స్టేషన్లలో కనీస మౌలిక సదుపాయాలు లేవు. అధికారుల నిర్లక్ష్యంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. స్టేషన్ల అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతుండటంతో ప్రయాణికులు నరకం అనుభవిస్తున్నారు.




### తాగునీరు, మరుగుదొడ్లు కరవు
చాలా స్టేషన్లలో ప్రయాణికులు కూర్చునేందుకు కనీసం బెంచీలు లేవు. మరుగుదొడ్ల పరిస్థితి దారుణంగా ఉంది. ఉన్న మరుగుదొడ్లను శుభ్రం చేయకపోవడంతో దుర్గంధం వెదజల్లుతున్నాయి. కొన్నిచోట్ల మరుగుదొడ్లకు తాళాలు వేశారు. అధికారులను అడిగి తాళాలు తెచ్చుకోవాల్సిన దుస్థితి నెలకొంది. కొత్త మరుగుదొడ్ల నిర్మాణాలు ఇంకా పూర్తి కాలేదు. పర్యవేక్షణ లేకపోవడంతో కొందరు బహిరంగంగా మూత్ర విసర్జన చేస్తున్నారు. తాగునీటి కోసం పైపులు వేసినా వాటికి కుళాయిలు బిగించలేదు. కొన్నిచోట్ల ఉప్పు నీరు వస్తోంది. ప్లాట్‌ఫారాలపై నిర్మించిన నీటి తొట్టెలు ధ్వంసమైనా మరమ్మతులు చేయడం లేదు. కనీసం అవసరమైన దుకాణాలు కూడా అందుబాటులో లేవు.

### ప్లాట్‌ఫారాలపై అగచాట్లు
చాలా స్టేషన్లలో ప్లాట్‌ఫారాలపై ప్రయాణికులు తలదాచుకునేందుకు కనీసం షెల్టర్లు లేవు. ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ రైళ్ల కోసం పడిగాపులు కాయాల్సి వస్తోంది. మరోవైపు ప్లాట్‌ఫారాల విస్తరణ, నిర్మాణ పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయి. ప్రయాణికులు ఒక ప్లాట్‌ఫారం నుంచి మరో ప్లాట్‌ఫారానికి వెళ్లేందుకు ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు లేవు. కొన్నిచోట్ల పై వంతెనలు నిర్మించినా అవి ప్రారంభానికి నోచుకోలేదు. దీంతో ప్రయాణికులు ప్రాణాలకు తెగించి పట్టాలు దాటుతున్నారు. రైల్వే స్టేషన్లలో వృద్ధులు, దివ్యాంగులకు అవస్థలు తప్పడం లేదు. దివ్యాంగుల కోసం ర్యాంపులు నిర్మించినా, వారికి అవసరమైన వీల్ ఛైర్లు అందుబాటులో ఉంచలేదు. పై అంతస్తులకు లేదా వేరే ప్లాట్‌ఫారం మారేందుకు లిఫ్టుల సౌకర్యం లేదు. దీంతో వృద్ధులు, గర్భిణులు, దివ్యాంగులు ఎత్తైన మెట్లు ఎక్కలేక తీవ్ర అవస్థలు పడుతున్నారు.

### శివారు స్టేషన్లు
కొన్ని రైల్వే స్టేషన్లు పట్టణ శివారులో ఉన్నాయి. దీంతో ప్రయాణికులు స్టేషన్‌కు చేరుకోవడం చాలా కష్టంగా మా రింది. దీనికి తోడు రైల్వే అధికారులు తరచూ రైళ్లను శివారు ప్లాట్‌ఫారాలపై ఆపుతున్నారు. ప్రయాణికులు అక్కడికి చేరుకునేలోపే దుండగులు ఆసరాగా తీసుకుని చోరీలకు పాల్పడుతున్నారు. ప్రయాణికుల భద్రత గాలిలో కలిసిపోతోం ది. ఇప్పటికైనా రైల్వే ఉన్నతాధికారులు స్పందించి, తక్షణమే మౌలిక సదుపాయాలు కల్పించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

# సుదీర్ఘ పాదయాత్రకు జగన్

**కడప :** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో  పాదయాత్ర అనేది కేవలం ఒక ప్రచార సాధనమే కాదు.. అధికార పీఠాన్ని దక్కించుకునే ఒక పొలిటికల్ మాస్టర్ స్ట్రోక్. తండ్రి వైఎస్సార్ అడుగుజాడల్లో నడిచి 2017లో సుదీర్ఘ పాదయాత్ర ద్వారా 2019లో ప్రభంజనం సృష్టించిన వైఎస్‌ఆర్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, ఇప్పుడు మరొకసారి అదే అస్త్రాన్ని ప్రయోగించేందుకు సిద్ధమవుతున్నారు. వైఎస్సార్ జయంతిని పురస్కరించుకుని 2027 జూలై 8 నుంచి లేదా ఆ తర్వాతి నెలల్లో 2029 ఎన్నికలే లక్ష్యంగా సుదీర్ఘ పాదయాత్రను ప్రారంభించాలని జగన్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వం ఏర్పడిన మూడున్నరేళ్ల తర్వాత పూర్తిస్థాయిలో రోడ్డెక్కి, ఎన్నికల దాకా ప్రజల్లోనే ఉండటం ద్వారా ప్రజా మూడ్‌ను తమ వైపు తిప్పుకోవచ్చని వైసీపీ బలంగా నమ్ముతోంది.వైసీపీ అంచనాల ప్రకారం.. ప్రభుత్వ పదవీకాలం చివరి దశకు వచ్చేసరికి కూటమి ప్రభుత్వంపై సహజంగానే కొంత అసంతృప్తి లేదా వ్యతిరేకత మొదలవుతుంది. ఆ సమయానికే సరిగ్గా క్షేత్రస్థాయిలోకి వెళ్లి, ప్రభుత్వం ఇచ్చిన హామీల వైఫల్యాలను ఎండగడుతూ, సంక్షేమ పథకాల కొరతను ఎత్తిచూపితే ప్రజల మూడ్ వేగంగా మారుతుందనేది జగన్ వ్యూహం. గతంలో కూడా 2017 నవంబర్ నుంచి 2019 ఎన్నికల వరకు సుమారు 14 నెలల పాటు నిరంతరం ప్రజల్లో ఉండటం వల్లనే 151 సీట్ల భారీ విజయం సాధ్యమైందని, అదే సెంటిమెంట్‌ను, రాజకీయ వ్యూహాన్ని మళ్లీ పునరావృతం చేయాలని భావిస్తున్నారు.అయితే, 2017 నాటి పరిస్థితులకు, ప్రస్తుత 2027-28 నాటి రాజకీయ పరిస్థితులకు భూమికి




ఆకాశానికి ఉన్నంత తేడా ఉందని చాలా మంది చెబుతున్నారు.  2017లో జగన్ ఒక నవ నాయకుడిగా , అవకాశం ఇవ్వాల్సిన కొత్త ఆశాకిరణంగా ప్రజల్లోకి వెళ్లారు. కానీ ఇప్పుడు ఆయన 5 ఏళ్ల పాలనా అనుభవాన్ని, ప్రజా తీర్పును చూసి ప్రతిపక్షంలో కూర్చున్న నాయకుడు. గతంలో తను ఇచ్చిన హామీలు, ఐదేళ్ల వైసీపీ పాలనలో జరిగిన అభివృద్ధి లేదా వివాదాలపై కూటమి ప్రభుత్వం ఆయనను క్షేత్రస్థాయిలోనే డిఫెన్స్‌లో పడేసే ప్రమాదం ఉంది.  అప్పట్లో అలా చేశారు.. ఇప్పుడు ఇలా అడుగుతున్నారు అనే ప్రశ్నలు ఆయనకు పెద్ద సవాలుగా మారవచ్చు.మరోవైపు, అధికారంలో ఉన్న టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి సైతం జగన్ యాత్రను తేలికగా తీసుకునే ప్రసక్తే లేదు. నాడు చంద్రబాబు ఒంటరిగా ఉంటే, నేడు పవన్‌కల్యాణ్ తోడ్పాటు, కేంద్రంలోని బీజేపీ అండదండలు కూటమికి బలంగా ఉన్నాయి. జగన్ పాదయాత్ర ప్రారంభించేనాటికే కౌంటర్ వ్యూహాలతో, ముఖ్యంగా సూపర్‌సిక్స్ హామీల అమలు, క్షేత్రస్థాయి సంక్షేమ ఫలాలను వేగవంతం చేయడం ద్వారా జగన్ పాదయాత్ర మైలేజ్‌ను తగ్గించడానికి కూటమి నాయకత్వం ప్రయత్నిస్తుంది. పైగా, జగన్ పాదయాత్ర వెళ్లే మార్గాల్లో ఎదురయ్యే ప్రజా నిలదీతలను తిప్పికొట్టడం వైసీపీ కేడర్‌కు పరీక్షగా మారనుంది. దీనికితోడు వైసీపీలో ఉన్న ప్రధాన లోపం ద్వితీయ శ్రేణి నాయకత్వం వికేంద్రీకరణ . ఒకప్పుడు జగన్ వెనక నడిచిన సీనియర్ నేతలలో కొందరు నిశ్శబ్దంగా ఉండటం, మరికొందరు పార్టీ వీడటం వల్ల క్షేత్రస్థాయి యంత్రాంగం బలహీనపడింది. కేవలం జగన్ ఇమేజ్ మీదనే మళ్లీ గెలవడం కష్టమని, బలమైన నియోజకవర్గ స్థాయి నేతలు లేకపోతే పాదయాత్ర తెచ్చిపెట్టే ఉత్సాహం ఓట్లుగా మారడం కష్టమనే అభిప్రాయం ఉంది. కేడర్‌లో మళ్లీ జోష్ నింపడం, నైరాశ్యంలో ఉన్న నేతలకు భరోసా ఇవ్వడం జగన్ ముందున్న తక్షణ కర్తవ్యం. ప్రతీసారి పాదయాత్ర ఒకే రకమైన ఫలితాన్ని ఇస్తుందనుకోవడం పొరపాటే. ప్రతిపక్ష నేతగా ప్రజల వద్దకు వెళ్లినప్పుడు వారి సమస్యలకు పరిష్కారం చూపే స్పష్టమైన రోడ్‌మ్యాప్‌ను, విశ్వసనీయతను చూపించగలిగితేనే పాదయాత్ర సక్సెస్ అవుతుంది. పాత ఫార్ములానే నమ్ముకోకుండా, సరికొత్త హామీలతో, పొరపాట్లను సరిదిద్దుకుంటూ జగన్ ప్రజల్లోకి వెళితేనే ఈ  పాదయాత్ర 2.0  వైసీపీని మళ్లీ రేసులోకి తీసుకెళ్లే అవకాశాలు ఉంటాయి

## సీట్ల పంపకాలపై ఉత్కంఠ

-మొదటిపేజీ తరువాయి
మేయర్ సీట్లు కోరుతోంది. వైఎస్సార్‌సీపీ ఒక్కో సీటుపై పోరాడనున్నట్టు సిద్ధమవుతోంది. అయితే ఈ ఎన్నికల్లో ఆ పార్టీకి అగ్ని పరీక్షగా మారనున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో పట్టణ స్థానిక సంస్థల (మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీలు) ఎన్నికలకు సర్కార్ కీలక ముందడుగు వేసింది. శనివారం (సెప్టెంబర్ 5, 2026) ప్రభుత్వం కొత్త స్టాట్యూటరీ రూల్స్, జీవోలు జారీ చేసిన విషయం తెలిసిందే. మున్సిపల్ సవరణ చట్టం--2026 (ఆగస్టు 28 నుంచి అమలు) ప్రకారం మేయర్లు, చైర్‌పర్సన్‌లను ఇక ప్రత్యక్ష పద్ధతిలో ఎన్నుకోవాలి. గతంలో కౌన్సిలర్లు ఎన్నుకునే విధానం మారింది. ప్రస్తుతం పూర్తి ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కాలేదు. అయితే సన్నాహాలు వేగంగా సాగుతున్నాయి. అక్టోబర్‌లో ఎన్నికలు పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. సెప్టెంబర్‌లో నోటిఫికేషన్ వచ్చి, అక్టోబర్‌లో పోలింగ్ జరగే అవకాశం ఉంది. కొన్ని నివేదికల్లో డిసెంబర్‌లోగా ప్రక్రియ పూర్తి చేయాలని కూడా ప్రస్తావన ఉంది.

**ప్రస్తుత షెడ్యూల్ వివరాలు:**
సెప్టెంబర్ 8 నుంచి 21 వరకు 59 యూఎల్‌బీల్లో (విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ సహా 58 మున్సిపాలిటీలు/నగర పంచాయతీలు) ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళా ఓటర్ల గుర్తింపు కోసం 14 రోజుల ప్రక్రియ.
సెప్టెంబర్ 8--12: ఇంటింటి సర్వే.
సెప్టెంబర్ 21: వర్గాల వారీగా తుది ఓటర్ల జాబితా ప్రచురణ.
41 యూఎల్‌బీల్లో (హైకోర్టు ఆదేశాల తర్వాత డీలిమిటేషన్) ఓటర్ల జాబితాలు ఒక వారంలోగా ప్రచురణకు సిద్ధం.
23 యూఎల్‌బీల్లో కోర్టు కేసులు పెండింగ్‌లో ఉన్నాయి.
మొత్తం 123 యూఎల్‌బీల్లో దాదాపు 100 సంస్థలకు ఎన్నికలు జరగనున్నాయి (87 సంస్థల పదవీకాలం మార్చి 2026లో ముగిసింది).
నిబంధనలు
మేయర్/చైర్‌పర్సన్: ప్రత్యక్ష ఎన్నిక. ఐదేళ్ల పదవీకాలం. వార్డు సభ్యుడిగా కూడా పరిగణిస్తారు.
డిప్యూటీ మేయర్/వైస్ చైర్‌పర్సన్ : ఒకరు మాత్రమే (గతంలో ఇద్దరు). పరోక్ష ఎన్నిక.
నామినేషన్ డిపాజిట్: జనరల్ అభ్యర్థులకు రూ. 5,000, ఎస్సీ/ఎస్టీ/బీసీలకు రూ. 2,500.
గరిష్ఠం నాలుగు సెట్ల నామినేషన్ పత్రాలు దాఖలు చేయవచ్చు.
నోటరైజ్డ్ అఫిడవిట్ (క్రిమినల్ రికార్డు, ఆస్తులు, బాధ్యతలు, విద్యా అర్హతలు) తప్పనిసరి.
ఓటింగ్: బ్యాలెట్ పత్రాల బదులు ఈవీఎంలు. తొలిసారి నోటా అవకాశం.
నోటిఫికేషన్ నుంచి ఖర్చుల ఖాతాల సమర్పణ వరకు పూర్తి ప్రక్రియకు నియమాలు ఖరారు.

## పొగాకు రైతులకు భరోసా

-మొదటిపేజీ తరువాయి
ధర కల్పించేందుకు ప్రభుత్వం నిరంతరం చర్యలు తీసుకుంటోందన్నారు. తాను కూడా పొగాకు వేలం ప్రక్రియను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులతో నిరంతరం సమన్వయం చేస్తున్నట్లు చెప్పారు. సెప్టెంబర్ 4 నాటికి 132 వేలం రోజుల్లో 86.59 మిలియన్ కిలోల ఊఇఎ పొగాకు మార్కెట్ అయిందని మంత్రి తెలిపారు. ప్రస్తుత సీజన్‌కు అనుమతించబడిన పంట పరిమాణం 142 మిలియన్ కిలోలు కాగా, అంచనా ఉత్పత్తి సుమారు 236 మిలియన్ కిలోలుగా ఉందన్నారు. ఇప్పటివరకు నమోదైన సగటు ధర కిలోకు రూ.209.83గా ఉందని వెల్లడించారు. గత ఏడాది ఇదే 132 వేలం రోజుల నాటికి 140.27 మిలియన్ కిలోల పొగాకు మార్కెట్ కాగా, తుది సగటు ధర కిలోకు రూ.248.86గా నమోదైందని మంత్రి పేర్కొన్నారు. ఈ ఏడాది అధిక ఉత్పత్తి కారణంగా మార్కెట్‌లో సర్ప్లస్ ఏర్పడటంతో కొంత ఒత్తిడి నెలకొన్నప్పటికీ, ఇటీవల వేలాల్లో కొనుగోలుదారుల స్పందన, పోటీ గణనీయంగా మెరుగుపడుతున్నాయని తెలిపారు. ఇటీవల వేలం కేంద్రాల్లో 'నో--బిడ్' బేల్స్ శాతం గణనీయంగా తగ్గిందని అచ్చెన్నాయుడు తెలిపారు. ప్రస్తుతం రోజువారీగా సగటున 11--12 శాతం వరకు 'నో--బిడ్'లు నమోదవుతున్నాయని, కొన్ని వేలం ప్లాట్‌ఫారమ్‌లలో ఇది 1--2 శాతం కంటే కూడా తక్కువగా ఉందన్నారు. 'నో--బిడ్'లు తగ్గడం, కొనుగోలు కార్యకలాపాలు పెరగడం, కొనుగోలుదారుల మధ్య పోటీ మెరుగుపడటం మార్కెట్‌లో సానుకూల సంకేతాలని మంత్రి అన్నారు. ప్రస్తుతం వారానికి సుమారు 10 మిలియన్ కిలోల పొగాకు మార్కెట్ అవుతోందని తెలిపారు. కొనుగోలుదారుల మధ్య పెరుగుతున్న పోటీ మెరుగైన ధరల సాధనకు దోహదపడుతోందన్నారు. పొగాకు పంట మార్కెటింగ్ ప్రక్రియను టొబాకో బోర్డు ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తున్నామని అచ్చెన్నాయుడు తెలిపారు. రైతులు, తయారీదారులు, ఎగుమతిదారులు, వ్యాపార ప్రతినిధులతో సమన్వయం చేస్తూ కొనుగోళ్లను వేగవంతం చేస్తున్నామన్నారు. వేలాల్లో కొనుగోలుదారులు నిరంతరం పాల్గొనేలా చూడటం, మార్కెటబుల్ పొగాకును కొనుగోలు చేయడం, నివారించగల 'నో--బిడ్'లను తగ్గించడం, కొనుగోలు షెడ్యూల్‌ను క్రమబద్ధంగా కొనసాగించడం, పంటను త్వరితగతిన మార్కెట్ చేయడం వంటి అంశాలపై వ్యాపార వర్గాలతో చర్చలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతులు, వ్యాపార వర్గాల ప్రతినిధులతో మానిటరింగ్ కమిటీలు ఏర్పాటు చేశామని, సీనియర్ అధికారులు వేలం ప్లాట్‌ఫారమ్‌లను సందర్శిస్తూ క్షేత్రస్థాయి సమస్యలను వెంటనే పరిష్కరిస్తున్నారని మంత్రి వివరించారు.----

## ఏపీ పర్యాటకానికి మహర్దశ

-మొదటిపేజీ తరువాయి
చేయడంతోపాటు
నాగార్జునసాగర్ వద్ద బుద్దిస్ట్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్ నిర్మిస్తున్నారు.



### నాలుగు కొత్త ప్రాజెక్టులివే
అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయలో రూ.101.07 కోట్లతో అరకు కల్చరల్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్ ఏర్పాటు చేయనున్నారు. కొత్తవలసలో ఐటీడీఏకు చెందిన 19.23 ఎకరాల స్థలంలో దీన్ని అభివృద్ధి చేయనున్నారు. గిరిజన సంస్కృతి, స్థానిక వంటకాలు, అరకు కాఫీ, చిరుధాన్యాల ప్రత్యేకతలను పర్యాటకులకు పరిచయం చేయనున్నారు.
శ్రీకాకుళం జిల్లాలో ప్రసిద్ధ అరసవల్లి సూర్యనారాయణస్వామి ఆలయ పరిసరాలను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు రూ.107.94 కోట్లతో 'అరసవల్లి సన్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్' ఏర్పాటు చేయనున్నారు. నాగావళి నది ఒడ్డున ఉన్న చారిత్రక డచ్ హెరిటేజ్ భవనాన్ని పునరుద్ధరించి వినియోగంలోకి తీసుకురానున్నారు. డిజిటల్ ప్రదర్శనలు, మ్యూజియం, హస్తకళల అనుభవాలు, తదితర సదుపాయాలతో నాగావళి రివర్ ఫ్రంట్‌ను అభివృద్ధి చేస్తారు.
విజయవాడ విమానాశ్రయానికి కిలోమీటర్ దూరంలో సుమారు ఐదెకరాల విస్తీర్ణంలో రూ.176 కోట్లతో 'గన్నవరం మైస్ సెంటర్' ఏర్పాటు చేయనున్నారు. రాష్ట్రంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాలను పరిచయం చేసే ఇమ్మర్సివ్ థియేటర్, ప్రసిద్ధ స్వీట్లు, జ్ఞాపికల విక్రయ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు.
నెల్లూరు జిల్లాలో వేదగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని రూ.34.29 కోట్లతో ప్రసాద్ పథకం అభివృద్ధి చేయనున్నారు. పెరుగుతున్న భక్తుల రద్దీకి అనుగుణంగా రాకపోకలు, క్యూల నిర్వహణ, వేచి ఉండే ప్రాంతాల్లో భక్తులకు సౌకర్యాలు మెరుగుపరచనున్నారు. టూరిస్ట్ అమెనిటీ సెంటర్, వెయిటింగ్ హాళ్లు, కొత్త అన్నదాన భవనం, వంటశాల, ప్రవేశ ద్వారం, నడక మార్గాలు, ల్యాండ్‌స్కేపింగ్, భక్తుల పార్క్, కూర్చునే ప్రదేశాలు, భద్రతా ఏర్పాట్లు కల్పించనున్నారు.
మరికొన్ని ప్రాంతాల అభివృద్ధికి ప్రతిపాదనలు : స్వదేశ్ దర్శన్ 2.0లో మరికొన్ని ప్రాంతాల అభివృద్ధికి రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ ప్రతిపాదనలు సిద్ధం చేస్తోంది. మచిలీపట్నంలో కోస్టల్ ఎక్స్‌పీరియన్స్, మంగళగిరి ఆలయ పరిసరాల్లో పర్యాటక సదుపాయాలు, మంగళగిరి ఎకో పార్క్ అభివృద్ధి, నంద్యాల జిల్లాలో బెలూం గుహల్లో కేవ్ లైటింగ్, సందర్శకులకు సదుపాయాల కల్పన వంటివి వీటిలో ఉన్నాయి.

# బీసీల మీద చంద్రబాబు గారికి ప్రేమే ఉంటే 9వ షెడ్యూలు లో పెటించి ఇచ్చిన హామీ మేరకు 50శాతం అమలు చేయాలి

-బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి అంపావతిని గోవిందు.



**సెప్టెంబర్ 6 ప్రజాజ్యోతి న్యూస్ రాయలసీమ ఇంచార్జ్ శ్రీనివాస్ నాయుడు :-** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, శ్రీసత్యసాయి జిల్లా, కదిరిలో "బీసీ మహాజన సమితి" ఆధ్వర్యంలో బహుజన నాయకులు రొద్దార్పు హరిప్రసాద్ గారి అధ్యక్షతన "చంద్రబాబు గారు స్థానిక సంస్థల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామన్న హామీని అమలు చేయాలని" జరిగిన "రౌండ్ టేబుల్ సమావేశం" నకు ముఖ్య అతిథిగా పాల్గొన్న బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి అంపావతిని గోవిందు గారు మాట్లాడుతూ గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు నిత్యము టిడిపి అంటే బీసీల పార్టీ - బీసీలు అంటే టిడిపి అని చెబుతూ ఉంటారు కదా! మరి ఆ మేరకు బీసీల మీద ప్రేమే ఉంటే ఎన్.డి.ఏ కూటమి ఆధ్వర్యంలో కేంద్రంలోనా, రాష్ట్రంలోనా డబుల్ ఇంజన్ సర్కార్ ఉంది కదా! ఇప్పుడు చంద్రబాబు గారు గౌరవ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గారిని ఒప్పించి తను 9.7.2012న ప్రకటించిన బీసీ డిక్లరేషన్ లో ఇచ్చిన హామీ మేరకు 2014 ఎన్నికల మ్యానిఫెస్టోలో బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 50 శాతం రిజర్వేషన్ అమలు చేస్తామన్న హామీనిని రాజ్యాంగంలోని 9వ షెడ్యూలులో పెట్టించి అమలు చేయాలని రౌండ్ టేబుల్ సమావేశం చంద్రబాబు గారిని డిమాండ్ చేసింది.ఎందుకంటే 2024 ఎన్నికల్లో బీసీలకు స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషను అమలు చేస్తామన్న హామీని అమలు చేస్తున్నామని 18.8.2026న సీఎం చంద్రబాబు గారు ప్రకటించారు. ఇదే సందర్భంలో చంద్రబాబు గారు మాట్లాడుతూ ఈ 34 శాతంపై ఎవరైనా కోర్టుకు వెళ్లితే బీసీ ద్రోహులుగా మిగిలిపోతారని అన్నారు. మరి దీనిని బట్టి ఈ 34 శాతం రిజర్వేషన్లు చట్ట పరిధిలో నిలబడదనే విషయం చంద్రబాబు గారికి తెలిసే చెప్పడం జరిగిందనేది సుస్పష్టమౌతుంది. అంటే దీని అర్థం 34 శాతం రిజర్వేషన్లను వ్యతిరేకించేవారు వెంటనే కోర్టుకు వెళ్లాలనే తరహాలో చెప్పడం జరిగింది. ఇప్పుడు చంద్రబాబు గారు కోరుకున్న విధంగానే న్యాయవాది తాండవ యోగేష్ 34 శాతం అమలు చేస్తే 50 శాతం పరిధి దాటుతుందని కోర్టుకు వెళ్లడం జరిగింది.రాష్ట్రంలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికలపై 19.8.2026 బుధవారం ప్రభుత్వం హైకోర్టులో నివేదిక అందజేయగా హైకోర్టు ఎన్నికల రిజర్వేషన్లు 50 శాతానికి దాటకుండా ప్రభుత్వానికి సలహా ఇవ్వండి అంటూ రాష్ట్ర అడ్వకేట్ జనరల్ కు సూచించడం జరిగింది. అయినా స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లను వర్తింపజేస్తూ రాష్ట్ర ప్రభుత్వం 20.8.2026 గురువారం జీఓలు 1065, 105 ద్వారా ఆదేశాలు ఇవ్వడం చూస్తే బీసీలను పక్కాగా మోసం, దగా చేయడానికే కదా నిజానికి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సీఎంగా ఉన్న కిరణ్ కుమార్ రెడ్డి గారు 2013 జూలైలో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ తో సర్పంచ్ ఎన్నికలు జరిపారు. వీరి ఐదు సంవత్సరాల పదవి కాలం 2018 జూలైలో ముగిసింది. 2018లో సీఎంగా ఉన్న చంద్రబాబు గారు 9.7.2012న ప్రకటించిన బీసీ డిక్లరేషన్ ప్రకారం 2014 ఎన్నికల మ్యానిఫెస్టోలో పొందుపరిచిన విధంగా స్థానిక సంస్థల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్ అమలు చేస్తామన్న హామీని అమలు చేయాలి. కాని ఆ మేరకు 50 శాతం అమలు చేయాల్సి వస్తుందనే దురుద్దేశంతోనే అప్పటి వరకు అమలౌతున్న 34 శాతంపై కోర్టుకు వెళ్లారని ఎన్నికలు జరపలేదు.ఆ తరువాత అధికారం మారి సీఎంగా ఉన్న వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి గారు కోర్టు 34 శాతం నుంచి 24 శాతానికి తగ్గించిందని ఎన్నికలు జరపడంతో దాదాపు 16,500 పదవులను బీసీలు కోల్పోవడం జరిగింది. ఆ సందర్భంలో కోర్టుకు పోయిన బిర్రు ప్రతాప్ రెడ్డి, సీఎం జగన్ మోహన్ రెడ్డి గారితో దిగిన ఫోటోను ఆంధ్రజ్యోతి, ఈనాడు పత్రికల్లో వేసి జగనే కోర్టుకు పంపారని రాశారు. జగన్ గారితో ఫోటో దిగిన అదే బిర్రు ప్రతాప్ రెడ్డి, చంద్రబాబు గారితో దిగిన ఫోటోను సాక్షి పత్రికలో వేసి చంద్రబాబే కోర్టుకు పంపారని రాశారు. నిజానికి చంద్రబాబు గారు 2018 జూలైలోనే 2014 ఎన్నికల మ్యానిఫెస్టో ప్రకారం స్థానిక సంస్థల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్ అమలు చేస్తామన్న హామీని అమలు చేసి ఉంటే ఇంతటి తీరని అన్యాయం బీసీలకు జరిగి ఉండేది కాదు.దకోర్టు 34 శాతం నుంచి 24 శాతానికి తగ్గించడానికి ప్రధాన కారణం రిజర్వేషన్లు 50 శాతం దాటకూడదనేది సారాంశం. మరి ఇది తెలిసి కూడా చంద్రబాబు గారు 2024 ఎన్నికల మ్యానిఫెస్టోలో బీసీలకు స్థానిక సంస్థల్లో 34 శాతం అమలు చేస్తామని పొందుపరిచారు. ఇప్పుడు చంద్రబాబు గారు ఇచ్చిన హామీ మేరకు 34 శాతం అమలు చేస్తే 50 శాతం దాటుతుంది. కనుక 34 శాతం అమలు చేసినా, 50 శాతం అమలు చేసినా 50 శాతం దాటుతుంది. కనుక తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి జయలలిత గారు ఆ రాష్ట్రంలో 69 శాతం రిజర్వేషన్ అమలు చేయుటకు అప్పటి ప్రధానమంత్రి పి.వి.నరసింహారావు గారిని ఒప్పించి రాజ్యాంగంలోని 9వ షెడ్యూలులో పెట్టించి అమలు చేసిన విధంగా, చంద్రబాబు గారు కూడా ఆ విధంగానే చేయాలి. కాని ప్రధానమంత్రి మోడీ గారు ఆ విధంగా ఒప్పుకోకుంటే మీకు ఉన్న 16 మంది ఎంపీల తోనే మోడీ గారి ప్రభుత్వం ప్రస్తుతం నడుస్తా ఉంది. కనుక బీసీల కోసం 16 మంది ఎంపీల మద్దతును ఉపసంహరించుకొంటానంటే సచ్చినట్టు మోడీ గారు ఒప్పుకొని 9వ షెడ్యూలులో పెట్టే అవకాశం ఉంది. దేశంలో ఏ రాష్ట్ర ముఖ్యమంత్రికి లేని వెసులుబాటు కేవలం చంద్రబాబు గారికి మాత్రమే ఉంది. కనుక చంద్రబాబు గారికి నిజంగానే బీసీల మీద ప్రేమ ఉంటే రాజ్యాంగంలోని 9వ షెడ్యూలులో పెట్టించి స్థానిక సంస్థల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్ చేసింది. ఈ కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా కార్యదర్శి యాటగిరి రామచంద్రప్రసాద్, రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర నాయకులు సాయిశీనా, జనసేన పార్టీ నాయకులు ఇర్ఫాన్, బీసీ ఉద్యోగుల సంఘం నాయకులు గౌడ్ జయరాజు, మడకా గోపాల్, జె.వి.రమణ, న్యాయవాది చౌడప్ప, రామచంద్ర యాదవ్, సుధాకర్, చౌడప్పయాదవ్, నారాయణస్వామి, వెంకటసుబ్బయ్య, ఆంజనేయులు, ఆదినారాయణ, సాంబశివ, గంగన్న, శివ తదితరులు పాల్గొన్నారు.

## రౌడీషీటర్లకు కౌన్సిలింగ్



**ప్రజాజ్యోతి న్యూస్ ప్యాపి** నంద్యాల జిల్లా డోన్ నియోజక వర్గం ప్యాపిలి పోలీసు స్టేషన్ పరిధిలో ఎస్సై నాగార్జున ఆదివారం రౌడీ షీటర్లను కౌన్సిలింగ్ నిర్వహించారు. జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఆదేశాల మేరకు నేరనియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణ కోసం రౌడీషీటర్లకు, నేరచరిత్ర గల వారికి, చెడు నడత కలిగిన వ్యక్తులకు కౌన్సిలింగ్ లో భాగం గా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. సత్రవర్తనతో జీవించాలని, నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలన్నారు.

## కామ్రేడ్ శ్యామల వెంకట్ రెడ్డికి ఘన నివాళి




**కూనవరం, సెప్టెంబర్ 6, ప్రజా జ్యోతి** పోలవరం జిల్లా కూనవరం మండలం తరపున కామ్రేడ్ శ్యామల వెంకట్ రెడ్డి గారి 30వ వర్ధంతి సందర్భంగా ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కమిటీ నాయకులు మేకల నాగేశ్వరరావు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. చింతూరు మండలంలోని మారుమూల మల్లన్నపేట గ్రామంలో జన్మించిన కామ్రేడ్ శ్యామల వెంకట్ రెడ్డి గిరిజనుల పోడు భూముల సమస్యలు, రైతుల సమస్యలు మరియు ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడిన ప్రజా నాయకుడని అన్నారు.ప్రజల హక్కుల కోసం ప్రభుత్వంపై పోరాటాలు నిర్వహిస్తూ ముందుకు సాగిన ఆయనను 30 సంవత్సరాల క్రితం రాడికల్ నక్సల్స్ దాడిలో హత్య చేయడం బాధాకరమని పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై ఆయన సాగించిన పోరాట స్ఫూర్తిని కొనసాగిస్తూ, ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలను మరింత బలోపేతం చేస్తామని తెలిపారు.కామ్రేడ్ శ్యామల వెంకట్ రెడ్డి గారి త్యాగాన్ని స్మరించుకుంటూ కూనవరం మండలం తరపున విప్లవ జోహార్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కార్యదర్శి బాబు బొర్రయ్య, పాయం సీతారామయ్య, తాలూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక ఎన్నికలకు జనసేన క్షేత్రస్థాయి కసరత్తు

### బాపట్ల పార్లమెంట్ పరిధిలో పార్టీ బలంపై సమీక్ష

**బాపట్ల సెప్టెంబర్ 6 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని జనసేన పార్టీ బాపట్ల పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో క్షేత్రస్థాయి కార్యాచరణకు సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా బాపట్ల పార్లమెంట్ స్థానిక సంస్థల ఎన్నికల సమన్వయకర్త, మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి ఆదివారం సమన్వయ కమిటీ సభ్యులతో ఆడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పార్టీ పరిస్థితి, గ్రామాలు, మండలాలు, వార్డుల స్థాయిలో ఉన్న బలాబలాలపై ఈ సందర్భంగా సమీక్షించారు. స్థానికంగా పార్టీని మరింత బలోపేతం చేసేందుకు అవసరమైన సమాచారాన్ని క్షేత్రస్థాయి నుంచి సేకరించాలని బాలశౌరి సూచించారు. జనసైనికులు, వీర మహిళలను సమన్వయం చేసుకుంటూ ఎన్నికల సన్నద్ధతను వేగవంతం చేయాలని తెలిపారు.పార్టీ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని, అంతర్గత విభేదాలకు అవకాశం ఇవ్వకూడదని స్పష్టం చేశారు. పార్టీ అధిష్ఠానం నుంచి అధికారిక నిర్ణయాలు వచ్చే వరకు అభ్యర్థులు, స్థానాల విషయంలో ఎలాంటి అనధి



కార ప్రచారానికి తావివ్వొద్దని సూచించారు. సమావేశంలో సమన్వయ కమిటీ సభ్యులు ఆల అనిల్ కుమార్, సోమరవుతు అనురాధ, మత్తి భాస్కరరావు, సహాయక బృందం సభ్యులు జి. మల్లేశ్వరరావు, సోమిశెట్టి ప్రేమ్ కిరణ్ కుమార్, నీరుకట్టు వెంకయ్యానాయుడు, ఎ.పృథ్వి, నాగరాజు, కరుమూరి అంజనేష్ ఈమని మణికంఠ పాల్గొన్నారు.

## జిల్లాలో పోలీసుల కార్డెన్ సెర్చ్

### 157 అనుమానిత వాహనాలు సీజ్.175 మందితో విస్తృత తనిఖీలు




**బాపట్ల సెప్టెంబర్ 6 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** నేరాల నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయడమే లక్ష్యంగా బాపట్ల జిల్లా పోలీసులు ఆదివారం విస్తృత తనిఖీలు చేపట్టారు. జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ ఐపీఎస్ ఆదేశాలతో రేపల్లె, కర్లపాలెం, చీరాల ప్రాంతాల్లో ఏకకాలంలో కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. రేపల్లె పట్టణంలోని రెండో వార్డు, కర్లపాలెం మండలం ఎట్రావారిపాలెం చీరాల రెండో టౌన్ పరిధిలోని ఆదినారాయణపురంలో చేపట్టిన తనిఖీల్లో మొత్తం 175 మంది పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. అనుమానాస్పద వ్యక్తులు, పాత నేరస్తులు, ఇళ్లు, దుకాణాలు, పరిసర ప్రాంతాలతో పాటు వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. సరైన ధ్రువపత్రాలు లేని 157 అనుమానిత వాహనాలను పోలీసులు సీజ్ చేశారు. వీటిలో 147 ద్విచక్ర వాహనాలు, 10 ఆటోలు ఉన్నాయి. రేపల్లెలో 70, కర్లపాలెంలో 38, చీరాలలో 49 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గంజాయి, ఇతర మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. జిల్లాను గంజాయి రహితంగా మార్చే లక్ష్యంతో పోలీస్ శాఖ నిరంతర చర్యలు చేపడుతోందని తెలిపారు. తనిఖీల సందర్భంగా ప్రజలకు సైబర్ నేరాలపై అప్రమత్తత, హెల్మెట్ వినియోగం, శిరోరక్ష, ప్రాణరక్ష కార్యక్రమంపై అవగాహన కల్పించారు.చట్టవ్యతిరేక కార్యకలాపాలపై సమాచారం ఉంటే స్థానిక పోలీసులకు లేదా కమాండ్ కంట్రోల్ నంబర్ 8333813228, టోల్‌ఫ్రీ 112కు సమాచారం ఇవ్వాలని ఎస్పీ సూచించారు. సమాచారం ఇచ్చేవారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

## ఓటరు దరఖాస్తుల పరిష్కారంపై కలెక్టర్ ఆరా

పెదపూడి పోలింగ్ కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీ



**బాపట్ల సెప్టెంబర్ 6 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో పెండింగ్ దరఖాస్తులను సకాలంలో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ వాసుదేవ అధికారులను ఆదేశించారు. అమృతలూరు మండలం పెదపూడి గ్రామంలోని ఎంపీపీ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను ఆదివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.79, 80 పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్ ఆయా కేంద్రాల పరిధిలోని ఓటర్ల సంఖ్య, మ్యాపింగ్ కాని ఓటర్ల వివరాలు, పెండింగ్ నోటీసులపై బీఎల్ఓలను అడిగి తెలుసుకున్నారు. బీఎల్ఓ, ఏఈఆర్ఓ లాగిన్‌లలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై విచారణ ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని సూచించారు. ఓటర్ల ఫొటోలు, నమోదు ప్రక్రియలో ఎదురవుతున్న ఇబ్బందులపైనా సిబ్బందితో మాట్లాడారు.తనిఖీ అనంతరం పాఠశాల సమీపంలో కలెక్టర్‌కు ఎదురైన ఓ వృద్ధురాలు తనకు పెన్షన్ అందడం లేదని సమస్యను వివరించింది. స్పందించిన కలెక్టర్ ఆమె వివరాలను పూర్తిగా సేకరించి నివేదిక అందించాలని సంబంధిత పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు.కార్యక్రమంలో ఏఈఆర్ఓ, సూపర్‌వైజర్, బీఎల్ఓలు, వీఆర్ఓలు తదితరులు పాల్గొన్నారు.

## వివాహ వేడుకకు హాజరైన వైస్సార్సీపీ జిల్లా ఉపకధ్యక్షురాలు వై.నైరుతి రెడ్డి



**గుంతకల్లు సెప్టెంబర్ 6 (ప్రజా జ్యోతి):** నియోజక వర్గంలోని గుత్తి మండలం మామిళ్లచెరువు గ్రామం కి చెందిన సోదనపల్లి శివ రెడ్డి ఆహ్వానం మేరకు నీలం రాజశేఖర్ రెడ్డి కళ్యాణ మండపం లో జరిగిన శివ రెడ్డి కుమారుడి వివాహ వేడుకకు ముఖ్య అతిధిగా హాజరై నూతన వధూవరు లను ఆశీర్వధించిన వైస్సార్సీపీ అనంతపురం జిల్లా ఉపాధ్యక్షురాలు వై.నైరుతి రెడ్డి వారితో పాటు నాయకులు, అభిమానులు హాజరుకా వటం జరిగింది.

## జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న ముద్దాలకు అభినందనలు.



**పాలకొల్లు.ప్రజా జ్యోతి రిపోర్టర్ కొట్టి రామం. సెప్టెంబర్ 6.** ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా పాలకొల్లు మండలం నుండి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎంపికయి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి చేతుల మీదుగా అవార్డు అందుకున్న ముద్దాల వెంకట శ్రీరామచంద్ర శ్రీనివాసరావును ఆదివారం పలువురు ఉపాధ్యాయులు అభినందించారు. పాలకొల్లులోని పీఎం శ్రీ బి ఆర్ ఎం బి వి మునిసిపల్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేయుచున్న ముద్దాల వెంకట శ్రీరామచంద్ర శ్రీనివాసరావు అంకిత భావంతో తమ విధులు నిర్వహిస్తూ విద్యార్థులను తీర్చిదిద్దడానికి పాఠశాలలో విద్యాభివృద్ధికి తనవంతు కృషి చేస్తూ గుర్తింపు తెచ్చుకున్నారు. ఉపాధ్యాయులు ముద్దాల ఈ ఏడాది జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డు పొందడం పట్ల పలు ఉపాధ్యాయ సంఘాలతో పాటు మండల విద్యాశాఖ అధికారులు గుమ్మల వీరాస్వామి, శర్మ, పీఎం శ్రీ బి ఆర్ ఎం బి వి మునిసిపల్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శివలీల ఉపాధ్యాయులు ఎం సురేష్ , పోతురాజు ఐపిసిహెచ్ శ్రీనివాసరావు పాఠశాల సిబ్బంది అభినందించారు.

## కొత్త అడుగులకు సెంచరీ శ్రీకారం

లేఅవుట్ బ్రోచర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే వేగేశన



**బాపట్ల సెప్టెంబర్ 6 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** బాపట్ల మండలం పాండురంగాపురం శివారు రామచంద్రపురం గ్రామ సమీపంలో సథరన్ డెవలపర్స్, అమరావతి బీచ్ రిసార్ట్స్ ఆధ్వర్యంలో రూపొందించిన 'సెంచరీ లేఅవుట్' బ్రోచర్‌ను బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు ఆవిష్కరించారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే లేఅవుట్ వివరాలను నిర్వాహకులను అడిగి తెలుసుకుని బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలను ఎమ్మెల్యేకు వివరించారు. కార్యక్రమంలో లేఅవుట్ నిర్వాహకులు, స్థానిక ప్రముఖులు, తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారి సంజనశ్రేష్ట పుట్టినరోజు వితరణ.

### గర్భిణీ స్త్రీలకు పౌష్టికాహారం పంపిణీ.



**పోడూరు. ప్రజాజ్యోతి రిపోర్టర్ కొట్టి రామం. సెప్టెంబర్ 6.** చిన్నారి సంజన శ్రేష్ట పుట్టినరోజు సందర్భంగా పి.వి.ఆర్,అనసూయ నేషనల్ సర్వీస్ ఆర్గనైజె షన్,పీస్ ఇండియా స్వచ్ఛంద సేవా సంస్థ ఆర్థిక సహకారంతో పెనుమంట్ర ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణీ స్త్రీలకు పౌష్టికాహారం అందచేశారు. ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలు పొందుతున్న రోగులకు వృద్దులకు రొట్టెలు,పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి సంతోష్ రెడ్డి మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలు పౌష్టికాహారంగాపాలు,గుడ్డు,ఆకుకూరలు తీసుకోవడం వల్ల ఆరోగ్యవంతమైన శిశువులు జన్మిస్తారని తెలిపారు. ఇటువంటి సేవా కార్యక్రమాలు మరిన్ని చేస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాలలో స్వచ్ఛంద సంస్థలు భాగస్వామ్యం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు నీతిపూడి రామకృష్ణ, చవ్వాకుల భరత్ కుమార్, విక్టోరియా, బాలరాం,గుత్తుల సాల్మన్ దోర, సుబ్బరాజు, రవి, పీ.హెచ్.సి,సిబ్బంది, గుండె.సురేష్ బాబు, మూర్తి, ఆశా కార్యకర్తలు,వాలంటీర్స్ పాల్గొన్నారు.

## గొల్లప్రోలు 11వ వార్డులో పురుగుల బెడదకు తాత్కాలిక ఉపశమనం: జనసేన ఇంచార్జి అర్జున్ నాయుడు చొరవ



**గొల్లప్రోలు (ప్రజా జ్యోతి)** గొల్లప్రోలు టౌన్ 11వ వార్డులోని మార్కెట్ యార్డ్ పీడీ రైస్ గోడౌన్స్ నుండి పురుగులు వార్డు అంతటా విస్తరిస్తూ ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ఈ సమస్యను గుర్తించిన 11వ వార్డు జనసేన ఇంచార్జి చేదులూరీ అర్జున్ నాయుడు వెంటనే రంగంలోకి దిగి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.సమస్య తీవ్రతను పిఠాపురం మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ సూర్య ప్రకాశ్ వివరించగా, ఆయన నిన్న శనివారం స్వయంగా పరిశీలనకు వచ్చి తగు చర్యలు చేపట్టారు. గొల్లప్రోలు మున్సిపల్ కమిషనర్ కూడా ఈ విషయమై సానుకూలంగా స్పందించి, తక్షణమే సమస్యకు తాత్కాలిక పరిష్కారాన్ని చూపించారు.ప్రజల ఆరోగ్యాన్ని, ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అధికారులు స్పందించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూనే, త్వరలోనే ఈ పురుగుల సమస్యకు శాశ్వత (పూర్తి) పరిష్కారం చూపిస్తారని ఆశిస్తున్నట్లు 11వ వార్డు జనసేన ఇంచార్జి చేదులూరీ అర్జున్ నాయుడు ఒక తెలిపారు.

## విద్యకు నోచుకోని హైస్కూల్ ప్లస్ విద్యాలయం

**నిర్మించి నాలుగేళ్లు గడిచినా పట్టించుకోని అధికారులు**

**--- ఏఐవైఎఫ్ ఏరియా కార్యదర్శి గుడిమే సురేష్ కుమార్**







**బ్రహ్మంగారిమఠం- ప్రజా జ్యోతి సెప్టెంబర్ 6** మండలంలోని స్థానిక జిల్లా పరిషత్ హై స్కూల్ విద్యార్థుల ఉన్నత విద్య కోసం ఏర్పాటు చేసిన హైస్కూల్ ప్లస్ విద్యాలయం నిర్మించి నాలుగేళ్లు గడుస్తున్నా నేటికీ వినియోగంలోకి రాకపోవడం దురదృష్టకరమని ఏఐవైఎఫ్ ఏరియా కార్యదర్శి గుడిమే సురేష్ కుమార్ అన్నారు. 2022 సంవత్సరంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హైస్కూల్ ప్లస్ ప్రారంభించి ఒక సంవత్సరం పాటు తరగతులు నిర్వహించి శాశ్వత భవనలకోసం రూ.1.20 లక్షల వ్యయంతో ఈ భవనాన్ని నిర్మించారు. అయితే నిర్మాణం 80% పూర్తయినప్పటికీ మిగిలిన పనులు పూర్తిచేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహించి, రెండవ విద్యాసంవత్సరం లో ఇంటర్ విద్యను నిలిపి వేయడంతో భవనం నిరుపయోగంగా మారి, ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుంటోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఇంటర్మీడియట్ విద్య అందుబాటులోకి తీసుకు రావాలనే ఉద్దేశంతో నిర్మించిన భవనాన్ని ఇలా నిరుపయోగంగా వదిలేయడం వల్ల ప్రభుత్వ నిధులు వృథా అవుతున్నాయని ఆయన విమర్శించారు. సంబంధిత ఉన్నతాధికారులు వెంటనే స్పందించి భవనానికి అవసరమైన మరమ్మతులు చేపట్టి, రాబోయే విద్యాసంవత్సరం లో హైస్కూల్ ప్లస్ తరగతులను ప్రారంభించి విద్యార్థులకు విద్యా అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వ నిధులతో2 నిర్మించిన విద్యాలయం విద్యార్థులకు ఉపయోగపడ కుండా శిథిలావస్థకు చేరడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని గుడిమే సురేష్ కుమార్ అన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి హైస్కూల్ ప్లస్ విద్యాలయాన్ని వెంటనే అందుబాటులోకి తీసుకురావాలని, విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడకుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. బ్రహ్మంగారిమఠంలో హై స్కూల్ ప్లస్ రాబోయే విద్యా సంవత్సరంలో తరగతుల ప్రారంభించడానికి మైదుకూరు శాసనసభ్యులు పూర్తి చొరవ చేసి విద్యార్థుల ఉన్నత మార్గాలకు అడుగులు వేసేలా హై స్కూల్ ప్లస్ ను మరలా ప్రారంభిం చాలని వారు కోరారు.విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని అధికారులు తక్షణమే చర్యలు తీసుకోకపోతే, విద్యార్థులు మరియు ప్రజలను సమీకరించి ఏఐవైఎఫ్ఆధ్వర్యంలో దశలవారీగా ఆందోళనలు చేపడతామని, అవసరమైతే అధికారుల కార్యాలయాలను ముట్టడించేందుకు కూడా వెనుకాడబోమని గుడిమే సురేష్ కుమార్ హెచ్చరించారు.

# నిత్యవసర సరుకుల ధరలను తగ్గించండి

### -సిపిఎం పార్టీ వేల్పుల రామిరెడ్డి






**సెప్టెంబర్ 6 ప్రజా జ్యోతి న్యూస్ రాయలసీమ ఇంచార్జ్ శ్రీనివాస్ నాయుడు :-** ఉల్లిగడ్డలు తక్కువ ధరకు రైతు బజార్లో విక్రయించాలి సిపిఎం ఆకాశాన్ని అందుకున్న నిత్యావసర సరుకుల ధరలనుని తగ్గించాలని, భారీగా పెరిగిన ఉల్లిగడ్డలను ప్రభుత్వమే కొనుగోలు చేసి రైతు బజార్లో తక్కువ ధరకు విక్రయించాలని కోరుతూ ఈరోజు సిపిఎం పార్టీ నగరఱ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక టవర్ క్లాక్ దగ్గర తోపుడు బండిలో నిత్యవసర సరుకులను, కూరగాయలను ఉంచి వినూత్నంగా నిరసన తెలిపారు . ఈ సందర్భంగా సిపిఎం పార్టీ నగర కార్యదర్శి వి రామిరెడ్డి మాట్లాడుతూ పేదలు, మధ్యతరగతి ప్రజానీకం మీద నిత్యవసర సరుకులు ధరల భారం విపరీతంగా పెరుగుతున్న ప్రభుత్వం ఉపశమనం కలిగించే విధంగా ఏ విధమైన చర్యలు తీసుకోవడం లేదని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేటర్లకు ఊడిగం చేసే విధంగా ఉందని తెలిపారు. ప్రధానంగా వినాయక చవితి పండుగ సందర్భంగా ఏదైనా స్వీట్ చేసుకుందామని అనుకున్న మంచి నూనె,కంది పప్పు, శనగ బ్యాళు, బియ్యం, పామాయిల్, బెల్లం తదితర నిత్యావసర వస్తువులతోపాటు చెక్కర ధర 40 రూపాయల నుండి 75 రూపాయలకు పెరిగిందని చక్కెర ధరను అరికట్టడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని తెలిపారు.పక్క దేశాల వారు తమ దగ్గర చక్కెర నిల్వ వుందని భారతదేశానికి తక్కువ ధరకే ఇస్తామని చెప్పిన కొనుగోలు చేసి భారత ప్రజానీకాన్ని ఆదుకోవాల్సిన ప్రభుత్వం ఏమాత్రం చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. బాధ్యత కలిగిన మంత్రులు చక్కెర వాడకపోతే షుగర్ వ్యాధి రాదని కావున ప్రజల కోసమే చక్కెర ధరలు పెంచాలని మాట్లాడడం విడ్డూరంగా ఉందని తెలిపారు. గతంలో గ్యాస్ కొరత వచ్చినప్పుడు పెద్ద పెద్ద హోటల్స్ వాళ్ళు తినుబండారాల మీద ధరలను పెంచారని గ్యాస్ ధర తగ్గిన వీటి ధరలు మాత్రం తగ్గించలేదని ఇప్పుడు చక్కెర ధరను బూచిగా చూపించి ఒక్క టీ గ్లాసు మీద ఐదు రూపాయలు పెంచి సామాన్య ప్రజల నుండి దోపిడీ చేసుకుంటున్నారని విమర్శించారు. ధరలను నియంత్రించాల్సిన పౌరసరఫరాల శాఖ మంత్రి, అధికారులు అక్రమంగా నిల్వ ఉంచి ఎక్కువ ధరలకు అమ్ముతున్న వారి పైన ఎటువంటి చర్య తీసుకోకపోవడం ప్రజలకు అనుమానాలకు తావిస్తుందని ప్రభుత్వంలో ఉన్న పెద్దలే అక్రమదారులకు కుమ్ముకోస్తున్నారని అందుకే ధరలను పెంచిన ఎవరు కూడా పట్టించుకోవడంలేదని విమర్శించారు. అలాగే రైతులు పండించిన ఉల్లిగడ్డలను తక్కువ ధరలకు కొని అక్రమంగా నిలువ ఉంచుకొని ఇప్పుడు అధిక ధరలకు విక్రయిస్తున్నా పాలకులు ఏమాత్రం చర్యలు తీసుకోవడం లేదని కావున ప్రభుత్వమే కొనుగోలు చేసి రైతు బజారులో 25 రూపాయలకు కిలో ఉల్లిపాయ సరఫరా చేయాలని తెలిపారు. ధరలను నియంత్రించి ప్రజలను కాపాడాలని కోరారు.ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు వెంకటనారాయణ, రమేష్,నగర కార్యదర్శి వర్గ సభ్యులు, ఇర్ఫాన్, వలి నగర కమిటీ సభ్యులు ఎన్టీఆర్ శీన, తిరుమలేశు, రాజు డివైఎఫ్ఐ నాయకులు ఇజ్రాయిల్, సాయి, మహేంద్ర సిఐటియు నాయకులు శంకర, నవీన్, మహమ్మద్ వలి,ముని, రియాజ్, సుబహాన్, తిమ్మరాజు రవి, సీన తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల సమన్వయ కమిటీలో బుడుగుల బద్రికి కీలక బాధ్యతలు

### అరకు పార్లమెంట్ పరిధి స్థానిక సంస్థల ఎన్నికలకు జనసేన అధిష్ఠానం కీలక నియామకాలు







**కూనవరం సెప్టెంబర్ 6. ప్రజా జ్యోతి** అరకు పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల కోసం జనసేన పార్టీ ఏర్పాటు చేసిన సమన్వయ కమిటీలో రంపచోడవరం నియోజకవర్గం, కూనవరం మండలానికి చెందిన జనసేన పార్టీ నాయకుడు బుడుగుల బద్రికి కీలక బాధ్యతలు అప్పగించారు.ఈ సందర్భంగా బుడుగుల బద్రి మాట్లాడుతూ, జనసేన పార్టీ అధ్యక్షులు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ బలోపేతానికి, విజయానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని పేర్కొన్నారు.పార్టీ కోసం కష్టపడి పనిచేసిన ప్రతి జనసైనికుడికి పార్టీలో తప్పకుండా గుర్తింపు ఉంటుందని, అందుకు తన నియామకమే ఉదాహరణ అని ఆయన అన్నారు. పార్టీ అధిష్టానం తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానని తెలిపారు.అరకు పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్తగా కొరికాన రవికుమార్ వ్యవహరిస్తుండగా, సమన్వయ బృందంలో గర్భాన సత్తిబాబు, వంపురి గంగులయ్య, సెగ్గే భావన, సాయి జయంతి ఉన్నారు. అలాగే సపోర్ట్ టీమ్‌లో పి. కోటేశ్వరరావు, ఎల్. రంజిత్ కుమార్, మంతల బుచ్చిబాబు, మాధవి, సంతోష్ కుమార్, చిట్లు జ్ఞానేశ్వరరావు, బుడుగుల బద్రి, పొట్ట శేఖర్లకు పార్టీ అధిష్టానం బాధ్యతలు అప్పగించింది.కూనవరం మండలానికి చెందిన బుడుగుల బద్రికి కీలక బాధ్యతలు దక్కడంపై రంపచోడవరం నియోజకవర్గంలోని జనసేన పార్టీ నాయకులు, జనసైనికులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు

# ప్రజా సమస్యల పరిష్కారానికి బీజేపీ మండల సమావేశం



**సెప్టెంబర్ 6 ప్రజా జ్యోతి న్యూస్ రాయలసీమ ఇంచార్జ్ శ్రీనివాస్ నాయుడు :-** కూడేరు మండల కేంద్రంలోని శివరామిరెడ్డి ఫంక్షన్ హాల్ నందు ఆదివారం బీజేపీ మండల అధ్యక్షులు బి. గోపాల్ ఆధ్వర్యంలో మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మండలంలోని గ్రామాల్లో నెలకొన్న ప్రధాన ప్రజా సమస్యలు, మౌలిక వసతులపై విస్తృతంగా చర్చించారు. ముఖ్యంగా గ్రామాల్లో త్రాగునీటి సమస్య, స్మశాన వాటికలకు ప్రహరీ గోడలు, నీటి సౌకర్యం గృహ నిర్మాణ సమస్యలు, లేఅవుట్ల ప్రభావం. సి సి రోడ్లు అలాగే గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కొరతపై సమావేశంలో చర్చ జరిగింది. ప్రతి గ్రామంలో ప్రజలకు అవసరమైన త్రాగునీరు సక్రమంగా అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని, స్మశాన వాటికల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని నాయకులు కోరారు. పేదలకు మంజూరైన గృహాల నిర్మాణంలో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించి, నిర్మాణాలు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.అదేవిధంగా గ్రామాల్లో రహదారులు, డ్రైనేజీ, విద్యుత్, వీధి దీపాలు తదితర మౌలిక వసతులను మెరుగు పరచాల్సిన అవసరం ఉందని సమావేశంలో పేర్కొన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గ్రామాల వారీగా గుర్తించి, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షులు బి. గోపాల్ మాట్లాడుతూ మండలంలోని ప్రజా సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారం కోసం పార్టీ తరఫున నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. గ్రామాల అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతుల కల్పనపై అధికారులతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతామని చెప్పారు. ఈ సమావేశంలో బీజేపీ నాయకులు, మండల కార్యవర్గ సభ్యులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నిశ్చితార్థం వేడుకలో ముఖ్య అతిథిగా, అనంతపురం జిల్లా వైఎస్ఆర్సిపి ఆర్గనైజేషన్ సెక్రెటరీ పామిడి చెన్నకేశవరెడ్డి





**ప్రజా జ్యోతి జిల్లా బ్యూరో సుబ్బు** పామిడి టౌన్ లో వైఎస్ఆర్సి పి మైనార్టీ నాయకుడు కొట్టం నూర్ కూతురి నిశ్చితార్థం వేడుకకు ముఖ్య అతిథిగా హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన, అనంతపురం జిల్లా వైఎస్ఆర్సిపి ఆర్గనైజేషన్ సెక్రెటరీ, పామిడి చెన్నకేశవరెడ్డి అన్న, కార్యక్రమంలో, పామిడి టౌన్ కన్వీనర్ నాగూర్ ఈశ్వర్ రెడ్డి వైఎస్ఆర్సిపి జిల్లా యువజన విభాగం ప్రధాన కార్యదర్శి, పామిడి సూరి వాల్మీకి,టౌన్ ఉపాధ్యక్షులు తుల్లా భాయ్,జిల్లా బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి మీసాలు రామచంద్ర వాల్మీకి, మాజీ టౌన్ కన్వీనర్ జోజోడు కుమార్, మైనార్టీ నాయకుడు ఫిర్యాదుఖాన్,మాజీ ఎంపీపీ, డాక్టర్ మస్తానయ్య, జనార్దన్ రెడ్డి, నీలకంఠ రెడ్డి,సురేష్, టౌన్ ప్రధాన కార్యదర్శి, విభూది ఖాసిం, టౌన్ ఉపాధ్యక్షులు, సల్లుద్దీన్, నాగేష్ యాదవ్, ఉదయ్, వెంకటేష్, కొండాపురం దేవరాజు, గ్యాస్ షేక్షావలి, వైఎస్ఆర్ సీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## గొల్లప్రోలులో బీజేపీ ఆత్మనిర్భర్ మండల కార్యవర్గ సమావేశం

### స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి: బీజేపీ నాయకులు



**గొల్లప్రోలు (ప్రజా జ్యోతి)** కేంద్ర ప్రభుత్వ ప్రజాసంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడమే లక్ష్యంగా బీజేపీ శ్రేణులు పనిచేయాలని ఆ పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. గొల్లప్రోలు పట్టణ బీజేపీ కార్యాలయంలో ఆదివారం పట్టణ అధ్యక్షుడు చిట్టా మధు ఆధ్వర్యంలో 'ఆత్మనిర్భర్ మండల కార్యవర్గ సమావేశం' ఘనంగా జరిగింది.ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా పట్టణ ఇన్‌చార్జ్ బుర్రి మురళీధరరావు, జిల్లా నాయకులు మలిరెడ్డి నారాయణరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు చిట్టా మధు మాట్లాడుతూ, గొల్లప్రోలు పట్టణంలోని అన్ని వార్డులు, అన్ని పోలింగ్ బూత్‌ల పరిధిలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వివిధ పథకాలను ప్రజలకు క్షేత్రస్థాయిలో వివరించాలన్నారు. నిరంతరం ప్రజలతో మమేకమవుతూ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. రాబోయే స్థానిక మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ బలంగా నిలబడి, గెలుపొందేలా శ్రేణులన్నీ ఇప్పుడే సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి ఆదుమళ్ళ కళ్యాణ్, ఓబీసీ విభాగం అధ్యక్షుడు చీపూరీ భాస్కరరావు, ఉపాధ్యక్షుడు మేడసాని కామరాజు, కిసాన్ మోర్చా నాయకులు బోడకుర్తి వెంకటరమణ, ఓబీసీ నాయకులు వియ్యపు రాములు, తంగెళ్ళ బాబురావు, కొత్తెం నాగేశ్వరరావు మరియు పార్టీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

# జాతీయస్థాయి కథల పోటీలలో రచయిత మామిడిశెట్టి కి బహుమతి



**పాలకొల్లు. ప్రజాజ్యోతి రిపోర్టర్ కొట్టి రామం. సెప్టెంబర్ 9.** ఖమ్మంకి చెందిన 'పురిమళ్ళ ఫౌండేషన్' నిర్వహించిన 'జాతీయస్థాయి కథల పోటీ-2026'కి పాలకొల్లు రసధుని సాహితీ సంస్థ కార్యదర్శి రచయిత కవి మామిడిశెట్టి శ్రీనివాసరావు వ్రాసిన "ఏ వెలుగులకీ ప్రస్థానం"కథ కన్సోలేషన్ బహుమతి పొందింది. ఈ పోటీలకు ఉభయ తెలుగు రాష్ట్రాల నుండి మొత్తం 315 కథలు రాగా శ్రీనివాసరావు రాసిన ఈ కథ నాలుగవ స్థానంలో నిలిచి బహుమతి సాధించింది. లాభసాటి కాని వ్యవసాయం చేస్తూ అప్పుల పాలయి ఆత్మహత్యలు చేసుకుంటున్న రైతులు కొందరయితే, వృద్ధ రైతులు వేరే పనులేమీ చెయ్యలేక, బ్రతకడానికి వేరే మార్గం లేక మెట్రో నగరాల్లో బిచ్చగాళ్ళుగా మారుతున్న దయనీయ స్థితిని ఈ కథలో కళ్ళకు కట్టినట్లు చూపించారు. రైతుకి నెల జీతంలా ఆదాయం రావాలనీ, వాళ్ళ కుటుంబాలు సమాజంలో గౌరవంగా బ్రతికే పరిస్థితులు రావాలనీ ఆశిస్తూ ఎంతో హృద్యంగా మామిడిశెట్టి వ్రాసిన ఈ కథ అందరినీ ఆకట్టుకుంది. ఆదివారం ఉదయం ఖమ్మంలోని మంచికంటి భవన్ లో జరిగిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో కేంద్ర సాహిత్య అకాడమీ సభ్యులు శ్రీ బెల్లంకొండ ప్రసేన్, తిరుపతి యస్.వి యూనివర్సిటీ ప్రొఫెసర్ శ్రీ బ్రహ్మానందరెడ్డి, నవ తెలంగాణ ఫీచర్స్ సంపాదకులు శ్రీ కటుకోఝ్వల ఆనందాచారి, ప్రముఖ సాహితీవేత్త శ్రీమతి కొండపల్లి నిహారిణి, పురిమళ్ళ ఫౌండేషన్ వ్యవస్థాపకులు శ్రీమతి పురిమళ్ళ సునంద తదితర ప్రముఖుల చేతుల మీదుగా శ్రీనివాసరావు బహుమతి అందుకున్నారు. ఈ సందర్భంగా రచయిత శ్రీనివాసరావుని రసధుని అధ్యక్షులు కొట్టి భాస్కరరావు, ప్రధాన కార్యదర్శి యర్రంశెట్టి వెంకటరత్నం, వంగా నరసింహారావు, కళాకారులు గుడాల హరిబాబు, వెంకటపతి వర్మ, జి.యస్.యన్ మూర్తి, పలువురు సాహితీ వేత్తలు అభినందించారు.

## బి.ప్రత్తిపాడులో తీరిన తాగునీటి కష్టాలు స్పందించిన అధికారులు



**పిఠాపురం (ప్రజా జ్యోతి)** బి.ప్రత్తిపాడు గ్రామంలో దీర్ఘకాలంగా మూలనపడిన రూరల్ వాటర్ సప్లై వాటర్ ట్యాంక్ ఎట్టకేలకు ప్రజల వినియోగంలోకి వచ్చింది. గ్రామంలో ప్రజల తాగునీటి అవసరాల కోసం నిర్మించిన ఈ వాటర్ ట్యాంక్ అందుబాటులో లేకపోవడంతో గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ సమస్యపై స్పందించిన స్థానిక పౌరుడు, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ద్వారా గత నెల ఆగస్టు 10న ఫిర్యాదు నంబర్: 2026081084 39) జిల్లా యంత్రాంగానికి అర్జీ సమర్పించారు.ఈ ఫిర్యాదుపై సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపారు. నిలిచిపోయిన వాటర్ ట్యాంక్‌ను పూర్తిస్థాయిలో పునరుద్ధరించి, ప్రజల వినియోగానికి అందుబాటులోకి తీసుకువస్తూ తాగునీటి సరఫరాను పునఃప్రారంభించారు. దీంతో గ్రామ ప్రజల తాగునీటి కష్టాలు తీరాయి.ప్రజా సమస్యలపై తక్షణమే స్పందించి, క్షేత్రస్థాయిలో పరిష్కారం చూపిన జిల్లా కలెక్టర్ , పాడా పాడ అధికారులకు, పిజిఆర్ఎస్ అధికారులకు, గ్రామీణ తాగునీటి సరఫరా శాఖ అధికారులకు, మండల మరియు గ్రామ పంచాయతీ అధికారులకు అర్జీదారుడు ప్రత్యేక కృతజ్ఞతలు మరియు ధన్యవాదాలు తెలియజేశారు. అలాగే ఈ సమస్య పరిష్కారంలో తమ వంతు సహకారం అందించిన జనసేన నాయకులకు, మిత్రులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇదే విధమైన స్పందనతో గ్రామంలో మరిన్ని మౌలిక వసతుల కల్పనకు అధికారులు సహకరించాలని కోరారు.

# మన శ్రీరామగిరి గ్రామంలో!..రెండేళ్ల నమ్మకం!..

### అభివృద్ధి సంక్షేమంపై విస్తృత ప్రచారం!..
### ఇచ్చిన హామీలకు కట్టుబడి!..
### పని చేస్తున్న కూటమి ప్రభుత్వం!..
### కరపత్రాలు పంపిణీ!..



**వి.ఆర్. పురం,సెప్టెంబర్ 6 (ప్రజాజ్యోతి ప్రతినిధి)**కూటమి ప్రభుత్వం రెండేళ్ల నమ్మకం, అభివృద్ధి సంక్షేమం పై, ఆదివారం, వరరామచంద్రాపురం మండలంలోని శ్రీరామగిరి, గ్రామంలో, తెలుగుదేశం పార్టీ నాయకులు, అభివృద్ధి సంక్షేమం అనే, కార్యక్రమంలో, కరపత్రాలను పంపిణీ చేశారు. పార్టీ మండల అధ్యక్షులు బొర్ర నరేష్ కుమార్, క్లస్టర్ ఇన్చార్జి వల్ల రంగారెడ్డి, తెలుగుదేశం పార్టీ, వాణిజ్య విభాగ నియోజకవర్గ అధ్యక్షులు బీరక సూర్యప్రకాశ్ రావు, ఆధ్వర్యంలో ఇంటింటికి కూటమి ప్రభుత్వం రెండేళ్లపాలన, అభివృద్ధి సంక్షేమం, ముద్రించిన కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షులు బొర్ర నరేష్ కుమార్,జడ్పి.టి.సి వల్ల రంగారెడ్డి, మాట్లాడుతూ, ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకుని అనేక సంక్షేమ అభివృద్ధి పథకాలను ప్రజలకు అందించిన కూటమి ప్రభుత్వానికే దక్కిందని అభిప్రాయం వ్యక్తం చేశారు.ఈ రెండేళ్లకాలంలో ప్రజాసంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేసిందని,ప్రజలు ఆనందంగా ఉన్నారని తెలిపారు. ఇంటింటికి ప్రజాసంక్షేమాన్ని అందించటమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని,అందులో ఏలాంటితేడాలేదని స్పష్టం చేశారు. ప్రజలకుసంక్షేమ పథకాలను అందించేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. ఐక్యమత్యమే ధ్యేయంగా ముందుకు వెళ్తున్నట్లు వెల్లడించారు. మును పెన్నడూలేని తరహాలోనే ప్రజా సంక్షేమపాలన దిశగా ప్రజల వద్దకే వెళ్తున్నట్లు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు నాళ్లరపు సత్యనారాయణ,కోడిసేల దుర్గారావు, పెట్టా వెంకన్న బాబు, ముత్యాల పోషి బాబు,స్థానిక కార్యకర్తలు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## కార్యకర్తలకు కొండంత అండ నేను మంత్రి నిమ్మల

### కార్యకర్తలకు ఏ కష్టం రానీయ్యను
### కార్యకర్త నాగ శ్రీను కుటుంబానికి రూ.లక్ష నగదు అందుచేత
### పెనుమదం గ్రామ తరుపున మంత్రి నిమ్మలకు ప్రత్యేక ధన్యవాదాలు



**పోడూరు, (ఆంధ్రప్రభ), - సెప్టెంబర్ -06 :** కార్యకర్తలకు అండగా ఉండేది తెలుగుదేశం (టిడిపి) పార్టీ అని, పాలకొల్లు నియోజకవర్గం లో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలకు కొండంత అండగా ఉంటానని రాష్ట్ర జలవనుల అభివృద్ధి శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. పోడూరు మండలం పెనుమదం గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్త వార్డు మాజీ సభ్యుడు బొంతు నాగ శ్రీను అకాల మరణానికి చింతిస్తూ ఆ కుటుంబానికి ఆదుకునేందుకు రూ, లక్ష విరాళం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల రామాయణం మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు నాయకులకు అండగా ఉండటమే టిడిపి ముఖ్య ద్యేయమని, ఆదిశగానే నియోజకవర్గంలో నాయకులకు భరోసాగా ఉంటానని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. కార్యకర్తలకు నాయకులకు ఏ కష్టం రానియ్యనని స్పష్టం చేశారు. నీటి సంఘం అధ్యక్షుడు దొరబాబు, మాజీ సర్పంచి తానేటి బాబురావు, దేవస్థానం చైర్మన్ తంగెళ్ల సతనారాయణ తదితరులు బొంతు నాగ శ్రీను కుటుంబానికి చేసిన సాయానికి మంత్రి నిమ్మల రామానాయుడు కు పెనుమదం గ్రామం తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.


# పిచ్చికుక్కల దాడి తో నలుగురు చిన్నారులు కు తీవ్రమైన గాయాలు



**అంబేద్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం బోడాస్కూరు గ్రామం ప్రజా జ్యోతి ప్రతినిధి** బోడస కుర్రు గ్రామంలో పిచ్చికుక్క స్తైరవిహారం చేసి నలుగురు చిన్నారులను కాటు వేసి పీకి వేయడం జరిగింది. తీవ్రంగా గాయపడినటువంటి నలుగురు చిన్నారులు అమలాపురం ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆ చిన్నారులను వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అమలాపురం కోఆర్డినేటర్ డాక్టర్ పినిపే శ్రీకాంత్ మరియు రాష్ట్ర వై ఎస్ ఆర్ సి పి ఆర్టిఐ జోన్ టు అధ్యక్షులు కొల్లు త్రినాధ వర్మ పరామర్శించడానికి వెళ్లిన సందర్భంలో ఆ ఏరియా ఆసుపత్రిలో మౌలిక సదుపాయాలు సరిగ్గా లేని కారణంగా ఉద్యోగుల నిర్లక్ష్యం పట్ల అమలాపురం వైఎస్ఆర్సిపి కోఆర్డినేటర్ డాక్టర్ పినిపే శ్రీకాంత్ విరుచుకుపడ్డారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అడ్మినిస్ట్రేషన్ సరిగ్గా లేదని ప్రజలు ప్రాణాలు అంటే లెక్క లేదని ఆయన విరుచుకుపడ్డారు. డాక్టర్ గా పనిచేసిన అనుభవం ఉన్న పినిపే శ్రీకాంత్ గారికి వైద్య విద్య వెన్నతో పెట్టిన విద్య కాబట్టి అక్కడ ఉన్న చిన్నారులను పరిస్థితులను చూసి చలించిపోయిన ఆయన అసలు పిచ్చి కుక్క కరిచిన బాధితులకు సరైన ప్రాథమిక చికిత్స అందించలేని దౌర్భాగ్య పరిస్థితిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉందని ఫస్ట్ ఎయిడ్ చేసే క్రమంలో కనీసం ఎలాంటి ట్రీట్మెంట్ చేయకుండా రిన్ సబ్బు ఉపయోగించి కడగమని పేషెంట్లకు చెప్పటం చాలా సిగ్గుచేటు అని ఈ విధమైన దౌర్భాగ్య పరిస్థితి ఈ ఆస్పత్రిలో నెలకొందని ఆయన వాపోయారు . అదేవిధంగా ఈ పరిస్థితిని చూసి వైఎస్ఆర్ సిపి ఆర్టీఐ జోన్ టు అధ్యక్షుడు కొల్లు త్రినాధ వర్మ ఇక్కడ పరిస్థితిని చూసి ఈ కూటమి ప్రభుత్వం ఆ మహనీయుడు ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీని అట్టకెక్కించడమే కాకుండా ఆయన ఆశయాలను తుంగలో తొక్కేశారు ఇప్పుడు ఉన్నటువంటి ఈ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రభుత్వ వైద్యశాలలు గాలికి వదిలేసారని తీవ్రంగా దయపట్టారు ఈ కార్యక్రమంలో చింత రామకృష్ణ కోలా ధర్మరాజు పెమ్మాడి సురేంద్ర బొంతు శ్రీను గాంధీ తదితరులు పాల్గొన్నారు

# మన్యంప్రజల గుండె చప్పుడు!..

### కామ్రేడ్ శ్యామల వెంకటరెడ్డి!..
### ఘనంగా30వ వర్ధంతి!..



**వి.ఆర్.పురం,సెప్టెంబర్ 6 (ప్రజాజ్యోతి ప్రతినిధి)** మన్యం ప్రజల గుండెచప్పుడు, శ్యామల వెంకట రెడ్డిని, ఆయన ఆశయసాధనకై కంకణబద్ధులై ఉద్యమిద్దాంమని, సి.పి.ఎం,పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు సున్నం రాజులు అన్నారు. ఆదివారం సి.పి.ఎం,పార్టీ కార్యాలయంలో వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వర్ధంతి కార్యక్రమంలో సున్నం రాజులు మాట్లాడుతూ, ఆదివాసీలకు అండగా ఉంటూ వ్యవసాయం చేస్తూ,సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తరింపజేస్తూ, మల్లంపేటవంటి మారుమూల గిరిజనగ్రామాల్లో బీ.టీ,రోడ్లు వేయించి,ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించిన మహోన్నతమైన గొప్ప వ్యక్తిత్వం కలిగిననేత శ్యామల వెంకట రెడ్డిని పేర్కొన్నారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధికై నిరంతరం శ్రమిస్తూ, అజ్ఞానంఅనే అంధకారంనుండి జ్ఞానంవైపు ప్రజలను చైతన్యవంతం చేస్తున్న వెంకటరెడ్డిపై, మావోయిస్టులు కక్షగట్టి హత్యచేయడం హేయమైన చర్యఅని ఆయన ఆరోపించారు. పోడుభూముల పట్టాలకై,తునికాకు బోనస్, వెదురుకార్మికుల కూలీలకు దక్కాల్సిన న్యాయమైన హక్కులకై ధైర్యంగా ఉద్యమించిన ధీరుడు అని ఆయన అభిప్రాయపడ్డారు.1996 సెప్టెంబర్ 6వ తేదీన నరహంతక పీపుల్స్ వార్ నక్సలైట్లు వెంకటరెడ్డిని, హత్య చేసి పొట్టనపెట్టుకున్నారని,ఆయన భౌతికంగా మనమధ్య లేకపోయినా ఆయన పోరాట స్ఫూర్తి,తెగింపు ధైర్యసాహసాలు నేటికీ మనకళ్ళముందు కథలాడుతున్నాయని, ఆయన ఆశయ సాధనకై ప్రతిఒక్కరూ నడుంబిగించాలని, సి.పి.ఎం, పార్టీకోసం కదిలి పనిచేయాలని పిలుపునిచ్చారు.అనంతరం శ్యామల వెంకటరెడ్డి చిత్రపటానికి నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలోజిల్లా కమిటి సభ్యులు సోయం చిన్నబాబు,మండల కమిటీ సభ్యులు పంకు సత్తిబాబు,కమ్మచిచ్చు సత్యనారాయణ,చల్లా అజరత్,సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ




**జి.కొండూరు:(సెప్టెంబర్ 6, ప్రజా జ్యోతి బ్యూరో భటి ట్రోలు నాగేశ్వరరావు):** జి. కొండూరు: మండలంలోని హెచ్.ముత్యాలంపాడు గ్రామంలో రైతులకు పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. మైలవరం నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ వసంత వెంకట కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో రైతుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తూ చేపడుతున్న కార్యక్రమాల్లో భాగంగా ఈ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వేములకొండ వెంకటేశ్వరరావు, మండల తెలుగుదేశం పార్టీ కార్యదర్శి లంకా నాగేశ్వరరావు రైతులకు పట్టాదారు పాసు పుస్తకాలను అందజేశారు.రైతుల భూములకు సంబంధించిన హక్కులను ధ్రువీకరించే పట్టాదారు పాసు పుస్తకాలు ఎంతో కీలకమైనవని వారు పేర్కొన్నారు. భూమికి సంబంధించిన హక్కులు స్పష్టంగా ఉండటంతో పాటు, రైతులకు వ్యవసాయ రుణాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు మరియు ఇతర వ్యవసాయ ప్రయోజనాలు పొందేందుకు ఇవి ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు.మైలవరం నియోజకవర్గంలో ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ గారు రైతుల సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారని నాయకులు పేర్కొన్నారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు.కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధికి పెద్దపీట వేస్తోందని, అర్హులైన ప్రతి రైతుకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ సహకారంతో కృషి చేస్తామని నాయకులు అన్నారు. పట్టాదారు పాసు పుస్తకాలు అందుకున్న రైతులు సంతోషం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ గారికి, పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధికి పట్టం కట్టండి.. బీజేపీ పిలుపు

విలీన మండలాల్లో బీజేపీ--మిత్రపక్షాలను గెలిపించాలి

సీపీఎం ప్రజలకు కావాల్సిన అభివృద్ధి సాధించలేకపోయిందన్న బీజేపీ నేతలు



**కూనవరం సెప్టెంబర్ 6. ప్రజా జ్యోతి పెదర్కూర్:** విలీన మండలాల్లో అభివృద్ధి జరగాలంటే బీజేపీతో పాటు మిత్రపక్ష పార్టీలను స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిపించాలని బీజేపీ రాష్ట్ర నాయకులు పాయం వెంకయ్య, నోముల రామారావు, కారందరయ్య పిలుపునిచ్చారు. పెదర్కూర్ గ్రామంలో బీజేపీ మండల అధ్యక్షుడు కరక పవన్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ, గత కొంతకాలంగా ఈ ప్రాంతంలో గెలుస్తున్న సీపీఎం ప్రజలకు అవసరమైన అభివృద్ధిని సాధించలేకపోయిందని విమర్శించారు. 45 కాంటూర్ పరిధిలోని ప్రజలకు న్యాయం జరగాలంటే కూటమి ప్రభుత్వం బలపడాలని వారు పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలకు ముందు భూపోరాటం పేరుతో నిర్వాసితుల భూముల విషయంలో సీపీఎం నాయకులు బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఈ ప్రాంతంలో సీపీఎం కూటమి గెలవకుండా ప్రజలు ఓడించాలని కోరారు. త్వరలో ఏజెన్సీ ప్రాంతానికి రెండు రైల్వే మార్గాలు రానున్నాయని, తద్వారా ఈ ప్రాంత అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పూనెం సురేష్, సోయం సుధారాణి, పాయం వెంకన్నబాబు, సీహెచ్ ప్రసాద్ తదితర నాయకులు పాల్గొన్నారు.

## ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ రద్దు చేయాలి



**విజయవాడ/తాళ్లపూడి సెప్టెంబర్ 6, ప్రజాజ్యోతి న్యూస్** ఇన్ సర్వీస్ టీచర్లకు ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) రద్దు చేయాలని కోరుతూ విజయవాడలో తూర్పుగోదావరి జిల్లా శాఖ ఆదివారం ధర్నా నిర్వహించినట్లు జిల్లా అధ్యక్షులు దున్నా దుర్గారావు తెలిపారు. 2011 నుండి టెట్ ఉత్తీర్ణత సాధించిన తర్వాత మాత్రమే డి ఎస్ సీ లో అర్హత సాధించి ఉపాధ్యాయులుగా నియమకం పొందుతూ ఉన్నారు. ఐతే ఇటీవల సుప్రీం కోర్టు తీర్పు నేపథ్యంలో ప్రస్తుతం ఉపాధ్యాయులుగా పనిచేస్తూ 2030 ఆగస్ట్ 31లోపల రిటైర్ అయ్యే వారికి మాత్రమే టెట్ నుండి మినహాయిస్తూ వెసులుబాటు కల్పించి మిగిలిన ఉపాధ్యాయులందరూ తప్పనిసరిగా టెట్ ఉత్తీర్ణులు కావాలనే తీర్పు మేరకు ఉపాధ్యాయులు టెట్ ఉత్తీర్ణత సాధించవలసి ఉంది. అయితే ఇది అసంబద్ధ నిర్ణయం అని 2011కు ముందు టెట్ నిబంధనలు అమలులో లేవని 2011 ముందు నియమితులైన ఉపాధ్యాయులందరికీ టెట్ రద్దు చేయాలని రాష్ట్ర శాఖ పిలుపులో భాగంగా ఈ ధర్నా నిర్వహించినట్లు దుర్గారావు తెలిపారు. ఈ ధర్నా కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కె శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులు పి గంగరాజు, కార్యదర్శి అనిత జ్యోతి, సలీం, శోభన్ బాబు, అప్పారావు, వెంకట్రావు, జి వి రమణరావు, దానరాజు పాల్గొన్నారు

## బేతంచెర్ల పట్టణంలో మార్మోగిన శ్రీకృష్ణ నామస్మరణ

వైభవంగా శ్రీకృష్ణ పరమాత్మ గ్రామోత్సవం



**బేతంచెర్ల:సెప్టెంబర్ 6(ప్రజా జ్యోతి)** శ్రీకృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని బేతంచెర్ల పట్టణంలోని గాయత్రినగర్ కాలనీలో శ్రీకృష్ణ పరమాత్మ గ్రామోత్సవాన్ని ఆదివారం భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. ప్రబోధ సేవా సమితి, హిందూ జ్ఞాన వేదిక, త్రైత సిద్ధాంతం ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణ పరమాత్మను పుష్పాలు, వివిధ రకాల అలంకరణలతో సుందరంగా ముస్తాబు చేసి పల్లకిలో కొలువుదీర్చారు. అనంతరం కాలనీలో పల్లకి సేవ, ఊరేగింపును ఘనంగా నిర్వహించారు. మంగళ వాయిద్యాల నడుమ సాగిన పల్లకి సేవకు చిన్నారులు, మహిళలు కోలాటాలతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఊరేగింపు మార్గంలో భక్తులు స్వామివారికి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి, హారతులు సమర్పించారు. శ్రీకృష్ణ నామస్మరణలు, భక్తిగీతాలతో కాలనీ మొత్తం ఆధ్యాత్మిక వాతావరణంతో నిండిపోయింది. చిన్నారులు, మహిళలు, యువత ఉత్సాహంగా పాల్గొనడంతో వేడుకలు మరింత శోభాయమానంగా సాగాయి. కార్యక్రమంలో త్రైత సిద్ధాంతం నిర్వాహకులు కొండారెడ్డి, మద్దిలేటితో పాటు పట్టణ ప్రముఖులు హుస్సేన్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి,ప్రసన్నలక్ష్మి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ శ్రీకృష్ణుని బోధనలు, ధర్మ మార్గాన్ని ప్రజలకు తెలియజేయడంతో పాటు ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శ్రీకృష్ణ నామస్మరణతో గాయత్రినగర్ కాలనీ మార్మోగగా, భక్తుల సందడి మధ్య శ్రీకృష్ణ పరమాత్మ గ్రామోత్సవం కన్నుల పండువగా ముగిసింది.

# పిఠాపురం మండలంలో 21 కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ద్వారా అండ





**7,34,110 విలువైన 21 సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ**

**పిఠాపురం: (ప్రజా జ్యోతి)** ఆపదలో ఉన్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు వైద్య చికిత్స సమయంలో ఆర్థిక భరోసా కల్పించాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా పిఠాపురం మండలంలోని 11 గ్రామాలకు చెందిన 21 మంది లబ్ధిదారులకు మొత్తం ?7,34,110/- విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షులు, పిఠాపురం శాసనసభ్యులు కొణిదెల పవన్ కళ్యాణ్ ఆదేశాలు, సూచనల మేరకు ఈ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. పిఠాపురం మండలం జనసేన పార్టీ ఇంచార్జి వెన్నా జగదీష్ సూచనల మేరకు, పిఠాపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వాకపల్లి దేవి సూర్యప్రకాష్ నాయకత్వంలో, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీ పెంకే జగదీష్ , అన్నవరం దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యులు గంజి గోవిందరాజు , ఏలేరు ప్రాజెక్టు వైస్ చైర్మన్ వూట నానీబాబు , మండల నాయకులు కారపరెడ్డి వెంకటేష్ తదితరుల చేతుల మీదుగా లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు.

**చెక్కులు పంపిణీ చేసిన గ్రావటూలు:**

1. చిత్రాడ 2. కందరాడ 3. ఎఫ్.కె. పాలెం 4. జల్లూరు 5. కోలంక 6. నర్సింగపురం 7. గోకివాడ 8. పి. రాయవరం 9. రాపర్తి 10. భోగాపురం 11. బి. పత్తిపాడు

మొత్తం లబ్ధిదారులు: 21 మంది

మొత్తం సీఎంఆర్ఎఫ్ సహాయం: ?7,34,110/-

ఈ సందర్భంగా సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందుకున్న లబ్ధిదారులు మాట్లాడుతూ, వైద్య అవసరాల సమయంలో ప్రభుత్వం అందించిన ఆర్థిక సహాయం తమ కుటుంబాలకు ఎంతో భరోసానిచ్చిందని తెలిపారు. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక సహాయం అందించినందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అలాగే పిఠాపురం ఎమ్మెల్యే, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ప్రత్యేక కృతజ్ఞతలు, అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పిఠాపురం మండలం వైస్ ప్రెసిడెంట్ నిమ్మన దుర్గబాబు, పిల్ల దినేష్, జనసేన గ్రామ కమిటీ ఇంచార్జులు నంద్యాల జాన్, పెద్దిరెడ్ల చిట్టి, బత్తిన దొరబాబు, మిరియాల చిట్టి, ఒలేటి సాయిరెడ్డి, కాయల పవన్, కీర్తి హరిబాబు, మాదేపల్లి పద్మావతి, కట్టా నానాజీ, వూట అమ్మిరాజు, అడపా శివరామకృష్ణ, మొయిళ్ళ విజయ్, పేర్నిడి చక్ర నారాయణ, పిల్లా రమ్య జ్యోతి, బొజ్జ నాగలక్ష్మి, మాదేపల్లి దుర్గాప్రసాద్, తదితర గ్రామ కమిటీ వార్డు బూత్ ఇన్చార్జిలు, జనసేన నాయకులు, జనసైనికులు, వీర మహిళలు పాల్గొన్నారు.

# గొల్లప్రోలులో జనసేనాని చొరవ

: సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రూ.10.71 లక్షల ఆర్థిక సాయం అందజేత

అడపా హేమంత్ లక్ష్మణ్ కుటుంబానికి రూ.8 లక్షల భారీ చెక్కు పంపిణీ

ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం , పిఠాపురం నియోజకవర్గ శాశ్వత శాసనసభ్యులు

కొణిదల పవన్ కళ్యాణ్ కృషితో పేద కుటుంబాలకు లభించిన ఆర్థిక భరోసా













**గొల్లప్రోలు (ప్రజా జ్యోతి)** ఆపదలో ఉన్న పేద ప్రజలను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ఎల్లప్పుడూ ముందుంటారని మరోసారి నిరూపితమైంది. పవన్ కళ్యాణ్ ప్రత్యేక చొరవ, దిశానిర్దేశంతో గొల్లప్రోలు చెందిన ఏడుగురు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మొత్తం రూ. 10,71,925 భారీ ఆర్థిక సహాయం మంజూరైంది. జూలై 22, బ్యాచ్‌లకు సంబంధించిన ఈ చెక్కులను గొల్లప్రోలు జనసేన పార్టీ పట్టణ అధ్యక్షుడు మామిడాల సూరిబాబు , పార్టీ ముఖ్య నాయకులు మరియు వీర మహిళలు కలిసి లబ్ధిదారులకు గడప దగ్గరికి వెళ్లి అందజేశారు.

**అడపా హేమంత్ కుటుంబానికి రూ.8 లక్షల భారీ సాయం!**

ఈ విడత సహాయంలో అన్నింటికంటే పెద్ద చెక్కుగా.. గొల్లప్రోలు ఈబీసీ కాలనీకి చెందిన దివంగత అడపా హేమంత్ లక్ష్మణ్ కుటుంబానికి రూ. 8,00,000 భారీ ఆర్థిక సాయాన్ని నాయకులు అందజేశారు. ఇంటి పెద్దను కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న ఆ కుటుంబానికి పవన్ కళ్యాణ్ అందించిన ఈ ఆర్థిక భరోసా ఒక కొండంత అండగా నిలిచింది. తమ ఆవేదనను ఆలకించి, ఇంత పెద్ద మొత్తాన్ని మంజూరు చేయించిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆ కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమై కృతజ్ఞతలు తెలుపుకున్నారు.

**లబ్ధిదారుల పూర్తి వివరాలు పరిశీలిస్తే**

అడపా హేమంత్ లక్ష్మణ్ (మరణించిన) కుటుంబం ఈబీసీ కాలనీ-- రూ. 8,00,000,మాదేపల్లి ఈశ్వరరావు (కొత్తపేట) రూ. 1,58,138,కొల్లి మంగ శ్రీదేవి (రైల్వేస్టేషన్) రూ. 30,028,కదరి నాగబాబు (గాంధీనగర్) రూ. 24,068, గుండ్ర నాగేశ్వరరావు (కొత్తపేట) రూ. 21,795, మురళశెట్టి సత్యవతి (కరణామాగిరితోట) రూ. 20,795,గురుబిల్లి వీరమణికంఠ (చిరుతడు) (కరణామాగిరితోట) రూ. 17,101 లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు.దఈ సందర్భంగా జనసేన పట్టణ అధ్యక్షుడు మామిడాల సూరిబాబు మాట్లాడుతూ.. "మాట ఇస్తే తప్పని నాయకుడు మన పవన్ కళ్యాణ్. నిరుపేదల ఆరోగ్య, ఆర్థిక ఇబ్బందులపై ఆయన తక్షణమే స్పందించి సీఎం రిలీఫ్ ఫండ్ వచ్చేలా చేశారు" అని కొనియాడారు. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న తమకు ఈ సాయం ఎంతో ఊరటనిచ్చిందని, కూటమి ప్రభుత్వం పేదల పక్షపాతి అని స్థానిక ప్రజలు, లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా గొల్లప్రోలు పట్టణ జనసేన నాయకులు వీర మహిళలు వార్డు ఇన్చార్జులు కార్యకర్తలు పాల్గొని ప్రతి ఇంటికి వెళ్లి చెక్కుల పంపిణీ చేశారు

# పిఠాపురం పరిధిలో బాల్యవివాహం వరుడు, తల్లిదండ్రులతో సహా పలువురిపై కేసు నమోదు

**పిఠాపురం (ప్రజా జ్యోతి)** పిఠాపురం మున్సిపాలిటీ పరిధిలోని జగ్గయ్య చెరువు ప్రాంతంలో చట్టవిరుద్ధంగా జరిగిన ఒక బాల్య వివాహం కలకలం రేపింది. ఈ ఘటనపై వన్నెపూడి గ్రామ పంచాయతీ కార్యదర్శి ఇచ్చిన నివేదిక ఆధారంగా గొల్లప్రోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. గత నెల ఆగస్టు 31వ తేదీ ఉదయం 11.00 గంటల సమయంలో జగ్గయ్య చెరువు ప్రాంతంలో ఒక మైనర్ బాలికకు బాల్య వివాహం జరుగుతున్నట్లు స్థానిక అంగన్‌వాడీ కార్యకర్తలకు ముందస్తు సమాచారం అందింది. వారు వెంటనే ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. రంగంలోకి చైల్డ్ మేరేజ్ ప్రొటెక్షన్ కమిటీ సమాచారం అందిన వెంటనే 'చైల్డ్ మేరేజ్ ప్రొటెక్షన్ కమిటీ' సభ్యులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. ఈ విచారణలో నాగళమూడి మంగరాజు, గాయత్రీ దంపతుల మైనర్ కుమార్తెకు, మొయిళ్ల రాంబాబు, మొయిళ్ల ఏసమ్మల కుమారుడైన మొయిళ్ల కృష్ణతో అప్పటికే వివాహం జరిగినట్లు కమిటీ అధికారులు గుర్తించారు. మైనర్ బాలికకు వివాహం చేయడం చట్టరీత్యా నేరం కావడంతో అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితులపై కేసు నమోదు:వన్నెపూడి గ్రామ పంచాయతీ కార్యదర్శి అందించిన అధికారిక నివేదిక మేరకు గొల్లప్రోలు సబ్ ఇన్‌స్పెక్టర్ నౌడ్ రామకృష్ణ కేసు నమోదు చేశారు. బాల్య వివాహం చేసుకున్న పెండ్లి కుమారుడు మొయిళ్ల కృష్ణ, అతనికి సహకరించిన అతని తల్లిదండ్రులు రాంబాబు, ఏసమ్మలతో పాటు, బాలిక తల్లిదండ్రులు నాగళమూడి మంగరాజు, గాయత్రీలపై పోలీసులు నిఘా పెట్టారు. వీటితో పాటు ఈ చట్టవిరుద్ధ వివాహానికి వత్తాసు పలికి సహకరించిన అని శెట్టి యాకోబురెడ్డి, మరికొందరు ఇతరులపై కూడా కేసు నమో దు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై గొల్లప్రోలు ఎస్.ఐ. రామకృష్ణ కేసును చట్టపరంగా ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నారు.



# డీఎస్సీపై నిజాలు నిగ్గు తేల్చాలి

### అర్హులకు న్యాయం చేయాలి.
### అవకతవకలపై స్వతంత్ర విచారణ జరపాలి..
### మాజీ సభాపతి తమ్మినేని సీతారాం డిమాండ్

**శ్రీకాకుళం. ప్రజా జ్యోతి.** డీఎస్సీ నియామక ప్రక్రియపై వస్తున్న ఆరోపణలు, అభ్యర్థుల ఫిర్యాదులను ప్రభుత్వం తీవ్రంగా పరిగణించి సమగ్రంగా పరిశీలించాలని మాజీ స్పీకర్, వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ పార్టీ అధ్యక్షుడు తమ్మినేని సీతారాం డిమాండ్ చేశారు. పరీక్షల నిర్వహణ నుంచి తుది ఎంపిక వరకు మొత్తం నియామక ప్రక్రియను స్వతంత్ర సంస్థతో విచారణ చేయించాలని, ఆరోపణల్లో వాస్తవం తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు అన్యాయం జరిగిన అర్హులైన అభ్యర్థులకు న్యాయం చేయాలని ఆయన స్పష్టం చేశారు. డీఎస్సీ వివాదంపై ప్రభుత్వం రాజకీయ విమర్శలతో తప్పించుకునే ప్రయత్నం చేయకుండా యువతకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.ఈ మేరకు ఆయన నిర్వహించిన మీడియా సమావేశంలో కూటమి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు.వైఎస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో ఉద్యోగ నియామకాల్లో పారదర్శకతకు పెద్దపీట వేశామని తమ్మినేని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో పదివేలకు పైగా డీఎస్సీ ఉద్యోగాలను భర్తీ చేశామని, గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ ద్వారా భారీ సంఖ్యలో ఉద్యోగ అవకాశాలు కల్పించామని చెప్పారు.వైసీపీ ప్రభుత్వ హయాంలో ఉద్యోగాలు భర్తీ చేసినప్పుడు ఎక్కడైనా డబ్బులు తీసుకున్నట్లు ఒక్క చిన్న ఆధారం బయటపడిందా? నియామకాల్లో అక్రమాలకు పాల్పడ్డామంటూ నిరూపితమైన ఆరోపణ ఏదైనా ఉందా? అని ప్రశ్నించారు. ప్రజలకు, నిరుద్యోగ యువతకు పారదర్శకమైన నియామక వ్యవస్థను అందించడమే తమ ప్రభుత్వ విధానమని తెలిపారు.అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వ హయాంలో డీఎస్సీ నియామకాలపై అనేక సందేహాలు, ఫిర్యాదులు, ఆరోపణలు వ్యక్తమవుతున్నాయని తమ్మినేని అన్నారు ముఖ్యంగా స్పోర్ట్స్ కోటాలో పరీక్ష లేకుండానే ఉద్యోగాలు కల్పించేందుకు జీవో తీసుకువచ్చి, నియామకాలు పూర్తయిన తర్వాత అదే జీవోను రద్దు చేయడం వెనుక ఉన్న ఉద్దేశం ఏమిటో ప్రభుత్వం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.నియామక ప్రక్రియలో ఒకసారి నిబంధనలు మార్చి, ఆ తర్వాత వాటిని వెనక్కి తీసుకోవడం అభ్యర్థుల్లో అనుమానాలకు తావిస్తోందని పేర్కొన్నారు ఉద్యోగాల కోసం బేరాలు జరిగాయనే ఆరోపణలు వస్తున్నప్పుడు ప్రభుత్వం ఎందుకు మౌనం వహిస్తోంది? నిబంధనల మార్పు, అమలు, రద్దుపై పూర్తి వివరాలను ప్రజల ముందుంచాలని అన్నారు.డీఎస్సీ నియామకాల్లో స్పోర్ట్స్ కోటా ధ్రువపత్రాల పరిశీలన సక్రమంగా జరిగిందా? అర్హత లేని వారు ప్రయోజనం పొందారా? అనే అంశాలపై సమగ్ర విచారణ జరగాల్సిన అవసరం ఉందని తమ్మినేని పేర్కొన్నారు.



అదే విధంగా కుల ధ్రువీకరణ పత్రాల విషయంలో వస్తున్న ఆరోపణలను కూడా ప్రభుత్వం తేలికగా తీసుకోకూడదన్నారు. తప్పు కుల ధ్రువీకరణ పత్రాలతో ఎవరైనా ప్రయోజనం పొందారా? అర్హత లేని వారికి రిజర్వేషన్ ప్రయోజనాలు దక్కాయా? అనే అంశాలను అధికారికంగా పరిశీలించాలని డిమాండ్ చేశారు.స్థానికత, నివాస అర్హతలకు సంబంధించి కూడా అభ్యర్థుల నుంచి సందేహాలు, ఫిర్యాదులు వస్తున్నాయని తమ్మినేని తెలిపారు. స్థానికతకు సంబంధించిన ప్రతి ఫిర్యాదును నిబంధనల ప్రకారం సమగ్రంగా పరిశీలించి వాస్తవాలను వెల్లడించాలని కోరారు.ఒక్క అర్హుడికి కూడా అన్యాయం జరగకూడదు. ఒకరి హక్కును మరొకరికి అక్రమంగా బదిలీ చేసే పరిస్థితి రాకూడదు. యువత భవిష్యత్తుతో ప్రభుత్వం చెలగాటం ఆడకూడదని ఆయన హెచ్చరించారు.డీఎస్సీ నియామక ప్రక్రియపై శాసనమండలిలో చర్చకు రావాలని తమ పార్టీ సవాల్ చేసినప్పుడు అధికార కూటమి సభ్యులు చర్చకు ముందుకు రాలేదని తమ్మినేని విమర్శించారు. ప్రజల ముందే ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన సమయంలో అధికార పక్షం వెనుకడుగు వేయడం అనేక అనుమానాలకు తావిస్తోందన్నారు.శాసనమండలిలో డీఎస్సీ అవకతవకలపై సమగ్ర చర్చకు సిద్ధంగా ఉన్నామని, ప్రభుత్వం కూడా అదే ధైర్యంతో ముందుకు రావాలని సవాల్ చేశారు.మీడియాలో వస్తున్న కథనాలను కూడా ప్రభుత్వం నిర్లక్ష్యం చేయకూడదని తమ్మినేని సూచించారు.అభ్యర్థులు వ్యక్తం చేస్తున్న సందేహాలు, సామాజిక మాధ్యమాల్లో వెలువడుతున్న ఆరోపణలు, మీడియా కథనాలు అన్నింటినీ సమగ్రంగా పరిశీలించి వాస్తవాలను ప్రజలకు వెల్లడించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు ఫిర్యాదులు వచ్చిన ప్రతిసారీ వాటిని రాజకీయ విమర్శలుగా కొట్టిపారేయడం సమస్యకు పరిష్కారం కాదని, నిజానిజాలను నిగ్గు తేల్చడమే ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు.డీఎస్సీ వివాదంపై విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాధ్యత వహించాలని తమ్మినేని డిమాండ్ చేశారు నియామక ప్రక్రియపై వస్తున్న ఆరోపణలకు మంత్రి నేరుగా సమాధానం చెప్పాలని, అభ్యర్థుల సందేహాలను నివృత్తి చేయాలని అన్నారు ఆరోపణలు నిజం కాదని ప్రభుత్వం భావిస్తే స్వతంత్ర విచారణకు ఎందుకు వెనుకాడుతోందని ప్రశ్నించారు. నిజాయితీగా నియామకాలు జరిగితే విచారణకు భయపడాల్సిన అవసరం ఏముంది? స్వతంత్ర సంస్థతో విచారణ జరిపించి వాస్తవాలను ప్రజల ముందుంచాలని అన్నారు. డీఎస్సీ వ్యవహారంపై తమ పార్టీ మూడు ప్రధాన డిమాండ్లతో ముందుకు సాగుతుందని తమ్మినేని తెలిపారు. నియామక ప్రక్రియపై స్వతంత్ర విచారణ జరపడం, అక్రమాలు రుజువైతే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవడం, వివాదానికి నైతిక బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయడం తమ డిమాండ్లని స్పష్టం చేశారు. పరీక్షల నిర్వహణ నుంచి ధ్రువపత్రాల పరిశీలన, స్థానికత నిర్ధారణ, తుది ఎంపిక వరకు ప్రతి దశను పరిశీలించాలని కోరారు.అర్హులైన అభ్యర్థులకు న్యాయం జరిగే వరకు వైఎస్సార్సీపీ వెనక్కి తగ్గబోదని తమ్మినేని స్పష్టం చేశారు. యువత ఆవేదనను ప్రభుత్వం గుర్తించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఫిర్యాదులను అణచివేయడం, ప్రశ్నించే గొంతులను నిర్లక్ష్యం చేయడం సమస్యను మరింత జఠిలం చేస్తుందని అన్నారు. డీఎస్సీపై పూర్తి నిజాలు బయటకు రావాల్సిందేనని, అర్హులైన అభ్యర్థులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని తెలిపారు.అధికారం శాశ్వతం కాదు ప్రజల తీర్పే అంతిమం. ఉద్యోగాల కోసం ఏళ్ల తరబడి చదివిన యువతకు అన్యాయం జరిగితే చూస్తూ ఊరుకోం.నియామకాల్లో నిజాయితీ, పారదర్శకత, జవాబుదారీతనం ఉండాలి. ఎవరి హక్కును ఎవరికీ అన్యాయంగా దూరం చేయకూడదు. డీఎస్సీపై వస్తున్న ప్రతి ఆరోపణకు ప్రభుత్వం సమాధానం చెప్పాల్సిందేనని తమ్మినేని సీతారాం స్పష్టం చేశారు.

## టీడీపీ పార్టీలోకి 500ల కుటుంబాలు చేరిక



**బద్వేల్ అర్బన్ గోపవరం సెప్టెంబర్ 6 ప్రజా జ్యోతి న్యూస్..**గోపవరం మండలంలో టీడీపీకి భారీ బలం వైఎస్సార్‌సీపీకి చెందిన సుమారు 500 కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరారుగోపవరం మండలంలోని వివిధ గ్రామాలు పంచాయతీలకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, వారి కుటుంబ సభ్యులు కడప జిల్లా టీడీపీ అధ్యక్షులు భూపేష్ సుబ్బరామిరెడ్డి , బద్వేలు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి మంచూరు సూర్యనారాయణ రెడ్డి గారి సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు.ఈ సందర్భంగా వారికి టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. టిడిపి పార్టీలో చేరిన వారిలో మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు నారపరెడ్డి వేణుగోపాల్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ కలువాయి విజయభాస్కర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు నారపరెడ్డి నరసింహారెడ్డి, మల్లికార్జున రెడ్డి తదితరులు టీడీపీలో చేరిన వారిలో ఉన్నారు. టీడీపీ అధినేత, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి నాయకత్వంలో రాష్ట్రంలో కొనసాగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై టీడీపీలో చేరుతున్నట్లు వారు తెలిపారు.500కుటుంబాల చేరికతో గోపవరం మండలంలో తెలుగుదేశం పార్టీ మరింత బలోపేతమైందని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో మరింత మంది టీడీపీ పార్టీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో బద్వేలు నియోజకవర్గ టీడీపీ నాయకులు, గోపవరం మండలం లోని వివిధ పంచాయతీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## శాఖా గ్రంధాలయంలో రిటైర్డ్ ఉపాధ్యాయులకు సన్మానం



**పాలకొల్లు. ప్రజా జ్యోతి రిపోర్టర్ కొట్టి రామం సెప్టెంబర్ 6.** పాలకొల్లు శాఖా గ్రంధాలయం లో గురుపూజోత్సవం సందర్భంగా గ్రంధాలయ పాలకురాలు వర్ధనపు శాంతకుమారి ఇద్దరు రిటైర్డ్ ఉపాధ్యాయులను సన్మానించారు. తొలుత సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం రిటైర్డ్ ఉపాధ్యాయులైన కే వి వి సత్యనారాయణ వేదాంతం వెంకట్రావులను శాలువ పూలమాలలతో సన్మానించి జ్ఞాపికలు పండ్లు అందజేశారు. ఈ సందర్భంగా గ్రంధాలయ పాలకురాలు శాంతకుమారి మాట్లాడుతూ ఎందరినో విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దే ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనది గౌరవప్రదమైనదినని అన్నారు. పదవి విరమణ అనంతరం అదే స్థాయిలో గౌరవించబడే వారు ఉపాధ్యాయులని వారి పదవి విరమణ అనంతరం ఎక్కడ ఉన్నా అనంతరం ఎక్కడ స్థిరపడిన తన శిష్యుల మనసుల్లో నిలిచి ఉంటారన్నారు. జన్మనిచ్చింది తల్లిదండ్రులైతే భవిష్యత్తుకు బాటలు వేసేది వారిని ఉన్నతులుగా తీర్చిదిద్దేది గురువులేని అన్నారు. గ్రంథాలయ చదువులు శ్రావ్య లలిత రామకృష్ణ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఒమ్మి వారి రిసెప్షన్ వేదికలో పాల్గొన్న రాష్ట్ర అధికార ప్రతినిధి మురళి రాజు



**కాకినాడ జిల్లా సెప్టెంబర్ 6 (ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్)** గొల్లప్రోలు మండలం చిన్న జగ్గంపేట గ్రామంలో మాజీ సర్పంచ్ వమ్మి చక్రం కుమారుడు సర్పంచ్ వమ్మి మల్లికార్జున రావు సోదరుడు కీర్తిశేషులురిసెప్షన్ వేడుకకు హాజరై వధూవరులను ఆశీర్వదించి ఆశీస్సులు అందజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో కోలా తాతబాబు ,జువ్వల దొరబాబు ,ఒమ్మి వారి కుటుంబ సభ్యులు ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు

## వివాహ వేడుకల్లో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించిన ఉమామహేశ్వర నాయుడు





**సెప్టెంబర్: 6(ప్రజా జ్యోతి) న్యూస్ రిపోర్టర్ ఖాన్,** కళ్యాణదుర్గం నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు, సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ మదినేని ఉమామహేశ్వర నాయుడు, పలు వివాహ వేడుకల్లో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఎనుములదొడ్డి గ్రామానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు మల్లప్ప, ఆహ్వానం మేరకు ఆయన కుమారుడు పురేంద్ర--రేవతి వివాహ వేడుకలకు ఉమామహేశ్వర నాయుడు హాజరయ్యారు. గ్రామంలోని శ్రీ ఓబులదేవర ఎల్లమ్మ దేవాలయంలో నిర్వహించిన వివాహ కార్యక్రమంలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.అనంతరం శెట్టూరు మండల కేంద్రానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఎర్రిస్వామి ఆహ్వానం మేరకు ఆయన కుమారుడు మహేంద్ర--యామిని వివాహ రిసెప్షన్‌కు హాజరై వధూవరులను ఆశీర్వదించారు.అలాగే శెట్టూరు మండల పరిధిలోని బొచ్చుపల్లి గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు నరసింహులు ఆహ్వానం మేరకు ఆయన కుమారుడు ఫణికుమార్--గౌతమి వివాహ రిసెప్షన్‌కు హాజరైన ఉమామహేశ్వర నాయుడు నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలియజేసి ఆశీర్వదించారు.ఈ కార్యక్రమాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, బంధుమిత్రులు పాల్గొన్నారు.

# పిఠాపురంలో మెగా జాబ్ మేళా విజయవంతం 65 మంది నిరుద్యోగుల ఎంపిక





**పిఠాపురం (ప్రజా జ్యోతి)** పిఠాపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నైపుణ్య అభివృద్ధి సంస్థ మరియు పిఠాపురం ఏరియా డెవలప్మెంట్ అథారిటీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా జాబ్ మేళా విజయవంతమైంది. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే ధ్యేయంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.ఈ జాబ్ మేళాకు ముఖ్య అతిథులుగా 'పాడా' ప్రాజెక్ట్ డైరెక్టర్ శివరాం, కాకినాడ జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి గోపి కృష్ణ, పిఠాపురం మున్సిపల్ కమిషనర్ రాజేశ్వరరావు, జనసేన టౌన్ ప్రెసిడెంట్ డాక్టర్ వరలక్ష్మి విచ్చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. యువత జీవితంలో ఏదైనా సాధించాలంటే పట్టుదల, నిరంతర కృషి అవసరమని పేర్కొన్నారు. సరైన సమయం కోసం వేచి చూస్తూ అవకాశాలను అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా పిఠాపురం నియోజవర్గంలోని యువత భవిష్యత్తుకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తూ ఈ జాబ్ మేళా నిర్వహించామని, నిరుద్యోగులందరూ ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా స్థిరపడాలని ఆకాంక్షించారు.ఈ మెగా జాబ్ మేళాకు నియోజవర్గ నలుమూలల నుంచి సుమారు 168 మంది నిరుద్యోగ అభ్యర్థులు హాజరయ్యారు. వివిధ కంపెనీల ప్రతినిధులు నిర్వహించిన ఇంటర్వ్యూల అనంతరం, వారిలో ప్రతిభ కనబరిచిన 65 మంది అభ్యర్థులను ఉద్యోగాలకు షార్ట్‌లిస్ట్ చేసినట్లు అధికారులు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో కాకినాడ జిల్లా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ సిబ్బంది, పాడా కార్యాలయ ఉద్యోగులు, కళాశాల సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# దళితల సమస్యలు పట్టించుకోని ప్రభుత్వం



**బద్వేల్ అర్బన్ గోపవరం సెప్టెంబర్ 6 ప్రజా జ్యోతి న్యూస్......,.........** దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు నాగ దాసరి ఇమ్మానుయేలు ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10 గంటలకు జె.వి భవన్ లో .డి. హెచ్ .పి .ఎస్ పట్టణ సమావేశం జరిగింది ఈ సమావేశానికి ఏరియా కార్యదర్శి గూడూరు పెంచలయ్య అధ్యక్షతన లో జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ పడగ వెంకటరమణ మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో కూటమి ప్రభుత్వం ఎస్సీ ఎస్టీలకు ఇచ్చిన హామీలు, అధికారంలోకి వచ్చిన తర్వాత హామీలు తుంగలో తొక్కిందని వారన్నారు. గత ప్రభుత్వ దళిత గిరిజనులకు అన్యాయం చేసిందని నేను వస్తానే న్యాయం చేస్తానని చంద్రబాబు నాయుడు చెప్పారు కానీ కూటమి ప్రభుత్వం వచ్చి రెండు సంవత్సరాల అయింది. కనీసం ఒక్క హామీని నెరవేర్చకపోవడం దళితుల పట్ల వివక్షేనని వారన్నారు. ఎస్సీ ఎస్టీల సమస్యల పరిష్కారం కోసం దళిత హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో పోరాటాలకు సిద్ధం కావాలని వారు పిలుపునిచ్చారు. పోరాడితే తప్ప ఈ ప్రభుత్వాలు పట్టించుకోవని వారు పేర్కొన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం దళితులకు భూములు ఇళ్ల స్థలాలు స్మాల్ స్కేల్ ఇండస్ట్రీ లా కోసం తక్షణమే రుణాలు మంజూరు చేయాలని లేని పక్షంలో ఆందోళన చేపడుతామని వారు హెచ్చరించారు.

## గంజాయి మత్తులో భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దు!

**సీఐ వి.కృష్ణ, ఎస్ఐ జి.అప్పలరాజు**



**ఎటపాక, సెప్టెంబర్ 6 (ప్రజాజ్యోతి):** మాదకద్రవ్యాలు, గంజాయి వంటి వ్యసనాలకు యువత, విద్యార్థులు దూరంగా ఉండాలని ఎటపాక సీఐ వి.కృష్ణ, ఎస్ఐ జి.అప్పలరాజు సూచించారు. పోలవరం జిల్లా చింతూరు సబ్‌డివిజన్ పరిధి లోని గుండాల గ్రామంలో పోలీసుల ఆధ్వర్యంలో ఆదివారం ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ.. మాదకద్రవ్యాలు, గంజాయి మాయ లో పడి యువత తమ విలువైన భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని సూచించారు. ముఖ్యంగా విద్యార్థులు సెల్‌ఫోన్ వ్యసనానికి లోనై చదువులు, భవిష్యత్‌ను నిర్లక్ష్యం చేయకూడదన్నారు. సెల్‌ఫోన్‌ను అవసరమైన మేరకు మాత్రమే వినియోగిస్తూ విద్యపై దృష్టి సారించాలని సూచించారు. మైనర్ వయస్సు గల విద్యార్థులు మోటార్ సైకిళ్లు నడపడం చట్టవిరుద్ధమని తెలిపారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలకు వాహనాలు ఇచ్చి ప్రమాదాలకు కారణం కావద్దని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని అవగాహన కల్పించారు. అదేవిధంగా సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్‌కాల్స్, సందేశాలు, లింక్‌ల పట్ల జాగ్రత్తగా ఉండాలని, వ్యక్తిగత వివరాలు, బ్యాంకు ఖాతా సమాచారం, ఓటీపీ వంటి వివరాలను ఎవరికీ వెల్లడించకూడదని తెలిపారు. మహిళల భద్రతపై కూడా ప్రజలకు అవగాహన కల్పిస్తూ.. మహిళలు, బాలికల రక్షణకు పోలీసులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని తెలిపారు. గ్రామ ప్రజలు చట్టాలను గౌరవిస్తూ, అప్రమత్తంగా జీవించాలని సూచించారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని, మంచి ఉద్యోగాలు సాధించి తల్లిదండ్రులకు మంచి పేరు, గౌరవం తీసుకురావాలని పోలీసులు ఆకాంక్షించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# 80 ఏళ్ల నిరీక్షణకు తెర.. ఐపార్సపల్లి రోడ్డుకు తారు!

## ప్రభుత్వానికి, ఎమ్మెల్యే సురేంద్రబాబుకు సూర్య నాయక్ ప్రత్యేక ధన్యవాదాలు

**కంబదూరు సెప్టెంబర్ 6:(ప్రజా జ్యోతి) న్యూస్ రిపోర్టర్ ఖాన్,** స్వాతంత్ర్యం వచ్చి 80 సంవత్సరాలు గడిచినా కనీసం ఒక్క తారు చుక్క కూడా పడని ఐపార్సపల్లి గ్రామానికి ఎట్టకేలకు తారు రోడ్డు వేయడం ప్రారంభం కావడం పట్ల గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ చారిత్రాత్మక సందర్భంగా ప్రభుత్వానికి, కళ్యాణదుర్గం శాసనసభ్యులు అమిలినేని సురేంద్రబాబుకు గిరిజన సంక్షేమ సంఘం రాయలసీమ జిల్లాల అధ్యక్షులు ఇస్లావత్ సూర్య నాయక్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా సూర్య నాయక్ మాట్లాడుతూ, స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి ఐపార్సపల్లి గ్రామ ప్రజలు సరైన రహదారి కోసం ఎదురుచూస్తూనే ఉన్నారని తెలిపారు. గతంలో ఎన్నోసార్లు గ్రామానికి రోడ్డు వేయాలని సంబంధిత అధికారులకు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు అందజేసినా ఎవరూ పట్టించుకున్న పాపాన పోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. "ఎన్నో ఏళ్లుగా మా గ్రామ ప్రజలు రోడ్డు కోసం ఎదురుచూశారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన మాటను నిలబెట్టుకుని నేడు ఐపార్సపల్లి గ్రామానికి తారు రోడ్డు వేయిస్తున్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు చొరవ అభినందనీయం అని సూర్య నాయక్ పేర్కొన్నారు. దశాబ్దాలుగా రోడ్డు లేక గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని, వర్షా కాలంలో పరిస్థితి మరింత దయనీయంగా మారేదని తెలిపారు. విద్యార్థులు, రైతులు, వృద్ధులు, అత్యవసర వైద్యం కోసం వెళ్లే ప్రజలు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సిన పరిస్థితి ఉండేదని గుర్తు చేశారు. 80 సంవత్సరాల సుదీర్ఘ నిరీక్షణకు ముగింపు పలుకుతూ ఐపార్సపల్లి గ్రామానికి తారు రోడ్డు వేయడం గ్రామ చరిత్రలోనే ఒక శుభపరిణామం అని ఆయన అన్నారు. గ్రామ ప్రజల ఎన్నో ఏళ్ల కలను సాకారం చేస్తున్న ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు సూర్య నాయక్ పేర్కొన్నారు. అదేవిధంగా ఎన్నికల ముందు ఇచ్చిన హామీని నిలబెట్టుకుని రోడ్డు పనులు చేపట్టేలా చర్యలు తీసుకున్న కళ్యాణ దుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబుకు ఐపార్సపల్లి గ్రామ ప్రజల తరఫున కూడా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. "వినతిపత్రాలు ఇచ్చినా స్పందించని రోజులు చూశాం.. కానీ నేడు ఇచ్చిన మాటను నిలబెట్టుకుని మా గ్రామ అభివృద్ధికి బాటలు వేస్తున్న ఎమ్మెల్యే సురేంద్ర బాబుకు ఐపార్సపల్లి ప్రజలు ఎప్పటికీ కృతజ్ఞులుగా ఉంటారు" అని సూర్య నాయక్ అన్నారు. ఈ రోడ్డు పూర్తయితే గ్రామ ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగుపడి, విద్య, వైద్యం, వ్యవసాయం, ఉపాధి అవసరాలకు ప్రయాణం సులభతరం అవుతుందని గ్రామస్తులు ఆశాభావం వ్యక్తం చేశారు.



# మనవి.ఆర్.పురం మండలంలో!..

**వి.ఆర్.పురం,సెప్టెంబర్ 6 (ప్రజాజ్యోతి ప్రతినిధి)** ఎన్టీఆర్ భరోసా కొత్త పెన్షన్లకు దరఖాస్తుల ఆహ్వానం.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకం కింద కొత్త పెన్షన్ల మంజూరుకు అవకాశం కల్పించింది. ఈ మేరకు ప్రభుత్వం హెచ్.టి.టి.పి// జీ.ఓ.ఎం.ఎస్ నెంబర్04తేదీ 6:9:2026, ద్వారా ఉత్తర్వులు జారీ చేసింది. వరరామచంద్రాపురం, మండలంలోని అర్హులైన పేదలు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎం.పి.డి. వో, ఇమ్మానియల్, సూచించారు.

**దరఖాస్తులు ఎక్కడ ఏలా ఇవ్వాలి!..**

మండలంలోని అన్ని స్వర్ణ గ్రామ సచివాలయాల్లో,దరఖాస్తు ఫారాలు అందుబాటులో ఉన్నాయి.అర్హులైన వారుతమ పరిధి లోని సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్ /డబ్ల్యు. ఈ.డి.పి. ఎస్,దరఖాస్తు అందజేయాలి.

**దరఖాస్తుకు చివరి తేదీ!..**

07.09.2026 నుండి 16.09.2026 వరకు మాత్రమే (7 పని దినములు) దరఖాస్తులు స్వీకరించబడును.

**అర్హత కలిగిన పెన్షన్ కేటగిరీలు:**

1:-వృద్ధాప్య పెన్షన్ (ఓ.ఏ.పి)
2:- వితంతు పెన్షన్
3:-ఒంటరి మహిళ పెన్షన్
4:-వికలాంగుల పెన్షన్ (సధరం సర్టిఫికెట్ తప్పనిసరి)
5:-నేత కార్మికులు, మత్స్యకారులు, డప్పు కళాకారులు, సాంప్రదాయ చెప్పులు కుట్టేవారు, గీత కార్మికులు మరియు ట్రాన్స్‌జెండర్లకు వృత్తిపరమైన పెన్షన్లు.

**తీసుకురావలసిన పత్రాలు!..**

ఆధార్ కార్డ్, రైస్ కార్డ్ / రేషన్ కార్డ్, బ్యాంక్ అకౌంట్, సంబంధిత కేటగిరీ సర్టిఫికెట్ (వితంతు / వికలాంగ / ఒంటరి మహిళ మొదలగునవి) తప్పనిసరిగా తీసుకురావాలి.ఈ.కె.వై.సి తప్పనిసరి.

**వెరిఫికేషన్ ప్రక్రియ!..**

17.09.2026 నుండి 21.09.2026 వరకు సచివాలయ సిబ్బంది ఇంటింటికి వచ్చి ఫిజికల్ వెరిఫికేషన్ చేస్తారు. 24.09.2026 లోగా ఎం.పి.డి.వో, స్థాయిలో పరిశీలించి రాష్ట్ర స్థాయికి సిఫార్సు చేయడం జరుగుతుంది. ప్రభుత్వ ఆమోదం, బడ్జెట్ లభ్యత మేరకు 26.09.2026 తర్వాత పెన్షన్ మంజూరు చేయబడుతుంది. మంజూరు అయిన నెల నుండే పెన్షన్ వస్తుందని, ఎటువంటి బకాయిలు రావని తెలియజేయడ మైనది. మండలంలోని అర్హులైన వారు గడువులోగా



సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని కోరడమైనది.

# అక్రమ లేఅవుట్లపై చర్యలు తీసుకోవాలి

## కొనుగోలుదారులకు న్యాయం చేయాలి

## -- సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ డిమాండ్

**బద్వేల్ స్టాఫ్ రిపోర్టర్ సెప్టెంబర్ 6 (ప్రజా జ్యోతి)** చట్టబద్ధత లేని లేఅవుట్లపై చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం వహిస్తున్న మున్సిపల్, రెవెన్యూ అధికారుల తీరును సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ జిల్లా స్టాండింగ్ కమిటీ సభ్యులు ఎస్. చంద్రశేఖర్ తప్పుబట్టారు. అక్రమ లేఅవుట్ల యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుని, మోసపోయిన కొనుగోలు దారులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఆదివారం పార్టీ నాయకులతో కలిసి బద్వేల్ పట్టణంలోని పలు వెంచర్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ.. బద్వేల్ పట్టణం అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో పేద, మధ్యతరగతి ప్రజలు తమ సొంత స్థలం కోసం కష్టపడి సంపాదించిన డబ్బుతో పాటు అప్పులు చేసి ప్లాట్లు కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. ఈ పరిస్థితిని కొందరు వెంచర్ల యజమానులు, దళారులు అవకాశంగా తీసుకుంటున్నారని ఆరోపించారు. కొంత రిజిస్టర్ భూమిని చూపించి, మరికొంత డీకేటీ లేదా ప్రభుత్వ భూమిని నిబంధనలకు విరుద్ధంగా కలిపి లేఅవుట్లు ఏర్పాటు చేసి, దళారుల ద్వారా ప్రజలకు ప్లాట్లు విక్రయిస్తున్నారని పేర్కొన్నారు. ఇలా పట్టణ పరిధిలో 18కు పైగా వెంచర్లు ఉన్నాయని ఆయన ఆరోపించారు. మడకలవారిపల్లె, చెన్నంపల్లి, బయనపల్లె, బద్వేల్ పట్టణ పరిధిలో, నేషనల్ హైవే పక్కన విలువైన భూములను వెంచర్ల పేరుతో ఆక్రమిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. కొత్త అధికారులు వచ్చిన ప్రతిసారీ చర్యలు తీసుకుంటామని చెప్పి, ఒకటి రెండు చోట్ల హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి చేతులు దులుపుకుంటున్నారని ఆరోపించారు. పోరుమామిళ్ల బైపాస్ సమీపంలోని ఓ వెంచర్‌లో 100 మందికి పైగా లక్షలాది రూపాయలు వెచ్చించి ప్లాట్లు కొనుగోలు చేశారని, అనంతరం వివాదం తలెత్తి కోర్టుకు వెళ్లడంతో వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అప్పులకు వడ్డీలు చెల్లించలేక, స్థలాలు అమ్ముకోలేక, ఇళ్లు నిర్మించుకోలేక బాధితులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అక్రమ వెంచర్లపై అధికారులు తక్షణమే చర్యలు తీసుకుని బాధితులకు న్యాయం చేయాలని, లేకపోతే బాధితులందరినీ కలుపుకుని సీపీఐ (ఎంఎల్) బరేషన్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని చంద్రశేఖర్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ కార్యదర్శి పి. చంద్రమోహన్ రాజు, జిల్లా కమిటీ సభ్యులు కే. జకరయ్య, నియోజకవర్గ కమిటీ సభ్యులు రామరాజు, బాబు, విజయరావు, సంజీవ రాయుడు, నారాయణ, జయరామరాజు, గంట మహబూబ్ బాషా, ఈశ్వర్, చెన్నయ్య, వెంకటేష్, జైపాల్, చంద్రపాల్, దేవదానం, శాంసన్ తదితరులు పాల్గొన్నారు.



# వీఆర్ఏల సమస్యలపై ప్రభుత్వం స్పందించాలి

## -- గుజ్జుల ఈశ్వరయ్య డిమాండ్

**బద్వేల్ స్టాఫ్ రిపోర్టర్ సెప్టెంబర్ 6 (ప్రజా జ్యోతి)** ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ ఉద్యోగ సంఘాలతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విజయవాడ ఉండవల్లిలోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వీఆర్ఏల సమస్యలపై ఎలాంటి ప్రస్తావన లేకపోవడం తీవ్ర అన్యాయమని ఏపీ వీఆర్ఏ వెల్ఫేర్ అండ్ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య ఆవేదన వ్యక్తం చేశారు. విజయవాడ గాంధీనగర్‌లోని అసోసియేషన్ సిటీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గ్రామ రెవెన్యూ సహాయకులు (వీఆర్ఏ) ఎదుర్కొంటున్న డీఏ బకాయిలు, ఏరియర్స్, ప్రాథమిక బేసిక్ పే స్కేల్, నామినీలు, కారుణ్య నియామకాల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించారు. దాదాపు తొమ్మిదేళ్లుగా వీఆర్ఏలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వాన్ని వేడుకుంటున్నా స్పందన లేదని అన్నారు. నిరుపేద చిరుద్యోగులైన వీఆర్ఏల ఆర్థిక ఇబ్బందులను ప్రభుత్వం గుర్తించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు, ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న అంశాలను అమలు చేయాలని కోరారు. రాష్ట్రంలో సుమారు 20 వేల మంది వీఆర్ఏలు ఉన్నారని, తక్కువ వేతనాలతో కుటుంబాలను పోషించుకోలేక తీవ్ర ఆర్థిక, మానసిక ఒత్తిడికి గురవుతున్నారని ఈశ్వరయ్య తెలిపారు. రెవెన్యూ వ్యవస్థను క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడంలో కీలకంగా పనిచేస్తున్న వీఆర్ఏల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కోరారు. వీఆర్ఏల హక్కుల సాధన కోసం ఐక్యంగా ఉద్యమిస్తామని, కార్మిక, ప్రజాస్వామిక, లౌకిక శక్తులను కలుపుకుని పోరాటాలకు సిద్ధమవుతామని ఆయన ప్రకటించారు. ప్రభుత్వం స్పందించి సమస్యలను పరిష్కరించే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ విలేకరుల సమావేశంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు నల్లిపోగు నాగేశం, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం. సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.




# నిత్యవసర సరుకుల ధరలు తగ్గించాలని నేడు తాసిల్దార్ కార్యాలయం వద్ద నిర్వహించే ధర్నాలు జయప్రదం చేయండి



**గుంతకల్లు సెప్టెంబర్ 6 (ప్రజా జ్యోతి):** ఇటీవల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విధానాల వలన నిత్యవసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటుతు న్నాయని ధరల పెరుగుదల వలన సామాన్య ప్రజలు జీవనం అగమ్యగోచరంగా మారిందని. ధరలు పెరుగుదలను, రేషన్ డిపోల ద్వారా ప్రజలకు అవసరమైన 14 రకాల నిత్యావసర సరుకులను తక్కువ ధరలకు సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ ఐద్వా మహిళా సంఘం ఆధ్వర్యంలో సెప్టెంబర్ 7 న సోమవారం గుంతకల్లు తాసిల్దార్ కార్యాలయం వద్ద నిర్వహించే ధర్నాలో పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొనాలని పిలుపునిస్తు ట్రావెలెస్ బంగ్లా వద్ద ఆదివారం సంతకాల సేకరణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐద్వ మహిళా సంఘం జిల్లా నాయకురాలు బి.జ్యోతి, పట్టణ కమిటీ సభ్యులు సుగుణ, సరస్వతి, పూర్ణిమ, శివమ్మ పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలకు వామపక్షాల ఐక్య పోరాటమే పరిష్కారం

**సీపీఎం జిల్లా కార్యదర్శి జి. చంద్రశేఖర్**





**బద్వేలు స్టాఫ్ రిపోర్టర్ సెప్టెంబర్ 6 (ప్రజా జ్యోతి)** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ల ప్రయోజనాల కోసం పనిచేస్తున్నాయని, ప్రజా సమస్యల పరిష్కారానికి వామపక్షాల ఆధ్వర్యంలో బలమైన ప్రజా ప్రతిఘటన ఉద్యమాలు అవసరమని సీపీఎం జిల్లా కార్యదర్శి జి. చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం బద్వేలు పట్టణంలోని పెన్షన్ అసోసియేషన్ మీటింగ్ హాల్‌లో పట్టణ ప్రజా సంఘాల సమావేశం కన్వీనర్ కే. శీను అధ్యక్షతన "శాస్త్రీయ రాజకీయ శిక్షణ తరగతులు" నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్‌తో పాటు సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు పి. చాంద్ బాషా, మహిళా సంఘం నాయకురాలు మోక్షమ్మ, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎం. చిన్ని, వివిధ ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ, మానవాభివృద్ధి సూచికలో భారత్‌లో అసమానతలు తీవ్రంగా ఉన్నాయని అన్నారు. రూపాయి విలువ పతనం, నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలకు ప్రభుత్వ ఆర్థిక విధానాలే కారణమని విమర్శించారు. దేశ సంపదను కార్పొరేట్ల లాభాల కోసం ప్రభుత్వాలు వినియోగిస్తున్నాయని ఆరోపించారు. కులం, మతం, ప్రాంతం, భాష ఆధారంగా పాలన సాగించడం దేశ సమైక్యత, సమగ్రతకు ప్రమాదకరమని అన్నారు. అందరికీ సమానత్వాన్ని చాటిన భక్తి ఉద్యమాల స్ఫూర్తికి భిన్నంగా మైనార్టీలపై విద్వేష భావాలను పెంచే విధానాలు కొనసాగుతున్నాయని విమర్శించారు. భూస్వామ్య, దోపిడీ వ్యవస్థలకు అనుకూలమైన మనుధర్మ శాస్త్రం కుల వ్యవస్థను బలపరిచిందని పేర్కొన్నారు. స్థానిక సంస్థలకు నిధులు, విధులు, అధికారాలు కల్పించి రాజ్యాంగంలోని 73, 74వ సవరణలకు అనుగుణంగా ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. విద్య, వైద్య రంగాల్లో ప్రభుత్వ వ్యయాన్ని తగ్గించి ప్రజలపై భారాలు మోపుతున్నారని అన్నారు. పేదరిక నిర్మూలన పథకాలను నిర్వీర్యం చేయడం ఆపాలని కోరారు. దేశ జనాభాలో సుమారు సగం ఉన్న మహిళలకు పార్లమెంటులో తగిన ప్రాతినిధ్యం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. పట్టణాల్లో స్వయం ఉపాధి అవకాశాలు పెంచడంతో పాటు మురికివాడల అభివృద్ధికి ప్రత్యేక నిధి ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఇ. రమణయ్య, మున్సిపల్ నాయకులు నాగేంద్రబాబు, శివ, కాంట్రాక్ట్ కార్మిక సంఘం నాయకులు కొండయ్య, స్కీం వర్కర్ల నాయకులు సుభాషిణి, విజయమ్మ, లీలావతి, మహిళా సంఘం నాయకులు బాలమ్మ, మస్తాన్ బీ, సుబ్బలక్ష్మి, సావిత్రి, స్వప్న, మార్తమ్మ, రజక వృత్తిదారుల సంఘం నాయకులు సుబ్బరాయుడు, శ్రీనివాసులు, శౌరి, విభిన్న ప్రతిభావంతుల సంఘం నాయకులు మోరా ప్రసాద్, వెంకటపతి, హమాలీ వర్కర్స్ యూనియన్ నాయకులు పెద్ద ఓబయ్య, వెంకటేశ్వర్లు, మద్దయ్య, లక్ష్మయ్య, తిరుపతి రామయ్య, కేవీపీఎస్ నాయకులు జకరయ్య, రాయప్ప, వెల్డింగ్ వర్కర్స్ నాయకులు మల్లికార్జున, కార్పెంటర్స్ సంఘం నాయకులు దస్తగిరి, ఆవాజ్ నాయకులు అన్వర్ భాష, మస్తాన్, హబీబుల్లా తదితరులు పాల్గొన్నారు.

# ఆలమూరు శ్రీ జనార్ధన స్వామి వారిని దర్శించుకున్న కొత్తపేట ఎలక్ట్రికల్ డీఈ కొత్తపల్లి రాంబాబు.



**ఆలమూరు సెప్టెంబర్ 6(ప్రజాజ్యోతి):** ఆలమూరు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ జనార్దన స్వామి వారిని కొత్తపేట ఎలక్ట్రికల్ డీఈ కొత్తపల్లి రాంబాబు ఆదివారం దర్శనం చేసుకున్నారు. ఆయనకు ఆలయ చైర్మన్ బైరిశెట్టి రాంబాబు సాదర స్వాగతం పలికారు. స్వామివారిని దర్శించుకుని డీఈ రాంబాబు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు అంగర భగవానాచార్యులు ఆయనకు స్వామివారి తీర్థప్రసాదాలు, శేష వస్త్రం అందజేశారు. స్వామివారిని దర్శించుకోవడం చాలా ఆనందంగా ఉందని ఆయన తెలిపారు.

# వెనుకబడిన వర్గాల కొండరెడ్డి నేతగా!..

## 2000 సంవత్సరం నుండి నేటి 2026 వరకు ఓటమిలేని నేతగా!..

## 2021సంవత్సరంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోనే ఏకైక జడ్పీ.టి.సి,గా చరిత్ర సృష్టించిన నేతగా!..

## ప్రస్తుత పోలవరంజిల్లాలోనే కొండరెడ్డి తెగబలమైన నేతగా!..







**వి.ఆర్.పురం,సెప్టెంబర్6 (ప్రజాజ్యోతి ప్రతినిధి)**వెనుకబడిన మారుమూల ఆదివాసీగిరిజన కొండరెడ్డి తెగకు చెందినవళ్ళ మంగిరెడ్డి, వల్లగంగమ్మ, దంపతులకు వల్ల రంగారెడ్డి1975లో పోచవరం, అనే మారుమూలకుగ్రామంలోజన్మించారు.అప్పటికే కనీససౌకర్యాలు అక్కడ లేవు,విద్యావైద్యానికి ఆమడధూరంలో అరకొర సౌకర్యాలు మధ్యజీవితాన్ని కొనసాగిస్తున్నారు. 20ఏళ్ళ వయస్సులోఅంటే1995 సంవత్సరంలో కొండరెడ్డి జీవితాల జీవన స్థితిగతులపై సంపూర్ణ అవగాహన కలిగి తెలుగుదేశం పార్టీకి, ఒక మిలిటెంట్ కార్యకర్తగా మారాడు. పేదప్రజలకు ఆదివాసీ గిరిజనులకు, సేవచేయాలనే సంకల్పంతో ముందుకు గా సాగారు.రాజకీయాలు అరంగ్రేటంతోనే తుమ్మిలేరు పంచాయతీలో తెలుగుదేశం పార్టీజెండా ఎగుర వేశారు.నాటి నుండినేటివరకు తెలుగుదేశం పార్టీ, కంచుకోటగా, నేటికి విరాజిల్లుతుంది. ఇది ఊహాకదంనిజం.తెలుగుదేశంపార్టీకి 20 ఏళ్ళ వయస్సులో క్రియాశీలక సభ్యులుగా మారారు.ఆదివాసీ కొండరెడ్డి గిరిజనులకు అభివృద్ధిని రుచి చూపించిన, ఘనత వల్ల రంగారెడ్డికి దక్కింది. నాటినుండి నేటివరకు ఆపంచాయతీలో తెలుగుదేశంపార్టీ విజయం సాధిస్తూవస్తుంది. వల్ల రంగారెడ్డి,కొండరెడ్డి బాధలు చూస్తూ,ఇబ్బందులను చూస్తూ పెరిగారు. ఏదోచేయాలనే తపన ఉండేది. ఇలాంటితెగయందుజన్మించినందుకు గర్వపడ్డాడు.కొండరెడ్డి గిరిజనులు స్థితిగతులను మార్పుకోసం,సరైన ప్లాట్ ఫామ్ కోసం, తెలుగుదేశంపార్టీ ఎంచుకోని,నారా చంద్రబాబు నాయుడు, కిఅత్యంత సన్నిహితుడిగావిజయంవైపు నడిచాడు. మాఆదివాసీ కొండరెడ్డి,కమ్యునిటీకి,కొంత అభివృధికి చేరువచేయాలనే ఆలోచన, ప్రజల్లోకి తీసుకుని రావాలని చిన్నప్పటినుండి నాలోబలంగా నాతోపాటు పెరుగుతూ వచ్చిందని కొన్ని సందర్భాల్లో చెప్పకనే చెప్పారు.బలహీన కొండరెడ్డి,గిరిజన కొండలపైఉన్న కొండారెడ్డివర్గాల జీవితాలు మరియు జీవనస్థితిగతులపై సంపూర్ణఅవగాహన కలిగిన కార్యకర్త గామారారు.విద్యుత్ లేని గ్రామాలకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, చొరవతో, విద్యుత్ ఏర్పాటు చేశారు.పేదవర్గాలకు సేవ చేయాలనే తపన చివరికి, తెలుగుదేశంపార్టీ పెద్దల దృష్టిని ఆకర్షించింది. ఇదిగిరిజన అభివృద్ధి దారి తీసింది.ఈ ప్రక్రియలో తనస్వచ్ఛంద సేవకులను సామాజిక సమస్యల వైపు సమీకరించడంద్వారా మరియు సంస్థలసామర్థ్యాలను పెంపొందించడంద్వారా అట్టడుగు స్థాయిలో పార్టీని బలహీనవర్గ కొండారెడ్డి,వారికి కార్యక్రమాలఅమలు చేయడానికి సమర్థవం తమైన నాయకులు అభివృద్ధి చేశాడు. ఈప్రక్రియలోఎన్నో ఆటుపోట్లకు లోనైనా ఎక్కడావెనకడుగు వేయలేదు.వల్ల రంగారెడ్డి,ను అతను అభివృద్ధి అమలు మరియు నిర్వహణలో నైపుణ్యాలను సంపాదించాడు. తత్ద్వారా తత్ఫలితంగా,అతను 2000 ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం ఉమ్మడి ఖమ్మం జిల్లావి.ఆర్.పురం,మండలంలోనితుమ్మిలేరు పంచాయతి సర్పంచ్ గా తెలుగుదేశంపార్టీ నుండి గెలు పొంది,రికార్డ్ మెజారిటీతో బోణీకొట్టారు.ఆబోణి అలాగే సుమారు 26ఏళ్ళు కంటిన్యూగా నిలబెట్టిన అద్భుతమైన అసాధారణమైన నాయకు లుగా ఈ ఏజెన్సీ ప్రాంతంలోని ప్రజలకు చేరువయ్యారు. 2003 సంవత్సరములో సర్పంచ్ గాఉనప్పుడు. 18 వ,విడత జన్మభూమికార్యక్రములో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,ని వి.ఆర్.పురం,మండల పోచవరం గ్రామానికివచ్చేలాచేసి పలుఅభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి మంజూరుచేయించి నిజాయితీగల నేతగా మకుటంలేని మహానేతగా గుర్తింపు పొందారు. ఈఅభివృద్ధి కార్యక్రమాల్లో వల్ల రంగారెడ్డి,కీలక పాత్ర పొందించారు.ఈప్రాంతంలో చేస్తున్నకృషికి,తెలుగుదేశం పార్టీలో వల్ల రంగారెడ్డి,కీలకంగా మారారు.



వల్ల రంగారెడ్డి అనేక ప్రభుత్వ కార్యక్రమాలపై అవగాహన కలిగి ఉన్నారు!..అనేక ప్రభుత్వ పథకాలగురించి లోతైన అవగాహన పెంచుకున్నాడు.వల్ల రంగారెడ్డి, ఈప్రాంతంలో రెండవశ్రేణి నాయకత్వాన్ని నిర్మించాడు. మాస్ లో విపరీతమైన క్రేజ్ ఏర్పడింది. స్వతంత్రంగా అందరికీ కలుపుకునే రాజకీయ సమీకరణాలు,నిర్వహించడానికిసామర్థ్యాలను పెంపొందించడానికి తగినంత శ్రద్ధచూపాడు.అద్భుతమైన నిర్ణయాలతో అధిష్టానానికి ఆప్తుడిగామారి గుర్తింపు సాధించాడు. పార్టీ కొంతమంది సీనియర్ నాయకులతో కలిచి వరరామచంద్రాపురం, మండల కేంద్రంలో స్థిరమైన కార్యకర్తలను అభిమానులను ఏర్పాటుచేసి ధీటైన నాయకులుగా రూపాంతరంచెందారు.కుటుంబ అభివృద్ధిమహిళలపాత్ర అనుసరించిఇక్కడ రాజకీయాలలో మహిళలకు ప్రాధాన్యత ఇస్తూ,వారి సమస్యలు అర్థంచేసుకుని సమస్యలు త్వరితగతిన పరిష్కరించబడటానికి శ్రీకారం చుట్టారు.2006 సంవత్సరములో శ్రీమతి వల్ల చంద్రావతిని,తుమ్మిలేరు పంచాయతీనుండి తెలుగుదేశం పార్టీతరపున సర్పంచ్ అభ్యర్థిగా పోటీచేయించి,విజయం సాధించారు.ప్రతిపక్ష పార్టీలకు ధీటైనసమాధానం ఇచ్చారు.పెద్దలతోసఖ్యతగా ఉంటూ కార్యకర్తలకుఅండగా నిలిచారు.

2013 సంవత్సరములో!..

2013వ సంత్సరంలో కోటేశ్వర రెడ్డిని,తుమ్మలేరు పంచాయతీ నుండి తెలుగుదేశంపార్టీ తరపున సర్పంచ్ గా పోటీచేయించి,విజయతీరాలను చేర్చారు.రికార్డ్ మెజారిటీతో గెలిపించి,తనదైనముద్ర వేశారు.

2015 సంవత్సరములో!.. 2915 సంత్సరంలోవెంకటేశ్వర రెడ్డిని ,జీడిగుప్ప సెగ్మెంట్ నుండి తెలుగుదేశంపార్టీ తరపున, ఎం.పి.టి.సి, సభ్యుడిగా పోటీచేయించి ఘన విజయంసాధించి నూతన అధ్యాయానికి శ్రీకారం చుట్టారు.రాజకీయాల్లో అద్భుతమైన సమీకరణాలు వేగంగాచేయడంలో వల్ల రంగారెడ్డికి,మంచి పాలోవర్స్ ఉన్నారని మరోసారి నిరూపించారు.

2019 సంత్సరంలో!..

2019 సంవత్సరములో అందెల సీతారామరాజురెడ్డి, ని తుమ్మిలేరు, పంచాయతీనుండి తెలుగుదేశం పార్టీతరపున సర్పంచ్ గా పోటీచేయించి హ్యాట్రిక్ విజయాన్ని నమోదు చేశారు.అందరిచూపు వల్ల రంగారెడ్డి,వైపుమళ్లింది.ఏది ఏమైనా తెలుగుదేశంపార్టీ కార్యకర్తగా నరాల్లోఅణువణువునా తెలుగుదేశంపార్టీతో నిండిపోయింది.

2021 సంత్సరంలో!..

2021 సంవత్సరములో వెంకటేశ్వరరెడ్డిని జీడిగుప్ప, సెగ్మెంట్ నుండి తెలుగుదేశం పార్టీతరపున, ఎం.పి.టి.సి, సభ్యుడిగా రెండవసారి పోటీచేయించి, విజయతీరాలకు చేర్చడంలో వల్ల రంగారెడ్డి,కీలకంగా వ్యవహారించారు.ఊహాకందని విజయాన్ని సాధించింది శభాష్ అనిపించుకున్నారు.

2021 సంత్సరంలో!..

2021వ సంవత్సరములో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఉన్నప్పుడు వి.ఆర్.పురం,మండలంలో తెలుగుదేశం పార్టీ మండలకమిటీఆధ్వర్యంలో వళ్ల రంగారెడ్డిని, జడ్పీ.టి.సి, అభ్యర్థిగా నిర్ణయించి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోనే ఏకైక జడ్పీ.టి.సి.గా,విజయం సాధించి అంచనాలను తారుమారు చేసి రికార్డ్ విజయం నమోదు చేశారు.జిల్లా పరిషత్ సమావేశాల్లో, ప్రశ్నలవర్షం కురిపించారు.జంకు,భయం లేకుండా ప్రజల తరపున గొంతెత్తి మాట్లాడిననేతగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రజలమన్ననలు పొందారు.అతి సామాన్యులకు దగ్గరగా, ప్రజల కోసం నిలబడేనేతగా మన రంగారెడ్డి,అని పిలుచుకునే ఆదరణ ఆయనకే సాధ్యం.

2000 సంత్సరం నుండి!..

2000 సంవత్సరమునుండి 2023 సంవత్సరము వరకు, సుమారు26ఏళ్లుగా,ఎన్నిక ఏదైనా,ఎటువంటి ఓటమిఅంటే తెలియకుండా తుమ్మిలేరు.పంచాయతీ నుండి తెలుగుదేశం పార్టీని విజయ తీరాలకుచేర్చుతున్నారు. వరరామచంద్రాపురం, మండలంలో తెలుగుదేశంపార్టీకి ఓటమిఅంటే తెలియకుండా కృషిచేస్తున్నారు.ప్రస్తుతం కొత్తపోలవరం జిల్లాలో ఏరకంగా సూచినా,వల్ల రంగారెడ్డి,ట్రక్ రికార్డ్ అద్భుతమనే, చెప్పాలి. ఈ జిల్లాలో కులమ తాలకు అతీతంగా, మంచి సౌమ్యుడిగా ,సామాన్యులకు, చేరువ గా మంచి పేరుప్రతిష్టలు ఉన్నాయి. ఒకరకంగా చూస్తే పోల వరం జిల్లాలో ఆదివాసీ గిరిజనతెగలు భారీగానే ఉన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో అన్నీటికీ (అర్హులైన) అనుకూలమైన వ్యక్తీగా ఓటమిఎ రుగని నేతగా సౌమ్యుడిగా ఆదర్శవంతుడిగా అణువవునాతెలుగుదేశంపార్టీని జీర్ణించుకోని, ఉన్ననేతగా వల్ల రంగారెడ్డి,జిల్లాలోనే నెంబర్1 స్థానంలో ఉన్నారనే భావం ఉంది.ప్రస్తుత పరిస్థితుల్లో అందరివాడు ,బడుగు బలహీన వర్గాలకుచెందినవారు,ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,రాష్ట్ర మంత్రి నారా లోకేష్,ఆశీస్సులతో, ముందుకు వెళ్లాలని,ఏజెన్సీ ప్రజలమనోభావాలను మీతో నిశ్చయముగా పంచుకున్నాం.(అవకాశం ఉంటే మళ్లీ)

# నిధుల విడుదల నిల్

**హైదరాబాద్ :** 'ప్రజల పనియే పాలకుని పని. ప్రజల సుఖమే పాలకుని సుఖం. ప్రజల ప్రియమే పాలకుని ప్రియం. ప్రజల హితమే పాలకుని హితం'.. ఇవీ మహాభారతం అనుశాసనిక పర్వంలో చెప్పిన రాజనీతి హితవచనాలు. తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ వీటిని ఆచరణలో తూచా తప్పకుండా అమలు చేశారు. సంక్షేమ పథకాల అమల్లో తెలంగాణను దేశానికే ఆదర్శంగా నిలిపారు. పేద, బడుగు బలహీనవర్గాల అభ్యున్నతికి ఆసరా పెన్షన్లు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, రైతుబీమా, రైతుబంధు తదితర వినూత్న, విప్లవాత్మక పథకాలకు శ్రీకారం చుట్టి సంక్షేమానికి కొత్త నిర్వచనం చెప్పారు.దేశానికి కొత్తదారిని చూపారు. కానీ.. ఇప్పుడు కాంగ్రెస్ వెయ్యి రోజుల్లోనే పరిస్థితి తారుమారయ్యింది. ఎన్నికల సందర్భంగా ఆరు గ్యారెంటీలు, 420 హామీలు, చేవెళ్ల, కామారెడ్డి, మైనారిటీ తదితర డిక్లరేషన్ల పేరిట సర్కార్ అరచేతిలో వైకుంఠం చూపించింది. తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత మొండిచేయి చూపుతున్నది. రేవంత్ రెడ్డి ప్రభుత్వ పాలనలో సంక్షేమ శాఖలు సంక్షోభంలో కూరుకుపోయాయి. దేశానికి దిక్సూచిలా నిలిచిన కేసీఆర్ పథకాలు ఒక్కొక్కటిగా అటకెక్కుతున్నాయి. అమలు చేస్తున్న స్కీములకు అత్తెసరు నిధులను కేటాయించడమేగాక, అవీ విడుదల చేయని దుస్థితి నెలకొన్నది. చేవెళ్ల, కామారెడ్డి డిక్లరేషన్లు ఉత్తముచ్చటగా మిగిలాయి. మైనారిటీ డిక్లరేషన్ బోగస్‌గా మారింది. రుణాల మంజూరు, ఉపాధి, నైపుణ్య శిక్షణలకు నిధుల్లేక కార్పొరేషన్లు కునారిల్లిపోతున్నాయి. కొత్త పథకాల జాడ లేదు. ఉన్న పథకాలకు దిక్కులేదు. గురుకులాలు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నాయి. బంగారు భవిష్యత్తు ఉన్న విద్యార్థులు అర్ధంతరంగా ప్రాణాలు విడుస్తున్నారు. సంక్షేమ శాఖలకు కీలక అధికారులు లేకపోవడంతో పాలన గాడి తప్పింది. పథకాల అమలు గతితప్పింది. సంక్షేమ రంగం కాస్తా సం'క్షామ'రంగంగా మారిపోయింది.

### కార్పొరేషన్లన్నీ నిర్వీర్యం

కార్పొరేషన్ల ఏర్పాటుపై కాంగ్రెస్ హామీలు ఉత్తమాటలుగా మిగిలిపోయాయి. బీసీ కులాల సమగ్రాభివృద్ధికి కార్పొరేషన్లను ఏర్పాటు చేసి యువతకు రూ.10లక్షల వరకు పూచీకత్తు లేకుండా, వడ్డీలేని రుణాలను అందిస్తామంటూ పార్లమెంట్ ఎన్నికల ముందు హడావుడిగా పలు కార్పొరేషన్లను ఏర్పాటు చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. కానీ గడిచిన వెయ్యిరోజుల్లో కార్పొరేషన్లకు ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం గతంలో ఏర్పాటు చేసిన 8 బీసీ కులాలు రజక, నాయీబ్రాహ్మణ, వడ్డెర, సగర (ఉప్పర) వాల్మీకి బోయ, కృష్ణబలిజ, భట్రాజ్, కుమ్మరి ఫెడరేషన్లను సైతం కార్పొరేషన్లుగా మార్చాలని నిర్ణయించినా ఇప్పటికీ ఉత్తర్వులు రాలేదు. మాల, మాదిగలకు, ఎస్సీ ఉపకులాలకు ప్రత్యేక కార్పొరేషన్లను ఏర్పాటు చేస్తామని చెప్పినా ఆచరణకు నోచుకోలేదు. రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ 2025-26 సంవత్సరానికి సంబంధించి రూ.863 కోట్లతో ఎస్సీ యాక్షన్ ప్లాన్‌ను సిద్ధం చేయడంతోపాటు, 80వేల మంది నుంచి దరఖాస్తులను స్వీకరించినా ఇప్పటికీ అమలుకు నోచుకోలేదు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ట్రైకార్ ద్వారా గిరిజనులకు సబ్సిడీ రుణాలను మంజూరు చేసింది. 30 వేల మందిని లబ్ధిదారులుగా గుర్తించి రూ.265 కోట్లను సబ్సిడీ రుణాలుగా అందివ్వాలని నిర్ణయించింది. బీఆర్‌ఎస్ హయాంలోనే 45.81కోట్లు విడుదల చేసింది. మిగతా రూ.219.19 కోట్లను ఇప్పటికీ ఇవ్వడం లేదు.

రాజీవ్ యువవికాసం స్కీమ్ కింద దరఖాస్తులు తీసుకుని ఏడాదిన్నర గడిచినా అతీగతీ లేకుండా పోయింది. దాదాపు 16.27లక్షల మంది యువత ఎదురు చూస్తున్నారు.

రాష్ట్ర ఏర్పాటు నాటికి తెలంగాణ సమాజం చిన్నాభిన్నమై, దుర్భరమైన పరిస్థితులను ఎదుర్కొంటున్నది. ముఖ్యంగా సంక్షేమ రంగం కునారిల్లింది. ఈ నేపథ్యంలో బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ తొలి ప్రాధాన్యతగా సంక్షేమ కార్యక్రమాలను ఎంచుకున్నారు.

## రూ.4 వేల పెన్షన్ ఎప్పుడు ఇస్తావ్..

## వృద్ధుడి ప్రశ్నకు కాంగ్రెస్ ఎమ్మెల్యే రియాక్షన్ ఇదే.



420 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ అమలు చేయడంలో పూర్తిగా విఫలమైన విషయం తెలిసిందే. కాంగ్రెస్ సర్కార్ 1000 రోజుల విఫలపాలనపై ఇప్పటికే బీఆర్‌ఎస్ రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడుతోంది. కాగా కాంగ్రెస్ హామీల పరిస్థితి ఎలా ఉందో తెలియజేసే వీడియో ఇది. రూ.4 వేల పెన్షన్ ఎప్పుడు ఇస్తావ్ అంటూ వృద్ధుడు కాంగ్రెస్ ఎమ్మెల్యేను నిలదీశాడు. అశ్వారావుపేట నియోజకవర్గం చంద్రుగొండ మండలం తిప్పనపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ 1000 రోజుల సంబరాల కార్యక్రమం నిర్వహించింది. అయితే ఈ కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మాట్లాడుతున్న సమయంలో సదరు వృద్ధుడు పెన్షన్ ఎప్పుడిస్తారు అని అడిగారు. దీనికి ఎమ్మెల్యే స్పందిస్తూ.. ముందుగా మనం ముందుగా చేసినటువంటి కార్యక్రమాల గురించి చెప్పేందుకు ఈ ప్రోగ్రాంను ఏర్పాటు చేశామంటూ.. పెద్దాయన అడిగిన ప్రశ్నకు జవాబివ్వకుండా దాటవేశాడు. దీనికి సంబంధించిన వీడియో ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది.

## స్కూల్ క్రికెట్ టోర్నమెంట్‌కు

## బీకేసీఏ క్రీడాకారుల ఎంపిక



**కొత్తగూడెం :** భద్రాద్రి కొత్తగూడెం క్రికెట్ అకాడమీకి చెందిన ముగ్గురు ప్రతిభావంతులైన క్రీడాకారులు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అండర్-16 స్కూల్ క్రికెట్ టోర్నమెంట్‌కు ఎంపికై జిల్లా స్థాయిలో సత్తా చాటారు. కే. మేఘ శర్వాన్ పి. జై గణేష్ రెడ్డి ఎ. సాయి సాకేత్‌లు తమ ప్రతిభను ప్రదర్శించి ఉమ్మడి ఖమ్మం జిల్లా జట్టుకు ఎంపికయ్యారు. సోమవారం నుండి ప్రారంభం కానున్న టోర్నమెంట్‌లో వీరు ఉమ్మడి ఖమ్మం జిల్లా మొదటి జట్టు తరఫున బరిలోకి దిగనున్నారు. జిల్లా స్థాయి నుంచి అత్యున్నత స్థాయిలో తమ ప్రతిభను నిరూపించుకునే అవకాశం లభించడం పట్ల దీఖజూ కోచ్‌లు, క్రీడాకారులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. దీఖజూ కోచ్ పంతంగి సాయి నిరంజన్ మాట్లాడుతూ.. క్రమశిక్షణ, నిరంతర సాధన, కష్టపడే తత్వంతో క్రీడాకారులు ఈ స్థాయికి చేరుకున్నారని, భవిష్యత్తులో జాతీయ స్థాయిలో కూడా రాణించాలని ఆకాంక్షించారు.

## తలాపునే గోదావరి, తాలిపేరు..

## బీడు భూమిగా ఏజెన్సీ కోనసీమ

### వర్షాల కోసం రైతన్నల ఎదురు చూపులు



**దుమ్ముగూడెం :** ఏజెన్సీ కోనసీమగా పేరున్న దుమ్ముగూడెం మండలంలో ఈ ఏడాది వరిపంట సాగు చేయడం రైతులకు కష్టంగా మారింది. మండలంలో పంటలు వేసినప్పటికీ వర్షాలు లేకపోవడంతో సాగునీరు కరువై పంటలు బీడుగా మారుతున్నాయి. మండలంలోని పైడాకుల మడుగులో చిన గుబ్బలమంగి ప్రాజెక్టు ఆయకట్టు కింద 2,550 ఎకరాల వరి సాగు ప్రతి ఏటా చేస్తుంటారు. వర్షాకాలంలో మూడుసార్లు నిండితే పంటలు పండుతాయి. కానీ ఈసారి ఎగువన చత్తీస్‌గఢ్ లో వర్షాలు లేకపోవడంతో నీరు రాలేదు. ఈ ఏడాది రైతులు నార్లు పోసి ఎదురు చూస్తున్నారు. అలాగే చిన నల్లబెల్లి చెరువు ఆయకట్టు 410 ఎకరాలు సాగులో ఉంది. కాగా ఈ ఏడాది వర్షాలు లేకపోవడంతో రైతులు నార్లు పోసి ఎదురు చూస్తున్నారు. ముందుగా కొంత వర్షం పడటంతో నాట్లు వేశారు. గుబ్బలమంగి ప్రాజెక్టు కింద 2,500 ఎకరాలు ఉండగా 500 ఎకరాలు మాత్రమే వరి సాగు చేశారు. నల్లబెల్లి చెరువు కింద 25 ఎకరాలు సాగు చేశారు. మిగతా భూమంతా బీడు భూములుగా మారాయి. తలాపునే తాలిపేరు కెనాల్ ఉంది. తూరుబాక వరకు తాలిపేరు కెనాల్ ద్వారా సాగునీరు వెళ్తుంది. కాని ఆ ప్రాంతంలో చెరువులు నింపడానికి ఉపయోగం లేదని రైతులు అంటున్నారు. గోదావరి పక్కన ఉన్నప్పటికీ తాలిపేరు గోదావరి నదులు ఉన్నప్పటికీ మాకు ఉపయోగం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ సమయంలో చిన్నగుబ్బలమంగి ప్రాజెక్టును ఆర్‌ఆర్‌ఆర్ పథకంలో పెట్టి అభివృద్ధి చేశారు. అనంతరం దీని నిర్వహణ మరిచిపోవడంతో ఇప్పుడు నీరు లేక వెలవెలబోతుంది.

## సూపర్‌బజార్‌ను ప్రైవేటుపరం చేయొద్దు..

**బెల్లంపల్లి :** సింగరేణి కార్మికులు,ఉద్యోగుల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన సూపర్‌బజార్‌ను బడా వ్యాపారస్తులకు అప్పగించొద్దని విప్లవ కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సూపర్‌బజార్‌ను సింగరేణి యాజమాన్యమే నిర్వహించాలని కోరారు.నిర్వహణలో లోపాలు ఉంటే సరిదిద్దాలని,ప్రైవేటుపరం చేసే నిర్ణయాన్ని విరమించుకోవాలని అన్నారు.లేదంటే పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో టి.మని రామ్ సింగ్,టీఎన్‌టీయూసీ (ఎస్‌సీఎల్‌యూ)రాష్ట్ర ప్రధాన కార్యదర్శి,అంబాల మహేందర్(ఎస్‌జీకేఎస్)సింగరేణి గని కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు,ఎం.పోచమల్లు ఏఐఎఫ్‌టీయూ శ్రామిక శక్తి గోదావరి లోయ బొగ్గుగని కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి,గజ్జె దుర్గయ్య బెల్లంపల్లి పట్టణ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు, మధునయ్య,రాజు ఏఐఎఫ్‌టీయూ రీజియన్ నాయకులు పాల్గొన్నారు

## బిజినెస్

### భారీగా బ్యాంకు ఉద్యోగాలు..




దేశంలో అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఉద్యోగార్థులకు తీపి కబురు ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2026--27లో సుమారు 11,000 నుంచి 12,000 మంది ఉద్యోగులను నియమించుకోవాలని బ్యాంకు లక్ష్యంగా పెట్టుకుంది. ఈ విషయాన్ని ఎస్బీఐ చైర్మన్ సీఎస్ శెట్టి తెలిపారు. క్లరికల్, ఆఫీసర్ కేడర్లలోనే ప్రధానంగా నియామకాలు చేపట్టనున్నట్లు ఆయన వెల్లడించారు. నియామకాల సంఖ్యలో కొంత మార్పు ఉండొచ్చని శెట్టి పేర్కొన్నారు. ఉద్యోగుల పదవీ విరమణలు, బ్యాంకు అవసరాలను బట్టి తుది సంఖ్య నిర్ణయిస్తామని, అయితే ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి దాదాపు 12 వేల నియామకాలు ఉండొచ్చని చెప్పారు. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఈసారి నియామకాలు తగ్గడానికి ప్రధాన కారణం ఐటీ విభాగంలో గతేడాది మాదిరిగా పెద్ద సంఖ్యలో నిపుణులు అవసరం లేకపోవడమేనని ఆయన తెలిపారు.

**గతేడాది 25,633 మందికి ఉద్యోగాలు**

2025--26 ఆర్థిక సంవత్సరంలో ఎస్బీఐ మొత్తం 25,633 మందిని నియమించుకుంది. ఇందులో 4,640 మంది అధికారులు, 19,340 మంది అసోసియేట్లు, 1,653 మంది కాంట్రాక్ట్ సిబ్బంది ఉన్నారు. ముఖ్యంగా సుమారు 1,500 మంది స్పెషలిస్ట్ ఐటీ అధికారులను గతేడాది నియమించినట్లు శెట్టి చెప్పారు. మార్చి 2026 నాటికి ఎస్బీఐ మొత్తం ఉద్యోగుల సంఖ్య 2.45 లక్షలకు పైగా ఉంది.

**మరో 250 శాఖలు రావొచ్చు**

ఉద్యోగ నియామకాలతో పాటు బ్యాంకు శాఖల నెట్‌వర్క్‌ను కూడా విస్తరించేందుకు ఎస్బీఐ సిద్ధమవుతోంది. కొత్త కాలనీలు ఏర్పడుతున్న ప్రాంతాలు, వాణిజ్య కార్యకలాపాలు ఎక్కువగా ఉన్న జిల్లాల్లో ఇంకా బ్యాంకింగ్ సేవలకు అవకాశం ఉందని శెట్టి తెలిపారు. కొన్ని శాఖలను హేతుబద్ధీకరించినప్పటికీ, నెట్‌గా ఏటా 200 నుంచి 250 శాఖలు పెరిగే అవకాశం ఉందని వెల్లడించారు.

# 11 కంపెనీలు.. 7,055 కోట్లు..

## ఈ వారం ఐపీఓలు ఇవే




ప్రైమరీ మార్కెట్‌లో ఈ వారమూ పబ్లిక్ ఇష్యూల సందడి కొనసాగనుంది. 11 కంపెనీలు మొత్తం రూ.7,055 కోట్ల నిధుల సమీకరించనున్నాయి. సెప్టెంబర్ 7-15 మధ్య దలాల్ స్ట్రీట్‌లో ఈ ఐపీఓలు సందడి చేయనున్నాయి. ఇందులో రెంటోమోజో, కరమ్‌తర ఇంజినీరింగ్, కనోహర్ ఎలక్ట్రికల్స్ వంటి కంపెనీలు ఉన్నాయి. తాజా షేర్లు, ఆఫర్ ఫర్ సేల్ రూపంలో షేర్లను విక్రయించనున్నాయి. ఐపీఓ నిధులను వ్యాపార విస్తరణకు, రుణాల చెల్లింపులకు, ఇతర కార్పొరేట్ అవసరాలకు పలు కంపెనీలు వినియోగించనున్నాయి. ఇక ఆ వివరాలను పరిశీలిస్తే..

**ఎస్‌బీఐలో కొత్తగా 12 వేల నియామకాలు!**

ప్రణవ్ కన్‌స్ట్రక్షన్స్ సెప్టెంబర్ 7న పబ్లిక్ ఇష్యూకు రానుంది. రూ. 351 కోట్ల నిధులను సమీకరించనుంది. సెప్టెంబర్ 9న ఐపీఓ సబ్‌స్క్రిప్షన్ ముగుస్తుంది. ఒక్కో షేరు ధర 118-124గా కంపెనీ నిర్ణయించింది.

కనోహర్ ఎలక్ట్రికల్స్ సెప్టెంబర్ 8న ఐపీఓకు వస్తోంది. రూ.1,056 కోట్ల నిధులను సమీకరించనుంది. ధరల శ్రేణి 601-632.

ప్రసోల్ కెమికల్స్ కూడా సెప్టెంబర్ 8న ఐపీఓకు రానుంది. ధరల శ్రేణి రూ.643-676గా కంపెనీ నిర్ణయించింది. రూ.500కోట్ల నిధులను సమీకరించనుంది. రూ.80 కోట్ల తాజా షేర్లు, రూ. 420 కోట్ల ఆఫర్ ఫర్ సేల్ రూపంలో షేర్లు విక్రయించనున్నారు.

గ్లాస్ వాల్ సిస్టమ్స్ (ఇండియా) ఐపీఓ సెప్టెంబర్ 8న రూ.428 కోట్ల నిధుల సమీకరణకు ఐపీఓకు వస్తోంది. ఒక్కో షేరు ధర రూ.172-182గా కంపెనీ నిర్ణయించింది.

రెంటోమోజో సెప్టెంబర్ 9న ఐపీఓకు వస్తోంది. ఒక్కో షేరు ధర రూ.384-404 కంపెనీ నిర్ణయించింది. రూ.1,256 కోట్ల నిధులను సమీకరించనుంది. రూ.150 కోట్ల తాజా షేర్లు, రూ.1,106 కోట్ల ఆఫర్ ఫర్ సేల్ రూపంలో ఉండనున్నాయి.

కరమ్‌తర ఇంజినీరింగ్ రూ.875 కోట్ల నిధుల సమీకరణ లక్ష్యంగా సెప్టెంబర్ 9న పబ్లిక్ ఇష్యూకు వస్తోంది. రూ.675 కోట్ల తాజా షేర్లు, రూ.200 కోట్ల ఆఫర్ ఫర్ సేల్ రూపంలో షేర్లు ఉండనున్నాయి. ధరల శ్రేణి రూ.241-254 కంపెనీ నిర్ణయించింది.

మణిపాల్ పేమెంట్ అండ్ ఐడెంటిటీ సొల్యూషన్స్ కూడా సెప్టెంబర్ 9న ఐపీఓకు వస్తోంది. రూ.805 కోట్ల నిధులను సమీకరించనుంది. ధరల శ్రేణి రూ.322-339గా నిర్ణయించింది. ఇందులో రూ.320 కోట్ల తాజా షేర్లు, రూ.485 కోట్ల ఆఫర్ ఫర్ సేల్ రూపంలో షేర్లు విక్రయిస్తున్నారు.

ఆర్సిల్ కంపెనీ రూ.733 కోట్ల నిధుల సమీకరణ లక్ష్యంతో సెప్టెంబర్ 9న పబ్లిక్ ఇష్యూకు వస్తోంది. ఒక్కో షేర్ ధర రూ.132-139గా నిర్ణయించింది. పూర్తిగా ఆఫర్ ఫర్ సేల్ రూపంలో షేర్లు విక్రయిస్తున్నారు.

ఎల్‌సీసీ ప్రాజెక్ట్స్ ఐపీఓ సెప్టెంబర్ 9న ప్రారంభం కానుంది. రూ.427 కోట్ల నిధులను సమీకరించనుంది. ధరల శ్రేణి రూ.139-146గా కంపెనీ నిర్ణయించింది.

స్టీమ్‌హౌస్ ఇండియా రూ.414 కోట్ల నిధుల సమీకరణ లక్ష్యంతో సెప్టెంబర్ 9న ఐపీఓకు వస్తోంది. తాజా షేర్లు, ఆఫర్ ఫర్ సేల్ రూపంలో షేర్లు విక్రయిస్తున్నారు. ధరల శ్రేణి ఇంకా వెల్లడించలేదు.

వీగాలాండ్ డెవలపర్స్ కంపెనీ పబ్లిక్ ఇష్యూ సెప్టెంబర్ 10న ప్రారంభం కానుంది. సెప్టెంబర్ 15న సబ్‌స్క్రిప్షన్ ముగుస్తుంది. రూ.210 కోట్ల నిధులను ఐపీఓ నుంచి సమీకరించనుంది. ధరల శ్రేణి వెల్లడించాల్సి ఉంది.

# బ్యాంక్ అకౌంట్ లేకున్నా క్రెడిట్ కార్డు తీసుకోవచ్చా ? ఎవరికి జారీ చేస్తారు?

సార్/ మేడం మేం పలానా బ్యాంక్ నుంచి కాల్ చేస్తున్నాం. మీకు క్రెడిట్ కార్డ్ ఏమైనా కావాలా అని వారి రిప్రజెంటేటివ్స్ అడుగుతుంటారు. అయితే క్రెడిట్ కార్డు తీసుకోవడానికి బ్యాంకులో అకౌంట్ ఉండటం అవసరమా? అంటే తప్పనిసరిగా అదే బ్యాంకులో అకౌంట్ ఉన్న వ్యక్తికే క్రెడిట్ కార్డు ఇవ్వాలనే రూల్ ఉండదు. పలు బ్యాంకులు తమ వద్ద బ్యాంక్ అకౌంట్ లేని వారికి కూడా క్రెడిట్ కార్డులు జారీ చేస్తుంటాయి. నిపుణుల ప్రకారం, బ్యాంకులు ముందుగా దరఖాస్తుదారుడి ఆదాయం ఎంత, వారు ఏ పని చేస్తారు, క్రెడిట్ స్కోర్ ఎలా ఉంది. సమయానికి బిల్ పేమెంట్ చేయగలరా లేదా అనే విషయాన్ని పరిశీలిస్తారు. ఈ విషయాల్లో క్లారిటీ వస్తే చాలు బ్యాంక్ అకౌంట్ లేకుండానే కూడా ఆ వ్యక్తికి క్రెడిట్ కార్డు జారీ చేస్తారు.

**ఎఫ్‌డీని చూసి క్రెడిట్ కార్డు జారీ**

కొన్నిసార్లు ఒక వ్యక్తికి బ్యాంక్ అకౌంట్ కూడా ఉండదు. దాంతో వారికి క్రెడిట్ హిస్టరీ కూడా ఉండదు. అలాంటి సందర్భాల్లో కొన్ని బ్యాంకులు ఎఫ్‌డీ(ఫిక్స్‌డ్ డిపాజిట్)కి బదులుగా కూడా క్రెడిట్ కార్డు జారీ చేస్తాయి. దీని ద్వారా ప్రజలకు మంచి క్రెడిట్ హిస్టరీ క్రియేట్ చేసుకునే అవకాశం లభిస్తుంది. అంటే వ్యక్తికి క్రెడిట్ కార్డు వస్తుంది. అక్కడి నుంచి ఆ వ్యక్తికి క్రెడిట్ హిస్టరీ ప్రారంభమవుతుంది.

**క్రెడిట్ కార్డు కోసం దరఖాస్తు ప్రక్రియ**

క్రెడిట్ కార్డు కోసం దరఖాస్తు చేసేటప్పుడు ఆధార్ కార్డు, పాన్ కార్డు, అడ్రస్ ప్రూఫ్, మీ ఆదాయానికి సంబంధించిన కొన్ని అవసరమైన డాక్యుమెంట్స్ సబ్మిట్ చేయాలి. అయితే ప్రతి బ్యాంక్‌కు వారికంటూ వేర్వేరు రూల్స్, కండీషన్స్ ఉంటాయని గుర్తుంచుకోండి. చాలాసార్లు ప్రీపెయిడ్ కార్డు, క్రెడిట్ కార్డుకు ప్రత్యామ్నాయం అని ప్రజల్లో అపోహ ఉంటుంది. కానీ అందులో నిజం కాదు. ప్రీపెయిడ్ కార్డులో మీరు మీ డబ్బును ముందుగానే లోడ్ చేసి ఖర్చు చేస్తారు.

**క్రెడిట్ కార్డు, ప్రీపెయిడ్ కార్డుకు మధ్య వ్యత్యాసం ఏమిటి?**

క్రెడిట్ కార్డు, ప్రీపెయిడ్ కార్డు 2 వేర్వేరు రకాల కార్డులు అని గ్రహించాలి. బిల్లులు సకాలంలో చెల్లిస్తూ క్రెడిట్ కార్డును సరిగ్గా ఉపయోగిస్తే మీ క్రెడిట్ స్కోర్ మెరుగుపడవచ్చు. అయితే ప్రీపెయిడ్ కార్డు వినియోగం క్రెడిట్ స్కోర్‌పై ఎలాంటి ప్రభావం చూపదు. ప్రీపెయిడ్ కార్డు




అంటే ముందుగానే మనీ జమ చేసే కార్డు. వినియోగదారు కార్డులో ఉన్న మొత్తాన్ని తమ అవసరాలకు తగ్గట్లుగా ఖర్చు చేయవచ్చు. క్రెడిట్ కార్డును మీ వద్ద నగదు లేకపోయినా అందులో ఉన్న లిమిట్ వరకు షాపింగ్ చేయవచ్చు. బిల్లులు పే చేసే వీలుంటుంది. అందువల్ల ప్రీపెయిడ్ కార్డును క్రెడిట్ కార్డుగా భావించవద్దు.

**క్రెడిట్ కార్డుతో జాగ్రత్త**

క్రెడిట్ కార్డును బాగా ఆలోచించి, జాగ్రత్తగా అవసరం ఉన్నప్పుడు మాత్రమే ఉపయోగించాలి. ఎంత ఖర్చు చేస్తారో, దాని బిల్ సైకిల్ సమయానికి తిరిగి చెల్లించాలి. సరిగ్గా ఉపయోగిస్తే క్రెడిట్ కార్డు అవసరమైన సమయంలో మిమ్మల్ని ఆదుకుంటుంది. క్రెడిట్ కార్డు తీసుకునే ముందు దాని వడ్డీ రేటు, వార్షిక ఫీజు, లేట్ ఫీజుతో పాటు ఇతర అన్ని ఛార్జీల గురించి పూర్తిగా తెలుసుకోవాలని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు.

# ఆ ఒక్క విజయం..
# పాక్ క్రికెట్ పతనం ప్రారంభం!

పాకిస్థాన్ క్రికెట్ జట్టు ప్రస్తుతం ఎదుర్కొంటున్న సంక్షోభానికి ఆ జట్టు మాజీ కెప్టెన్ మహ్మద్ యూసుఫ్ ఒక విచిత్రమైన కారణాన్ని చూపాడు. దుబాయ్‌లో జరిగిన 2021 ఐసీసీ టీ20 ప్రపంచ కప్ (టి20 ఔజ 2021)లో భారత్‌పై పాకిస్థాన్ 10 వికెట్ల తేడాతో గెలిచిన తర్వాత తమ జట్టు పతనం మొదలైందని అభిప్రాయపడ్డాడు. ఆ విజయం తర్వాత కొంతమంది ఆటగాళ్లు తాము ఏదో గొప్ప విజయం సాధించామని విర్రవీగారని, కెప్టెన్సీ కోసం నెలకొన్న పోటీ డ్రెస్సింగ్ రూమ్‌లో విభేదాలను సృష్టించిందని పేర్కొన్నాడు. "2021లో భారత్‌పై మేం గెలిచాం. ఆ మ్యాచ్ మాకు చాలా నష్టం కలిగించింది. ఎందుకంటే ఆ విజయం తర్వాత, తాము ఏదో గొప్ప విజయాన్ని సాధించామని కొందరు ఆటగాళ్లు భావించడం మొదలుపెట్టారు. ఆ తర్వాత ఏం చేయాలో వారికి అర్థం కాలేదు. మంచి ప్రదర్శన చేస్తున్నప్పుడు వినయంగా ఉండాలి. అహంకారంతో ప్రవర్తిస్తూ అగౌరవంగా వ్యవహరిస్తే సమస్యలు వస్తాయి. పాకిస్థాన్ క్రికెట్‌లో అటువంటి సమస్యలు చాలానే తలెత్తాయి. జట్టులోని ప్రతి ఒక్కరూ కెప్టెన్ కావాలని ప్రయత్నించారు. దాని పర్యవసానాలు ఇప్పటికీ పాకిస్థాన్ క్రికెట్‌కు నష్టం కలిగిస్తున్నాయి. భారత్‌పై విజయం తర్వాత వన్డే, టీ20 ప్రపంచ కప్‌లు, ఆసియా కప్‌లు, ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీలో పాక్ చెత్త ప్రదర్శన చేసింది. జట్టు నుంచి మంచి ఫలితాలు రాబట్టడానికి పీసీబీ ఎన్నో ప్రయత్నాలు చేసింది. కెప్టెన్లు, కోచ్‌లు, సహాయక సిబ్బందిని మార్చింది. అయినా ఏ



ఆటగాడూ ముందుకు వచ్చి బాధ్యత తీసుకోలేదు" అని మహ్మద్ యూసుఫ్ పేర్కొన్నాడు. 2021 టీ20 ప్రపంచ కప్‌లో టీమ్‌ఇండియాతో జరిగిన మ్యాచ్‌లో 152 పరుగుల లక్ష్యాన్ని పాక్ ఒక్క వికెట్ నష్టపోకుండా ఛేదించింది. ఓపెనర్లు బాబర్ అజామ్ (68), మహ్మద్ రిజ్వాన్ (79) నాటౌట్‌గా నిలిచి జట్టుకు ఘన విజయం అందించిన విషయం తెలిసిందే. పొట్టి వరల్డ్ కప్ చరిత్రలో భారత్‌పై పాక్ గెలవడం అదే మొదటిసారి. ఇక, మహిళల క్రికెట్లో ఎన్నో ఏళ్లుగా పాకిస్థాన్‌పై తిరుగులేని ఆధిపత్యం చెలాయిస్తున్న భారత జట్టు.. ఆసియా కప్‌లోనూ పైచేయి సాధించింది. శనివారం గ్రూప్-ఎలో తన చివరి మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ సేన 7 వికెట్ల తేడాతో పాక్‌ను చిత్తు చేసింది.

### మా అక్కలు ప్లాన్ చేస్తే మేము ఆచరిస్తాం'

మహిళల ఆసియా కప్ 2026లో భారత మహిళా క్రికెటర్ శ్రీ చరణి తన ప్రదర్శనతో అదరగొడుతుంది. శనివారం పాకిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో 4 ఓవర్లు వేసిన శ్రీ చరణి కేవలం ఏడు పరుగులు మాత్రమే ఇచ్చి మూడు కీలక వికెట్లు తీసింది. మ్యాచ్‌లో చేసిన ప్రదర్శనకు గానూ శ్రీ చరణి 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కించుకుంది. అవార్డు తీసుకున్న అనంతరం శ్రీ చరణి మాట్లాడింది. 'నా ప్రదర్శన పట్ల సంతోషంగా ఉన్నా. మహిళల క్రికెట్ ఆడుతూ దేశానికి సేవ చేయడం గొప్ప విషయంగా భావిస్తున్నా. అయితే ప్రతీ మ్యాచ్‌కు జట్టులోని స్పిన్నర్లమంతా ఒక మీటింగ్ ఏర్పాటు చేసుకుంటాం. నాతో పాటు ప్రేమ రావత్, దీప్తి శర్మ, రాధా యాదవ్ కలిసి మ్యాచ్‌లో ఎలా బౌలింగ్ చేయాలనేది చర్చించుకుంటాం. దీప్తి, రాధా దీదీలు చెప్పే ప్రతి సలహాను మైదానంలో అమలు చేయడానికి ప్రయత్నిస్తాం. 50 వికెట్ల మార్క్‌కు ఒక్క వికెట్ దూరంలోనే ఉన్నప్పటికీ, వాటిని నేను పట్టించుకోను. బౌలింగ్‌పైనే నా



దృష్టంతా పెట్టాలనుకుంటున్నా. ఇక నాతో పాటు బౌలింగ్‌లో వికెట్లు తీసిన ప్రేమ రావత్‌కు కూడా మంచి భవిష్యత్తు ఉంది. ఆమెది సహజమైన ప్రతిభ. ఫీల్డింగ్, బ్యాటింగ్, బౌలింగ్ అన్నీ సమానంగా ఉంటాయి. బౌలర్లకు సహకరించే వికెట్‌పై సుమారు 120 పరుగులు అనేది మంచి స్కోరు కింద లెక్క. ఇకపై కూడా నా ప్రదర్శనను ఇలాగే కొనసాగించాలనుకుంటున్నా' అని చెప్పుకొచ్చింది. మ్యాచ్ విషయానికొస్తే పాకిస్థాన్‌పై భారత మహిళల జట్టు 7 వికెట్ల తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన పాకిస్థాన్ 18.1 ఓవర్లలో 55 పరుగులకు ఆలౌటైంది.

## స్పోర్ట్స్

### పట్టువదలని విక్రమార్కులు..
### తొలిసారి చైనా మాస్టర్స్
### విజేతగా సాత్విక్ జోడీ..!




భారత డబుల్స్ ద్వయం సాత్విక్ సాయిరాజ్ -- చిరాగ్ శెట్టి ఖాతాలో మరో టైటిల్ చేరింది. చైనా మాస్టర్స్(ఐషు ఏ ప్రీమియర్ టోర్నీ)లో సంచలన విజయంతో ఫైనల్ చేరిన ఈ జోడీ.. ఆఖరి పోరులో చైనా జంటను చిత్తు చేసింది. ఆదివారం జరిగిన ఫైనల్లో హే జీ టింగ్ -- రెన్ గ్జియాంగ్‌పై అద్భుత విజయంతో విజేతగా నిలిచింది సాత్విక్ -- చిరాగ్ జంట. తొలి సెట్ కోల్పోయినా ఆత్మవిశ్వాసం కోల్పోకని భారత జోడీ వరుసగా రెండు సెట్లలో గెలుపొందింది. దాంతో.. చైనా షట్లర్లకు నిరాశే మిగిలింది. చైనా మాస్టర్స్‌లో సాత్విక్ సాయిరాజ్ -- చిరాగ్ శెట్టి ద్వయం ఛాంపియన్‌గా నిలిచింది. పురుషుల డబుల్స్‌లో అంచనాలు అందుకుంటూ ఫైనల్‌కు దూసుకెళ్లిన భారత జంట ధాటికి చైనా షట్లర్లు చేతులెత్తేశారు. తొలి సెట్‌ను 11-21తో కోల్పోయిన సాత్విక్ జోడీ ఒత్తిడికి లోనవ్వలేదు. రెండో సెట్‌లో గొప్పగా ఆడి హే జీ టింగ్ -- రెన్ గ్జియాంగ్‌కు 21-13తో షాకిచ్చింది. నిర్ణయాత్మక మూడో సెట్‌లోనూ భారత ద్వయం చెలరేగింది. ఫలితంగా 21-17తో సెట్‌ను గెలుపొందడంతో పాటు టైటిల్‌నూ సొంతం చేసుకుంది స్టార్ జోడీ. గతంలో రెండుసార్లు(2023, 2025) ఈ టోర్నీలో రన్నరప్‌గా నిలిచిన సాత్విక్ చిరాగ్ .. ఈసారి తమ కలను సాకారం చేసుకుంటూ విజేతగా నిలిచారు. మొత్తంగా ఈసీజన్‌లో వీరికి ఇది రెండో టైటిల్. ఈమధ్యే ఈ జంట సింగపూర్ ఓపెన్ సూపర్ 750 టైటిల్‌ను గెలిచింది.



# అందరిని సర్‌ప్రైజ్ చేస్తుంది

గత ఏడాది 'ఓజీ' చిత్రంతో తెలుగులో మంచి విజయాన్ని దక్కించుకుంది తమిళ సొగసరి ప్రియాంక మోహన్. తాజాగా ఈ భామ తమిళంలో మరో బంపరాఫర్‌ను సొంతం చేసుకుంది. శింబు 'అరసన్' చిత్రంలో ఆమె కథానాయికగా ఎంపికైంది. ఈ విషయాన్ని ఓ అవార్డు వేడుకలో వెల్లడించింది ప్రియాంక మోహన్. వెట్రిమారన్ ఈ చిత్రానికి దర్శకుడు. ఉత్తర చెన్నై నేపథ్యంలో గ్యాంగ్‌స్టర్ డ్రామాగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమాలో అవకాశం రావడం పట్ల ప్రియాంక మోహన్ ఆనందం వ్యక్తం చేసింది. 'వెట్రిమారన్ మేకింగ్‌స్టైల్ నాకు చాలా ఇష్టం. ఆయన ఎంచుకునే కథలు కూడా వాస్తవికతను ప్రతిబింబిస్తాయి. 'అరసన్'లో నా పాత్ర మునుపెన్నడూ చూడని రీతిలో ఉంటుంది. అందరిని సర్‌ప్రైజ్ చేస్తుంది. ఈ సినిమా కోసం నేను నార్త్ చెన్నై తాలూకు యాసను నేర్చుకున్నా' అని చెప్పింది ప్రియాంక మోహన్. 'అరసన్' చిత్రంలో విజయ్ సేతుపతి, ఆండ్రియా జెరేమియా, సముద్రఖని తదితరులు కీలక పాత్రల్ని పోషిస్తున్నారు.



# గన్స్‌కి గట్స్ ఉండాలి!

అగ్ర హీరో బాలకృష్ణ నటిస్తున్న 111వ చిత్రానికి 'దాదా' అనే పవర్‌ఫుల్ టైటిల్‌ను ఖరారు చేశారు. గోపీచంద్ మలినేని దర్శకత్వంలో వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీష్ కిలారు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. క్రిస్మస్ సందర్భంగా డిసెంబర్ 24న ప్రేక్షకుల ముందుకురానుంది. శనివారం టైటిల్ అనౌన్స్‌మెంట్ సందర్భంగా గ్లింప్స్‌ను విడుదల చేశారు. ఇందులో బాలకృష్ణ మాస్ అవతారంలో గ్యాంగ్‌స్టర్ వైబ్‌తో కనిపిస్తున్నారు. 'నాకు గురిపెట్టడానికి ఒంట్లో పొగరు, వేలికి ట్రిగ్గర్ ఉంటే సరిపోదు. బుల్లెట్స్‌కి బలుపు, గన్స్‌కి గట్స్ ఉండాలి' అంటూ బాలకృష్ణ చెప్పిన సంభాషణ ఆకట్టుకునేలా ఉంది. మంచు మనోజ్, కాజల్ అగర్వాల్ కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: తమన్, సంభాషణలు: సాయిమాధవ్ బుర్రా, రచన-దర్శకత్వం: గోపీచంద్ మలినేని.



## మన ప్యానెల్‌దే విజయం

తెలుగు చలనచిత్ర నిర్మాతల మండలి (2026) అధ్యక్షుడిగా ప్రముఖ నిర్మాత సి.కల్యాణ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన ఎన్నికల్లో మన ప్యానెల్, ప్రోగ్రెసివ్ ప్యానెల్ పోటీ పడ్డాయి. మన ప్యానెల్ నుంచి సి.కల్యాణ్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. కోశాధికారిగా చదలవాడ శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులుగా మోహన్ వడ్లపట్ల, దామోదర ప్రసాద్, జాయింట్ సెక్రటరీలుగా అమ్మిరాజు, తుమ్మలపల్లి రామసత్యనారాయణ ఎంపికయ్యారు.ప్రపంచ పటాలు పరిశీలించండి ఏషియన్ సునీల్, మోహన్‌గౌడ్, మైత్రీ రవి, నిరంజన్ రెడ్డి, డి.ఎస్.రావు, పద్మిని, శివలెంకకృష్ణ ప్రసాద్, దానయ్య, వంశీ నందిపాటి, పల్లి కేశవరావు, శ్రీనివాసరావు, పుల్లారావు, బాపిరాజు, ఆర్.కె.గౌడ్, నయీం కార్యవర్గ సభ్యులుగా గెలుపొందారు. ఈ ఎన్నిల్లో మన ప్యానెల్ నుంచి అత్యధిక మంది సభ్యులు విజయం సాధించారు. కార్యదర్శి పదవి అంశంపై కోర్టు కేసు నడుస్తున్నది. ఈ నేపథ్యంలో ఆ ఫలితాన్ని సీల్డ్ కవర్‌లో కోర్టుకు అప్పగించనున్నారు. ఈ నెల 8వ తేదీన కార్యదర్శి ఎన్నికల ఫలితాన్ని వెల్లడించనున్నారు.

## ఎన్టీఆర్ సినిమాలో అదిరిపోయే స్పెషల్ సాంగ్.. భారీ సెట్‌లో ఇద్దరు హీరోయిన్లతో మాస్ ట్రీట్!





యంగ్ టైగర్ ఎన్టీఆర్, దర్శకుడు ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న సినిమాపై అంచనాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. 'డ్రాగన్' లేదా 'బ్రూస్ లీ' అనే వర్కింగ్ టైటిల్స్‌తో ప్రచారంలో ఉన్న ఈ సినిమా ఇప్పటికే భారీ హైప్‌ను సొంతం చేసుకుంది. 'కేజీఎఫ్', 'సలార్' వంటి సినిమాలతో తనదైన యాక్షన్ బ్రాండ్‌ను క్రియేట్ చేసుకున్న ప్రశాంత్ నీల్.. ఎన్టీఆర్‌ను ఎలా చూపించబోతున్నారనే ఆసక్తి అభిమానుల్లో నెలకొంది.ఇక ఈ సినిమాకు సంబంధించి తాజాగా ఓ క్రేజీ అప్‌డేట్ ఇండస్ట్రీ వర్గాల్లో వైరల్ అవుతోంది. సినిమా కోసం ఓ భారీ స్పెషల్ సాంగ్‌ను చిత్రీకరించేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. ఈ పాట కోసం ప్రత్యేకంగా భారీ సెట్‌ను నిర్మిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రశాంత్ నీల్ సినిమాల్లో యాక్షన్ సన్నివేశాలతో పాటు భారీ విజువల్స్‌కు కూడా ప్రత్యేక స్థానం ఉంటుంది. అదే తరహాలో ఎన్టీఆర్ సినిమాకు కూడా ఆయన స్పెషల్ సాంగ్‌ను భారీ స్థాయిలో డిజైన్ చేస్తున్నట్లు టాక్.ఈ పాట కోసం ప్రత్యేకంగా భారీ సెట్‌ను సిద్ధం చేస్తున్నారని తెలుస్తోంది. పాటలో కనిపించే విజువల్స్ ప్రేక్షకులకు థియేటర్‌లో మాస్ ట్రీట్ ఇచ్చే విధంగా ఉండబోతున్నాయని సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.సినిమా కథ, యాక్షన్‌తో పాటు ఈ పాట కూడా హైలైట్‌గా నిలిచేలా ప్రశాంత్ నీల్ ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం.

# ఘనంగా 'మండాడి' ప్రీ రిలీజ్ ఈవెంట్..

## సినిమాపై హైప్ పెంచేసిన చిత్ర యూనిట్!




తమిళ వర్సటైల్ నటుడు సూరి, టాలీవుడ్ ట్రెండ్ సెట్టింగ్ యంగ్ హీరో సుహాస్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న అత్యంత ప్రతిష్టాత్మక మరియు విభిన్నమైన ఇంటెన్స్ యాక్షన్ డ్రామా 'మండాడి'. ప్రముఖ నిర్మాత ఎల్రెడ్ కుమార్ సమర్పణలో ఆర్‌ఎస్ ఇన్ఫోటైన్‌మెంట్ పతాకంపై టాలెంటెడ్ డైరెక్టర్ మతిమారన్ పుగళేంది ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. బోట్ రేసింగ్ ప్రధానాంశంగా, ఎవ్వరూ చూడని సరికొత్త సముద్రపు నేపథ్యంలో అత్యంత రిస్క్‌తో కూడిన ఛాలెంజింగ్ పరిస్థితులలో ఈ సినిమాను రూపొందించారు. ఇందులో టాలెంటెడ్ నటి మహిమా నంబియార్ కథానాయికగా నటిస్తుండగా.. సత్యరాజ్, రవీంద్ర విజయ్, మిథున్, బాల శరవణన్ వంటి ప్రముఖులు కీలక పాత్రల్లో ప్రేక్షకులను అలరించనున్నారు. సెప్టెంబర్ 10న ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా థియేటర్లలో విడుదలకు సిద్ధమవుతున్న తరుణంలో, చిత్ర యూనిట్ హైదరాబాద్‌లో అత్యంత ఘనంగా ప్రీ రిలీజ్ వేడుకను నిర్వహించింది. ఈ చారిత్రాత్మక కార్యక్రమానికి టాలీవుడ్ ప్రముఖ దర్శకుడు శివ నిర్వాణ ముఖ్య అతిథిగా విచ్చేసి సినిమా పోస్టర్లు, ప్రమోషనల్ కంటెంట్‌పై ప్రశంసలు కురిపిస్తూ యూనిట్‌కు శుభాకాంక్షలు తెలిపారు.నగర పర్యటనలను అన్వేషించండి ఈ వేడుకలో హీరో సుహాస్ మాట్లాడుతూ.. తన సినీ ప్రయాణంలో ఎన్నో ఒడిదుడుకులను దాటుకుంటూ ఈ స్థాయికి చేరుకున్నానని భావోద్వేగంగా పంచుకున్నారు. ఈ రోజు గురువారపు పండుగ రోజున తన ఉపాధ్యాయులు తన ముందే ఉండటం చాలా ఆనందంగా ఉందని తెలిపారు. ఈ చిత్రంలో మహిమ, రవీంద్ర విజయ్, సూరిల అభినయం సినిమాకు ప్రధాన ప్రాణంగా నిలుస్తాయని, ఇదొక వినూత్న థియేట్రికల్ అనుభూతిని ఇస్తుందని ధీమా వ్యక్తం చేశారు. తమిళ నటుడు సూరి తనదైన శైలిలో మాట్లాడుతూ.. తెలుగు ప్రేక్షకులు తనపై చూపిస్తున్న ఆప్యాయతకు కృతజ్ఞతలు తెలిపారు. త్వరలోనే తను అనర్గళంగా తెలుగు మాట్లాడటానికి ప్రయత్నిస్తానని చెప్పి అందరినీ నవ్వించారు. సుహాస్‌తో కలిసి పనిచేయడం తనకు ఎంతో తృప్తినిచ్చిందని, బోట్ రేసింగ్ మరియు యాక్షన్ ఎపిసోడ్స్ ఆడియన్స్‌కు సరికొత్త లోకాన్ని పరిచయం చేస్తాయని పేర్కొన్నారు. ఈ వేడుకలో పాల్గొన్న ఇతర నటినటులు, సాంకేతిక నిపుణులు మాట్లాడుతూ.. సముద్రపు అలల మధ్య, ప్రాణాలకు తెగించి ఈ సినిమాను ఎంతో కష్టపడి షూట్ చేశామని తెలిపారు. ముఖ్యంగా మైత్రి మూవీ మేకర్స్ అధినేత నవీన్ తమకు అందించిన అనూహ్య సహకారాన్ని, ఓటీటీ డీల్స్‌లో ఆయన చేసిన మేలును ప్రొడ్యూసర్ ఎల్రెడ్ కుమార్ కృతజ్ఞతాపూర్వకంగా గుర్తుచేసుకున్నారు. ఈ ఈవెంట్‌కు స్పెషల్ గెస్ట్‌గా విచ్చేసిన ప్రముఖ డైరెక్టర్ శివ నిర్వాణ మాట్లాడుతూ.. 'మండాడి' చిత్రంలోని కొన్ని కీలక సన్నివేశాలు, రషెస్ చూసినప్పుడే ఈ సినిమా ఘనవిజయం సాధించడం ఖాయమని ఫిక్స్ అయ్యానని, భవిష్యత్తులో ఈ చిత్రానికి జాతీయ స్థాయిలో ఎన్నో అవార్డులు దక్కుతాయని జోస్యం చెప్పారు. మరో అతిథిగా విచ్చేసిన హిట్ డైరెక్టర్ శైలేష్ కొలను మాట్లాడుతూ.. సముద్రంలో బోట్ షాట్స్ తీయడంలోని కష్టాలను ప్రస్తావిస్తూ, సినిమా మొత్తం సముద్రంలోనే తెరకెక్కించడం సాహసోపేతమని, ఇందుకు యూనిట్ అంకితభావాన్ని కొనియాడాలని అన్నారు. మొత్తానికి, విభిన్నమైన కథాంశంతో, పవర్‌ఫుల్ యాక్షన్ ఎమోషన్స్‌తో, బోట్ రేసింగ్ బ్యాక్‌డ్రాప్‌తో రాబోతున్న 'మండాడి' సినిమా సెప్టెంబర్ 10న ప్రేక్షకుల ముందుకు వచ్చి బాక్సాఫీస్ వద్ద ఎలాంటి సంచలనాలు సృష్టిస్తుందో వేచి చూడాలి!

Printed by Sree Seshasai Enterprises Published by Vaddi Srinivas Reddy on behalf of Sai Krishna Publications, printed at # 3-88, Chandra Theater, Main Road, Gosala, Krishna District - 521151 Andhra Pradesh and published at D.No. 6-121, 1st Floor, Sphurthy Building, Gosala Village, Urdu School Street, Vijayawada, Krishna District-521151 Andhra Pradesh. Editor Vaddi Srinivas Reddy- 94402 31967 . PRGI No. APTEL/26/A0119,